



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు



# ఈ అవార్డు.. సమష్టి విజయం



- మంత్రులు, అధికార్లు, ఉద్యోగులవల్లే సాధ్యమైంది
- అందరి సహకారంతోనే అభివృద్ధి.. సంక్షేమం
- పాలనా ప్రారంభంలో పరిస్థితిని చూసి కష్టమేమో అనుకున్నా
- టీం సహకారంతోనే అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం
- 'ఆత్మీయ విందు'లో సీఎం చంద్రబాబు నాయుడు

2





## ఢిల్లీలో కొత్త ఏపీ భవన్

- ఏపీ సంస్కృతి ప్రతిబింబించేలా ఆధునిక నిర్మాణం
- సరైన పేరు ప్రతిపాదించాలన్న సీఎం చంద్రబాబు
- భూ కేటాయింపులపై కేబినెట్ కీలక నిర్ణయాలు
- మూడున్నర గంటలపాటు సుదీర్ఘంగా మంత్రిమండలి భేటీ
- అజెండాలో దాదాపు 40 అంశాలపై చర్చ, ఆమోదం
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి పయ్యావుల

6

టెన్త్‌లో ఫలితాల్లో

## బీసీ బిడ్డల హవా

12



- ఏంజేపీలో 96.02 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రస్థాయి ఫలితాల కంటే 10 శాతం అధికం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అభినందనలు
- లోకేష్ కృషి వల్లే సత్ఫలితాలు వచ్చాయని వెల్లడి
- సచివాలయంలో స్వీట్లు పంచి సంబరాలు

చరిత్ర సృష్టించడానికి

## మేం రెడీ



- గత 22 నెలల్లో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదు
- టీమ్‌గా పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు మనమంతా సిద్ధం
- చంద్రబాబు విజనే మనందరికీ ప్రేరణ
- 4.0లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాం
- 2024-29 పాలన గురించి గొప్పగా చెప్పుకునేలా పని చేస్తాం
- 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' కార్యక్రమంలో మంత్రి లోకేష్

- వివరాలు 3 లో..



## అధ్యయన కేంద్రాలుగా వర్శిటీలు

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు
- టెక్నాలజీ కాంపిటెన్సీ వచ్చేలా విద్యార్థులకు శిక్షణ
- రాష్ట్ర యువతకు అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ నైపుణ్యాలు
- ఉద్యోగాల కల్పనపై సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం
- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలు తెస్తున్నామన్న మంత్రి లోకేష్

5



## వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టండి

కేబినెట్ ఇన్‌సైడ్ సమావేశంలో చంద్రబాబు

- వివరాలు 4 లో..

## నేడు 'పేదలకు సేవలో..' సీఎం

- కృష్ణాజిల్లా పమిడిముక్కలలో పర్యటన
- 'మేడే' సందర్భంగా కార్మికులతో ముఖాముఖి
- గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభించనున్న చంద్రబాబు

- వివరాలు 4 లో..



## టెన్త్‌లో ఫలించిన వందరోజుల ప్రణాళిక

- విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్లానింగ్ సక్సెస్
- గతేడాదికంటే టెన్త్ పరీక్షల్లో పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- అన్ని యాజమాన్య పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు
- గతేడాది 81.1 శాతం.. ప్రస్తుతం 85.25 శాతం నమోదు
- బాలురకంటే బాలికలు 5.22 శాతం ఎక్కువ ఉత్తీర్ణత
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 72.8 శాతం నుంచి 78.39 శాతానికి పెరిగిన ఉత్తీర్ణత
- సున్నాశాతం ఫలితాలు ప్రైవేటు స్కూళ్లు 11.. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 5

- వివరాలు 7 లో..

బాబు, లోకేష్‌పై నిందలు వేస్తాం..

## సాక్షిలో రాయిస్తాం.

అయినా జగన్ నేరాలపై నిజాలు కూడా టీడీపీ మాట్లాడరాదట!

- వివరాలు 8 లో..

## నడకలేదు, పరుగులే!

- పెట్టుబడుల ఆకర్షణ విషయంలో సీఎం చొరవ అది
- రాష్ట్రంలో నాలెడ్జ్ ఎకానమీకి బాటలేసింది చంద్రబాబే
- రిఫార్మర్‌కు సరైన నిర్వచనం సీఎం చంద్రబాబే
- సింగపూర్‌లో సిన్సియర్‌గా క్లాసులకు వెళ్లాం..
- ఆత్మీయ విందులో మంత్రుల ప్రశంసలు, సరదా వ్యాఖ్యలు

- వివరాలు 2 లో..

# ఈ అవార్డు.. సమష్టి విజయం

- మంత్రులు, అధికార్లు, ఉద్యోగులవల్లే సాధ్యమైంది
- అందరి సహకారంతోనే అభివృద్ధి.. సంక్షేమం
- పాలనా ప్రారంభంలో పరిస్థితిని చూసి కష్టమేమో అనుకున్నా
- టీం సహకారంతోనే అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం
- 'ఆత్మీయ విందు'లో సీఎం చంద్రబాబు నాయుడు







అమరావతి (చైతన్య రథం): తనకు ప్రతిష్ఠాత్మక బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు రావడం సమష్టి విజయానికి నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ అవార్డు మంత్రులు, అధికార్లు, ఉద్యోగులు సమష్టి కృషితో సాధించుకున్నదేనని పునరుద్ఘాటించారు. 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డును సీఎం చంద్రబాబు అందుకున్న సందర్భంగా మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులకు అమరావతి రాజధానిలోని సీఆర్డీయే కార్యాలయంలో 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' పేరిట ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సందర్భంలో ఆహూతులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "అవార్డులే కాదు, అంతకుమించి అభివృద్ధి, సంక్షేమం మీ అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు."రాజకీయాల్లో ఎన్నో విజయాలను చూశాను కానీ, 2024 ఎన్నికల్లో వచ్చిన విజయం గతంలో ఎప్పుడూ చూడలేదు. 22నెలల క్రితం పాలన ప్రారంభించినప్పుడు వ్యవస్థలను సరి చేయడం సాధ్యం కాదేమోనని అనుకున్నా. కానీ టీమ్ ఏపీ సహకారం వల్లే వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం... ఆ టీమ్‌వల్లే ఈ అవార్డు వచ్చింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రవేశపెట్టాం. అధికారులు అద్భుతంగా పనిచేశారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం వెంట పడడం కాదు, ప్రభుత్వమే పారిశ్రామికవేత్తల వద్దకు వెళ్లి మాట్లాడాలి. ఇలా చేయడంవల్లే అభివృద్ధి సాధించగలిగాం. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో చాలా మంది ప్రధానులను చూశాను. సరైన సమయంలో సరైన ప్రధానిగా నరేంద్ర మోదీ ఉన్నారు. గూగుల్ సంస్థ ఏపీకి రాగలిగిందంటే ప్రధాని మోదీనే కారణం. గూగుల్ సంస్థ ఏపీకి వచ్చేందుకు అవసరమైన నిబంధనలు చేశారు. ఆర్సెలార్ మిట్టల్ సంస్థ ఏర్పాటుకూ ప్రధాని చొరవే కారణం. ఆర్సెలార్ మిట్టల్ సంస్థ కోరిన విధంగా ముడి సరుకు రవాణాకు పైప్‌లైను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులివ్వాలని అధికారులను ఆదేశించి సహకరించారు. పెట్టుబడులు వచ్చాయి.ఉద్యోగాలు పెద్దఎత్తున వస్తున్నాయి. తక్కువ ధరకే విద్యుదుత్పత్తికి ప్రయత్నిస్తున్నాం. విద్యుత్ కొనుగోళ్ల ఛార్జీలను గతేడాది 30 పైసలు తగ్గించాం. ఈ ఏడాది 30 పైసలు తగ్గించేలా లక్ష్యం పెట్టుకున్నాం. రాజకీయంగా నష్టం జరుగుతుందని చెప్పినా...ప్రజలకు మేలు చేయడానికి విద్యుత్ సంస్కరణలు చేపట్టాం. ఇప్పుడు వన్ నేషన్- వన్ గ్రిడ్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసిన ప్రధాని దేశానికి అతిపెద్ద మేలు చేశారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ఏర్పాటు చేశాం. ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండ్ రావాలి. రాజకీయంగానూ... పరిపాలనా పరంగానూ నేను, పవన్ కళ్యాణ్ ఎలాంటి ఇగోలకు వెళ్లకుండా ప్రజల కోసం పనిచేస్తున్నాం. అధికారులు, ఉద్యోగులు కూడా విధులు నిర్వహించే విషయంలో ఇగోలకు పోకుండా రాష్ట్రం కోసం పనిచేయాలి. గూగుల్ పెట్టుబడులను మించి రిలయన్స్ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చింది. గూగుల్ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడితే... రిలయన్స్ 17 బిలియన్ డాలర్లు పెట్టుబడులతో ముందుకు వస్తోంది. ఇది రాష్ట్రానికి శుభపరిణామం" అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.





# నడకలేదు, పరుగులే!


- పెట్టుబడుల ఆకర్షణ విషయంలో సీఎం చొరవ అది
- రాష్ట్రంలో నాలెడ్జ్ ఎకానమీకి బాటలేసింది చంద్రబాబే
- రిఫార్మర్‌కు సరైన నిర్వచనం సీఎం చంద్రబాబే
- సింగపూర్‌లో సిన్సియర్‌గా క్లాసులకు వెళ్లాం..
- ఆత్మీయ విందులో మంత్రుల ప్రశంసలు, సరదా వ్యాఖ్యలు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరుగులు పెట్టించడమే తప్ప, స్థిమితంగా నడవడానికి లేదని మంత్రి టీజీ భరత్ వ్యాఖ్యానించారు. అయితే, పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతోపాటు... ఆ పరిశ్రమలు గ్రౌండింగ్ చేసేంత వరకు విశ్రమించవద్దని సీఎం చంద్రబాబు పదేపదే గుర్తు చేయడంవల్లే పెట్టుబడుల రాక వరదలా వెల్లువెత్తుతోందని మంత్రి భరత్ వ్యాఖ్యానించారు. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు వచ్చినందుకు మంత్రులు, సీఎస్, డీజీపీ, సెక్రటరీలు, హెచ్‌వోడీలకు సీఎం చంద్రబాబు నాయుడు గురువారం అమరావతి సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు సీఎం సమర్థతను ప్రశంసిస్తూనే, చంద్రబాబు టీంలో పనిచేయడానికి తాము ఎంత ఉత్సాహంగా ఉన్నామో అనుభవాలను ఏకరువు పెట్టారు. ఈసందర్భంలో మంత్రి భరత్ మాట్లాడుతూ.. చంద్రబాబు సూచనలతో పరిశ్రమలు గ్రౌండింగ్ చేసేందుకు.. గ్యాప్‌రాకుండా ఉండేందుకు 90మంది వాట్సాప్ గ్రూప్ పెట్టుకుని పని చేస్తున్నామని పరిశ్రమల మంత్రి భరత్ వివరించారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. "ఇంజనీరింగ్ విద్య కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితులున్న రోజుల్లో ఇంజనీరింగ్ కాలేజీలతో రాష్ట్రాన్ని నింపి నాలెడ్జ్ ఎకానమీకి చంద్రబాబు బాటలు వేశారు. పట్టిసీమను ఒట్టిసీమ అంటూ చంద్రబాబు నిర్ణయాన్ని గేలిచేస్తే.. అదే పట్టిసీమలో రూ.50 వేల కోట్ల సంపద సృష్టించి చూపించారని, దటీజ్ సీఎం చంద్రబాబు" అంటూ ప్రశంసించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రికార్డు స్థాయిలో హంద్రీ-నీవా జలాలను రాయలసీమకు తీసుకెళ్లామని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. "సింగపూర్ దేశానికి అధ్యయనం చేసేందుకు వెళ్లినప్పుడు తిరిగి వెళ్లాక చంద్రబాబు ఏం అడుగుతా రోననే భయంతో.. ఆ దేశంలో 7 రోజులపాటు క్లాసులకు అటెండ్ అయ్యామని నవ్వుతూ వ్యాఖ్యానిం చారు. తాను చదువుకునే రోజుల్లో కూడా కాలేజీకి సరదాగా వెళ్లేవాడినని... సింగపూర్ పర్యటనలో మాత్రం భుజాన బ్యాగ్ వేసుకుని సీరియస్‌గా క్లాసులకు హాజరయ్యామంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించి నవ్వులు కురిపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని నిర్ణయించుకున్న కేంద్రాన్ని ఒప్పించి రూ.11 వేల కోట్లకుపైగా సీఎం నిధులు ఇప్పించారని, ఇది అసాధారణ పరిణామమని సత్యకుమార్ పేర్కొంటూ.. అంత పెద్ద నిర్ణయంలో ఏంచెప్పి ప్రధాని మనస్సు మార్చారో తెలియదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రిఫార్మర్ అనే పదానికి రాజకీయాల్లో నిజమైన నిర్వచనం సీఎం చంద్రబాబు. ఏమాత్రం రిలాక్స్ కాకుండా నిరంతరం తాను పని చేయడంతో పాటు.. టీమ్ కూడా అలాగే పని చేయాలని... అప్పుడే అభివృద్ధి-సంక్షేమం అందించగలమని సీఎం చంద్రబాబు పదేపదే చెప్పే విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

# చరిత్ర సృష్టించడానికి మేం రెడీ

- గత 22 నెలల్లో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదు
- టీమ్‌గా పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు మనమంతా సిద్ధం
- చంద్రబాబు విజనే మనందరికీ ప్రేరణ
- 4.0లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాం
- 2024-29 పాలన గురించి గొప్పగా చెప్పుకునేలా పని చేస్తాం
- 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' కార్యక్రమంలో మంత్రి లోకేష్



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ప్రేరణ పొంది.. చరిత్ర సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. గత 22 నెలల్లో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదని, మంత్రులు అధికారులు టీమ్‌గా పనిచేసి లక్ష్యాలు సాధించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డును సీఎం చంద్రబాబు అందుకున్న సందర్భంగా మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులకు అమరావతి రాజధానిలోని సీఆర్డీయే కార్యాలయంలో 'డిన్నర్ విత్ ద రియల్ విన్నర్స్' పేరుతో ఇచ్చిన విందు సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. "2024 ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. 25మంది మంత్రుల్లో 17మంది కొత్తవారు. శాసనసభ్యుల్లో 50శాతం మొదటిసారి ఎన్నికయ్యారు. 2019నుంచి 2024 మధ్య పనిచేసిన టీం అంతా ఇక్కడున్నారు. అయితే ఇప్పుడే ఎందుకు ఫలితాలు సాధిస్తున్నాం? ఆ మార్పునకు కారణం మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు" అని లోకేష్ స్పష్టం చేశారు. "బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. అక్కడ లీడర్ షిప్‌పై ఒక సెషన్ జరిగింది. ఆ క్లాస్‌కు నేను హాజరయ్యాను. అక్కడ కోచ్ చెప్పిన విషయం నా దృష్టిని ఆకర్షించింది. ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తీ కూడా ఒక సంస్థలాంటిదే. చివరకు ఆ సంస్థను నడిపే నాయకుడి ప్రతిబింబంగా మారుతుందని చెప్పారు. ఇదే విషయాన్ని మనం రాష్ట్రంలో చూస్తున్నాం. ఇది సాధ్యం కాదని మనం ఎవరైనా చంద్రబాబుకి చెప్పినప్పుడు.. ఆయన సమాధానం ఎప్పుడూ 'ఎందుకు కాదు' అనే. మనల్ని ఆలోచనల పరిమితిదాటి ఆలోచించమని ప్రోత్సహించడం, మనల్ని పుష్ చేయడం. ఇవే మనం ఇప్పటివరకు సాధించిన విజయాలకు కారణం. ఆయన వ్యక్తిత్వం విషయానికి వస్తే, ఆయన చాలా త్వరగా ఫలితాలు రావాలని కోరుకునే నాయకుడు. వేగంగా మార్పులు తీసుకురావాలనుకునే సంస్కరణవాది" అని లోకేష్ పేర్కొన్నారు.

ఇక్కడ ఉన్న చాలామందికి ఆయన మొదటి, రెండో ముఖ్యమంత్రి కాలంగురించి విని ఉంటారు. కానీ ప్రత్యక్షంగా అనుభవించి ఉండరు. ఆ సమయంలో తీసుకున్న నిర్ణయాలు, ఆయన పని విధానం గురించి అర్థం చేసుకునే అవకాశం అందరికీ రాలేదు. నా అభిప్రాయం ప్రకారం, ఆయనను చాలామంది సరిగా అర్థం చేసుకోలేదు. ఆయన ఐటీ సంస్కరణలు తీసుకువచ్చినప్పుడు, టెక్నాలజీ గురించి మాట్లాడినప్పుడు, కంప్యూటర్ అన్నం పెడుతుందా? అని చాలామంది ప్రశ్నించారు. కానీ ఇప్పుడు ఆ ప్రశ్నకు సమాధానం లభించింది. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5వేల ఎకరాలు అవసరమా? అని అప్పట్లో ప్రశ్నించారు. ఇప్పుడు ఆ విమానాశ్రయాన్ని చూసి సమాధానం తెలుసుకోవచ్చు.

నేను నా అనుభవాన్ని చాలామందితో పంచుకుంటుంటాను. ఒకరు ఆయనను తండ్రితో పోల్చారు. చిన్నప్పుడు తండ్రి ఎప్పుడూ పనుల్లో బిజీగా ఉంటారు. మనం ఎక్కువ సమయం తల్లితో గడుపుతాం. తల్లి ప్రేమను పొందుతాం. కానీ పెద్దవాళ్లమయ్యాక.. కుటుంబాన్ని నిలబెట్టడానికి తండ్రి చేసిన త్యాగాలు అర్థమవుతాయి. అదేవిధంగా నేను మన ముఖ్యమంత్రిని ఆంధ్రప్రదేశ్‌కు తండ్రిగా చూస్తాను" అన్నారు.

## 4.0లో భాగంకావడం అదృష్టంగా భావిస్తున్నాం

"ఇప్పుడు మేం మంత్రులుగా చంద్రబాబునాయుడు 4.0లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాం. ముఖ్యమంత్రిగా ఇది ఆయన నాలుగో పర్యాయం. కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు తీసుకొచ్చినప్పుడు ఆయన ఎప్పుడూ మాకు మద్దతు ఇచ్చారు. దీనికి మంచి ఉదాహరణ లిఫ్ట్ పాలసీ. ఫార్చ్యూన్ 500 కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయించాలనే ప్రతిపాదనను తీసుకువచ్చినప్పుడు ఆయనను ఒప్పించడానికి 30 నిమిషాలు పట్టింది. కానీ ఒకసారి ఒప్పుకున్న తర్వాత.. ఆ నిర్ణయంవల్ల గూగుల్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లాంటి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు రావడానికి మార్గం సుగమమైంది. గత 22 నెలలు ఆయనతో కలిసి పనిచేయడం అద్భుత అనుభవం" అని లోకేష్ గుర్తు చేసుకున్నారు.

## 2024-29 పాలన గురించి గొప్పగా చెప్పుకునేలా పనిచేస్తాం

"నా వ్యక్తిగత లక్ష్యం ఒక్కటే.. 1995-99నాటి పాలనకంటే.. 2024నుంచి 2029 వరకు ప్రభుత్వ కాలం గొప్పదని చంద్రబాబు స్వయంగా చెప్పాలి. ఎందుకంటే చంద్రబాబునాయుడు ఎప్పుడూ 95-99 కాలాన్ని ప్రస్తావిస్తుంటారు. మంత్రులుగా మేమంతా చంద్రబాబు విజన్‌తో ప్రేరణ పొందుతున్నాం. మాకు ఎలాంటి ఈగో లేదు. ప్రతి కేబినెట్‌కు ముందు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో కలిసి సమస్యలను చర్చిస్తాం. శాఖలమధ్య పోటీగా కాకుండా.. ఒక టీమ్‌గా పనిచేస్తాం. మన లక్ష్యం ఒక్కటే.. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం" అన్నారు.

## గత 22 నెలల్లో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదు

"అహంకారం పెద్ద జబ్బు. సీనియారిటీ కాదు.. ఈగో కాదు.. ఫలితాలే ముఖ్యం. 75 ఏళ్ల వయసులో నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న వ్యక్తికి అహంకారం లేకపోతే.. మనకు అహంకారం ఉండాల్సిన అవసరం లేదు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ ఇప్పుడు అత్యసరం. 800 ప్రాజెక్టులను ట్రాక్ చేసి, గ్రౌండ్ చేయడం చాలా పెద్ద విషయం. గత 22 నెలల్లో ఏపీ సాధించిన విజయాలు మరే రాష్ట్రం సాధించలేదు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. మనం చరిత్ర సృష్టించడానికే ఇక్కడ ఉన్నాం. భారతదేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయి. 50శాతం ఎప్పుడు సాధిస్తారని సీఎం అడిగారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పని చేయడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. తామంతా ఒక టీమ్‌గా, ఎలాంటి ఈగో లేకుండా ఒకరినొకరం ప్రోత్సహించుకుంటూ లక్ష్యాలను చేరుకుంటాం" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.



# వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టండి

## కేబినెట్ ఇన్‌సైడ్ సమావేశంలో చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): సింగపూర్‌లో మంత్రుల శిక్షణపై వైసీపీ నేతలు రాద్ధాంతం చేయడంపై రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పెద్ద చర్చే సాగింది. క్యాబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక మంత్రులతో తాజా పరిణామాలపై చర్చించారు. ఆ సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. 'మనం పాలనలో శిక్షణ కోసం, సంపద పెంపుకోసం వెళ్లాం. సింగపూర్ వాళ్లు ఎవరికీ ఇవ్వని అవకాశం మనకు ఇచ్చారు. దీనిపై కూడా వైసీపీ వాళ్లు రాద్ధాంతం చేయడాన్ని మనం ఖండించాలి. రాజధాని అమరావతిపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని దీటుగా ఎదుర్కోవాలి. ఇతర దేశాల్లో చదరపు అడుగు ఎంతకు నిర్మిస్తున్నారు అనేది మనం తెలుసుకుని అసలు నిజాలు చెప్పాలి. విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఇదే టెక్నాలజీతో చేసే నిర్మాణాలకంటే మనం తక్కువ ఖర్చుతో చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు విశ్లేషణాత్మకంగా చర్చించారు.

### దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి..

అసెంబ్లీ, సచివాలయం భవనాలు, హైకోర్టు ఐకానిక్ స్ట్రక్చర్స్ వస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా చేస్తున్నారని.. అందరూ వచ్చి చూసేలా భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. ధరల విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ప్రతిపక్షం చేసే విమర్శలకు సరైన సమాధానమివ్వాలన్నారు. 'తొలుత ఇంధన కొరత వచ్చింది... మనం వెంటనే స్పందించాం. ఇప్పుడు పెట్రోల్ బంకులలో సాధారణ పరిస్థితి ఉంది' అని అన్నారు. ప్రతిపక్షం చేస్తున్న తప్పుడు ప్రచారంపై మంత్రులు వెంటనే స్పందించాలన్నారు. సింగపూర్‌వెళ్లి వచ్చిన మంత్రులు.. అక్కడ నేర్చుకున్న విషయాలను మిగతా మంత్రులకు వివరించే అంశంపై కూడా త్వరలోనే సమావేశం అవుదామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### ఏఐ, ఐటీపై పరిజ్ఞానం పెంచుకోవాలి..


ఒకస్థాయి ఉద్యోగుల నియామకాల్లో ఏఐ, ఐటీ తప్పనిసరి చేయాలని సీఎం అన్నారు. మంత్రులు కూడా ఏఐ, ఐటీపై పరిజ్ఞానం పెంచుకోకుంటే వెనుకబడిపోతారని హెచ్చరించారు. జలాధార, జలహారతి కార్యక్రమాల్లో మంత్రుల భాగస్వామ్యం ఉండేలా చూడాలని మంత్రి రామానాయుడికి సీఎం సూచించారు. పెరుగుతున్న ఎండలు, ఉష్ణోగ్రతలపై మంత్రులు పర్యవేక్షించాలని.. ప్రజలకు తగిన జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ముందస్తు చర్యలను మంత్రులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

### సింగపూర్ అభివృద్ధి ఓ స్ఫూర్తిదాయకం..

సూర్యఘర్ లక్ష్యాల కోసం ఇంకా బాగా పనిచేయాలని మంత్రి గొట్టిపాటి రవికి సీఎం సూచించారు. సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యాలను సీఎంకు మంత్రి వివరించారు. సింగపూర్ పర్యటనకు వెళ్లొచ్చిన మంత్రులు అక్కడి అధ్యయనాలపై వ్యక్తిగతంగా నివేదికలు ఇవ్వాలన్నారు. సింగపూర్ అభివృద్ధి చెందిన తీరు ఓ స్ఫూర్తిదాయకమని చెప్పుకొచ్చారు. పుట్టపర్తి వద్ద ఏరోస్పేస్ డిఫెన్స్ క్లస్టర్‌కు వేగంగా అనుమతులు రావటం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగమని చంద్రబాబు ప్రశంసించారు. గూగుల్ని రాష్ట్రానికి తెచ్చే క్రమంలో చోటుచేసుకున్న వివిధ పరిణామాలను గుర్తు చేసుకుంటూ.. అమెరికా పర్యటనలో గూగుల్ ప్రతినిధులను మంత్రి లోకేశ్ కలిసి ఒప్పించిన తీరును చర్చించారు.

# నేడు 'పేదలకు సేవలో..' సీఎం

- కృష్ణా జిల్లా పమిడిముక్కలలో పర్యటన
- 'మేడే' సందర్భంగా కార్మికులతో ముఖాముఖి
- గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రారంభించనున్న చంద్రబాబు




అమరావతి (చైతన్యరథం): కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలకు వెళ్లనున్నారు. ఎన్టీఆర్ భరోసా లబ్దిదారులతో మాట్లాడనున్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.63,158 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో పేదలకు అందించింది. ప్రతీ నెల కృష్ణాజిల్లాలో 2.34 లక్షల మందికి రూ.102 కోట్లను ప్రభుత్వం పింఛను రూపంలో ఇస్తోంది. పింఛన్ల పంపిణీ అనంతరం 'మేడే'ను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు భవన నిర్మాణ కార్మికులతో సమావేశమవుతారు. గుడ్లవల్లేరులో నిర్మించిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

కృష్ణా జిల్లాలో పేదల సేవలో, మేడే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసంనుంచి బయలుదేరి పమిడిముక్కల మండలం వీరంకిలాకు గ్రామానికి ఉదయం 10.15 గంటలకు చేరుకుంటారు. అక్కడినుంచి పమిడిముక్కలకు 10.25 గంటలకు చేరుకుని ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలోని ఎన్టీఆర్ భరోసా లబ్దిదారుల ఇళ్లకు వెళ్తారు. వారికి పింఛను అందించి వారితో కాసేపు మాట్లాడతారు. ఎన్టీఆర్ కాలనీ నుంచి వీరంకిలాకు గ్రామానికి చేరుకుంటారు. మేడే సందర్భంగా మధ్యాహ్నం 12.45 గంటలకు భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.55కు పామర్రు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

కార్యక్రమం ముగించుకుని 3.40 గంటలకు గుడ్లవల్లేరు చేరుకుంటారు. 3.50 గంటలకు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

*సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును.. మాజీమంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 20న సీఎం జన్మదినాన్ని పురస్కరించుకుని 11నుంచి 20వరకు 10 రోజులపాటు రాయదుర్గంలో వివిధ కార్యక్రమాలను కాల్వ శ్రీనివాసులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీలు, అన్నదానం, వస్త్ర వితరణతోపాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలని 'నాయకుడా వర్ధిల్లు... నిండు నూరేళ్లు' అనే పుస్తకంలో వివరించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులను అభినందించిన సీఎం తనపట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.*



### రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు

# మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం

*అమరావతి (చైతన్య రథం): ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎన్ నాయుడు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. జీఎన్ నాయుడు మరణం పారిశ్రామికరంగానికి తీరని లోటని సీఎం వ్యాఖ్యానించారు. ఏపీకి చెందిన జీఎన్ నాయుడు... 1983లో యానాంలో సిరామిక్స్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి వెల్లడించారు.*



# అధ్యయన కేంద్రాలుగా వర్సిటీలు

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు
- టెక్నాలజీ కాంపిటెన్సీ వచ్చేలా విద్యార్థులకు శిక్షణ
- రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ నైపుణ్యాలు
- ఉద్యోగాల కల్పనపై సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం
- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలు తెస్తున్నామన్న మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా వివిధ కోర్సులు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని సీఎం సూచించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యాశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తోన్న కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థ మార్పులను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. గేమ్ చేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ లాంటి రంగాల్లోనూ కొత్త కోర్సులు రావాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా ఈ కోర్సులు రావాల్సిన అవసరముందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొట్ట మొదటగా కోర్సును ప్రారంభించటంపై ఆంధ్రా యూనివర్సిటీని సీఎం అభినందించారు. ఏపీలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయంగా పోటీ పడాలని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 200యూనివర్సిటీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ యూనివర్సిటీకి ఏదో ఒక పారిశ్రామిక సంస్థ అనుసంధానమై ఉండేలా చూడాలని సూచనలు చేశారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా వివిధ విదేశీ భాషల్లో శిక్షణ కోసం ఓ విభాగం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను అందిపుచ్చుకునేలా ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకూ వివిధ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు కెరీర్ బిల్డింగ్, కేరక్టర్ బిల్డింగ్ జరిగేలా ఉండాలన్నారు. ఆరోగ్యం, టెక్నాలజీతో పాటు బెస్ట్ ప్రాక్టీసెస్‌ను నేర్పించేలా ఈ పాఠ్యాంశాలు ఉండాలని సూచించారు. దీని కోసం ఐఐటీ చెన్నై సహా వివిధ ప్రతిష్టాత్మక సంస్థల నుంచి సిఫార్సులు తీసుకుని విద్యాశాఖలో అమలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యూనివర్సిటీ రికార్డులను కూడా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలో వివిధ ప్రతిష్టాత్మక సంస్థలు లాజిస్టిక్స్, ఏవియేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.

## త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్

విద్యార్థులకు అన్ని పోషకాలూ అందేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థుల మానసిక, భౌతిక ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా తల్లితండ్రులు కూడా విద్యార్థుల హాజరు, వారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా అత్యుత్తమ టీచర్లతో వీడియో మాధ్యమంలో పాఠాలు చెప్పిస్తే బోధనలో నాణ్యత పెరుగుతుందని సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సాంకేతికతతో కూడిన ఉత్తమ విద్యను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పీ4 లాంటి కార్యక్రమాలను అనుసంధానం చేసుకుని మౌలిక సదుపాయలను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు కొత్త ఆలోచనలు వచ్చేలా విద్యార్థులతో ఓ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించాలని స్పష్టం చేశారు. దానికి  స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌గా పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఆటిజం సహా దివ్యాంగ విద్యార్థులకు విద్యాబోధనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్రీడలతోపాటు మానసికోల్లాసానికి కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌ను పెంచాలన్నారు. ఇంటర్‌లో విద్యార్థులకు వివిధ కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని దీనిపై అధ్యాపకులకు కూడా రీఓరియంటేషన్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో టెక్నాలజీ కాంపీటెన్సీ పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమం ద్వారా పరిశుభ్రతా అంశాలపై విద్యార్థుల్లో ఎలాంటి మార్పులు వచ్చాయన్నది అధ్యయనం చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

## నైపుణ్యాలపై ర్యాండమ్ స్కిల్ ఆడిట్

రాష్ట్రంలోని యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఏమేరకు నైపుణ్యాలు కలిగి ఉన్నారో ర్యాండమ్ స్కిల్ ఆడిట్ నిర్వహించాలని సీఎం సూచనలు చేశారు. ఈ విషయంలో ప్రపంచస్థాయి అత్యుత్తమ నైపుణ్యాలు మన యువతకు అందేలా చేయాలని.. దీని కోసం ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలతో అనుసంధానం చేసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేసేందుకు స్కిల్ గ్యాప్ అడ్వైజర్లను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు మెరుగవటంతో పాటు ఆర్థిక లావాదేవీలు పెద్దఎత్తున జరుగుతాయన్నారు. పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ లు ఇంజనీరింగ్ కళాశాలల ద్వారా ఎనర్జీ,లాజిస్టిక్స్, క్వాంటం,ఏఐలాంటి రంగాల్లో నైపుణ్యాలు పెరగాలని స్పష్టం చేశారు. దీంతో పాటు జిల్లాల వారీగా స్కిల్ మ్యాప్ తయారు చేయటం ద్వారా ఏ ప్రాంతంలో ఎంతమంది నిపుణుల లభ్యత ఉందనేది తెలియచేసే అవకాశ ముందన్నారు. గడచిన 22 నెలల్లో ఇప్పటి వరకూ 7 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయని.. స్వయం ఉపాధితో పాటు ఎంఎస్ఎంఈల ద్వారా కూడా ఉపాధి వచ్చిందన్నారు. వివిధ శాఖల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చిన వివరాలను ఓ సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. త్వర లోనే నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను వెల్లడించాలని సూచించారు.

## అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్

రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో రీస్ట్రక్చర్ చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. సమీక్షలో భాగంగా విద్యాశాఖలో చేపడుతున్న విప్లవాత్మక సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. వన్ క్లాస్ వన్ టీచర్ పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ ను కూడా పెంచుతున్నామని వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు బ్రిడ్జి కోర్సులు కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ ఎన్సీఆర్టీ సహకారంతో పాఠ్యాంశాలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తున్నట్టు తెలిపారు. బోధనా మాధ్యమాలను అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఫిన్ ల్యాండ్ లాంటి దేశాలకు పంపుతున్నట్టు సీఎంకు తెలియచేశారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరరీలో ఏపీని అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని మంత్రి వివరించారు. టీచర్ - స్టూడెంట్ - అవుట్ కమ్ అనే విధానంలో విద్య శాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. బడికోసం పేరిట మౌలిక సదుపాయాలను కల్పించటంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రికి తెలియచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాలేజీ అవర్స్ ను పెంచి విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేలా శిక్షణ ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఫలితాలు మెరుగయ్యేలా ఇంటర్ సప్లిమెంటరీ రాసుకునేందుకు విద్యార్థులకు వెసులుబాటు కల్పించామని తెలియచేశారు. నైపుణ్యాభివృద్ధి కల్పనలో భాగంగా అందరికీ స్కిల్ అసెస్మెంట్ చేస్తున్నామన్నారు. ఈ సమీక్షకు పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.



చైతన్యరథం



# ఢిల్లీలో కొత్త ఏపీ భవన్

- ఏపీ సంస్కృతి ప్రతిబింబించేలా ఆధునిక నిర్మాణం
- సరైన పేరు ప్రతిపాదించాలన్న సీఎం చంద్రబాబు
- భూ కేటాయింపులపై కేబినెట్ కీలక నిర్ణయాలు
- మూడున్నర గంటలపాటు సుదీర్ఘంగా మంత్రిమండలి భేటీ
- అజెండాలో దాదాపు 40 అంశాలపై చర్చ, ఆమోదం
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి పయ్యావుల




అమరావతి (చైతన్య రథం): ఉద్యోగ, మౌలిక వసతులు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పెట్టుబడులవంటి అంశాలపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 48వ క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్యపన్నులు, శాసన సభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాకు వివరించారు. దాదాపు మూడున్నర గంటలపాటు సమావేశమైన మంత్రివర్గం.. 40కిపైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలో 11.5 ఎకరాల్లో రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపిందన్నారు. దీనిని ఎన్‌బీసీసీకి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. భవన నిర్మాణం ఏపీ సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని.. అందులో సమావేశ మందిరం కూడా ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి పయ్యావుల వెల్లడించారు. కొత్త ఏపీ భవనానికి ఏదైనా మంచి పేరు పెట్టాలని సీఎం చంద్రబాబు కోరారన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏపీ భవన్‌లో మేనేజర్ పోస్టు కొత్తగా క్రియేట్ చేశామని ఆయన వివరించారు. పంచాయితీ రాజ్ శాఖలో 20 పోస్టులు సప్రస్ చేసి.. అవసరం ఉన్న చోట ఆ పోస్టులను క్రియేట్ చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు అదనంగా నిధులు కేటాయింపులు చేయాల్సి వచ్చిందని మంత్రి వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల ప్రకాశం జిల్లా రామాయపట్నంలోని గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం త్వరగా పూర్తవుతుంది మరియు ఇది రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను మరింత పెంపొందిస్తుందని భావిస్తున్నారు. మున్సిపాలిటీల్లో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ఫీజులో మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి పయ్యావుల తెలిపారు. లోకల్ బాడీలలో షాపింగ్ కాంప్లెక్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో యూనిఫాం రేటుపెట్టి 7శాతం పెంచాలని నిర్ణయించినట్టు చెప్పారు. మున్సిపాలిటీల్లో మ్యుటేషన్ ఛార్జీలు వేర్వేరుగా ఉన్నాయని.. వాటన్నింటినీ యూనిఫాం పాలసీ కిందకి తీసుకురావాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. కృష్ణానది కరకట్టను ఆధునీకరించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రూ.443 కోట్లతో కరకట్ట విస్తరించాలని నిర్ణయించామన్నారు. రాజధాని అమరావతిలో ఆఫీసుల కాంప్లెక్స్‌లకు సంబంధించి సెక్రటేరియట్, జీఏడీ టవర్స్, గ్లాస్ క్లాడింగ్, క్రౌన్ ఏర్పాటుకు రూ.2,540 కోట్ల కేటాయించినట్లు మంత్రి పయ్యావుల వివరించారు. సెల్ అండ్ కోర్ స్ట్రక్చర్ కోసం రూ.1,200 కోట్లు, క్వాంటం వ్యాలీకి 37 లక్షల చదరపు అడుగుల నిర్మాణం ఉంటుందన్నారు. ఒక్కొక్కటి 43 టవర్స్ ఉంటాయని.. రెండు టవర్స్‌లోనే అన్ని ఫెసిలిటీలు ఉంటాయని చెప్పారు. అసెంబ్లీ బిల్డింగ్‌కు సంబంధించి సెంట్రల్ స్పైర్, పార్కింగ్ తదితర సౌకర్యాల కోసం నిధులు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్టు వివరించారు.

రూ.580 కోట్లతో ఉండవల్లిలో చేపడుతున్న ట్రంక్, అథర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. ఎన్ 10నుంచి ఎన్ 13 వరకూ జంక్షన్‌కు అండర్ గ్రౌండ్ కేబుల్‌లో రీ రూటింగ్‌కు రూ.100 కోట్లు అదనంగా పెంచామన్నారు. గతంలో సీఆర్డీఏ భూములను ఆర్ 5 జోన్ పేరుతో రెవెన్యూ శాఖకు ఇచ్చామని గుర్తు చేశారు. ఆ భూములను వెనక్కి తీసుకోవడానికి అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. యాన్యుటీ విలువ పెంచాలని రైతులు గతంలో ప్రభుత్వాన్ని కోరారని.. అందుకు కేబినెట్ అంగీకరించిందన్నారు. సీఆర్డీఏకు కొత్త కేటాయింపులు ఇవ్వడానికి అనుమతివ్వడం జరిగిందన్నారు.

సెబీ, స్వామి నారాయణ్, డీఏవీ పబ్లిక్ స్కూల్‌కు భూములు ఇవ్వాలని సీఆర్డీఏ చేసిన సిఫార్సుకు ఓకే చెప్పామన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3.57 లక్షలు ఇవ్వనుండగా... ఆర్ అండ్ ఆర్ కాలనీలో కాక బయట కట్టుకుంటామంటే.. భూమికి రూ.లక్ష అదనంగా చెల్లించాలని మంత్రి మండలిలో ఆమోదం తెలిపినట్టు మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. మంత్రిమండలి ఆమోదించిన అంశాల పూర్తి వివరాలు:

ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌లో 385 కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు అప్‌గ్రేడ్ చేయడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇందుకు సమానమైన సంఖ్యలో కానిస్టేబుల్ పోస్టులు రద్దవుతాయి. హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా న్యాయవ్యవస్థ, రాష్ట్రంలోని న్యాయ విభాగాల్లో మొత్తం 21 నూతన పోస్టుల (1 చీఫ్ కోర్ట్ మేనేజర్, 5 సీనియర్ కోర్ట్ మేనేజర్లు, 15 కోర్ట్ మేనేజర్లు) కల్పనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతి జోన్-11 పరిధిలోని ఉండవల్లిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద లేఔట్లలో రోడ్లు, నీటి కాలువలు, నీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ, పవర్ అండ్ ఐసీటీ యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్‌లైన్, ఎస్టీపీ, అవెన్యూ ప్లాంటేషన్ పనులకు రూ.580.00 కోట్ల పరిపాలన ఆమోదం ఇవ్వడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రెండేళ్లలో కాంట్రాక్ట్ పద్ధతిలో టెండర్లు పిలవడానికి అనుమతి ఇచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లాలో హంద్రి నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ - ఫేజ్-2 పరిధిలో పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌ను సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌తో ఆధునీకరించే పనికి సవరించిన అంచనా పరిపాలన ఆమోదం ఇవ్వడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

హంద్రి నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ మొత్తం పొదుపుల నుండి అదనపు మొత్తం సమకూరుతుంది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఆర్‌డీవో ఆధ్వర్యంలో చేపడుతున్న డిఫెన్సు పరిశ్రమకు దాదాపు 600 ఎకరాల భూమి కేటాయింపుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. శ్రీకాకుళం జిల్లాలోని బుడగట్లపాలెం, అనకాపల్లి జిల్లాలోని పుడిమడక, ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నంలో మూడు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సవరించిన పరిపాలనా ఆమోదం మొత్తం రూ.1586.69 కోట్లకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా మత్స్యకారులకు ఆధునిక ల్యాండింగ్, బెర్తింగ్ సౌకర్యాలు లభించడంతో పాటు చేపల ఉత్పత్తి మెరుగుపడుతుంది. దాదాపు 12,700 మందికి పైగా మత్స్యకారులకు జీవనోపాధి అవకాశాలు లభిస్తాయి మరియు ఈ హార్బర్లు సుమారు 2,530 ఫిషింగ్ నౌకలకు మద్దతు ఇస్తాయి. వీటిలో అదనంగా పుడిమడక ఫిషింగ్ హార్బర్‌ను సమీప పారిశ్రామిక క్లస్టర్లకు ఉపయోగపడేలా కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల తీరప్రాంత లాజిస్టిక్స్ మెరుగుపడటమే కాకుండా ప్రధాన పోర్టులపై ఆధారపడటం, రోడ్ల రద్దీ తగ్గుతాయి. మొత్తంగా ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర ఆర్థిక వృద్ధి వేగవంతం అవ్వడంతో పాటు, మత్స్యరంగ మౌలిక సదుపాయాల బలోపేతం మరియు సమగ్ర తీరప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుంది. 2024-25లో ఏర్పాటు చేసిన ఏజెన్సీలతో కిసాన్ డ్రోన్లతో కూడిన విలేజ్-లెవల్ ఫార్మ్ మెషినరీ బ్యాంకులను 2025-26కు కూడా అదే నిబంధనలు, సాంకేతిక వివరాలు, 2024-25కు వర్తించే షరతులతో కొనసాగించడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 2025-26కు నిధులు కేటాయించడానికి అనుమతిస్తూ, "భారత ప్రభుత్వం వద్ద లాప్స్ అయిన నిధులను తిరిగి పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టుటకు" శాఖకు అనుమతి ఇచ్చింది. ఏపీపీసీ/ డిస్కాంలకు ఎంఎస్ ఆర్ఈసి నుంచి తీసుకున్న ఎంటీఎల్ రుణాలు రూ.7000 కోట్లకు కొన్ని షరతులతో ప్రభుత్వ హామీ పొడిగింపుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మీడియా సమావేశంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

# టెన్త్‌లో ఫలించిన వందరోజుల ప్రణాళిక

- విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్లానింగ్ సక్సెస్
- గతేడాదికంటే టెన్త్ పరీక్షల్లో పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- అన్ని యాజమాన్య పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు
- గతేడాది 81.1 శాతం.. ప్రస్తుతం 85.25 శాతం నమోదు
- బాలురకంటే బాలికలు 5.22 శాతం ఎక్కువ ఉత్తీర్ణత
- ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 72.8 శాతం నుంచి 78.39 శాతానికి పెరిగిన ఉత్తీర్ణత
- సున్నాశాతం ఫలితాలు ప్రైవేటు స్కూళ్లు 11.. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 5




పూను స్పర్ధలు విద్యలందే- వైరములు వాణిజ్యమందే.. అని ఎలుగెత్తి చాటిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు మంత్రి నారా లోకేష్. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్ చేపట్టారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. -వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయడంతో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఉత్తీర్ణతా శాతం మెరుగుపడింది.

## 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను 06-12-2025 నుండి 15-03-2026 పరీక్షల ఆరంభం అయ్యేవరకూ క్రమపద్ధతిలో అమలు చేశారు. ఈ కాలంలో విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడిలేకుండా 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఇందులో వచ్చిన మార్కులను ఎల్‌ఈఏపి మొబైల్‌యాప్‌లో పొందుపరిచారు. ప్రతిరోజూ 6 డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా లీప్ యాప్‌లో మార్కులను విశ్లేషించారు.

## షైనింగ్ స్టార్స్ .. రైజింగ్ స్టార్స్

స్లిప్ టెస్టులలో విద్యార్థుల సామర్థ్యాలను డ్యాష్ బోర్డు ద్వారా మదింపుచేసి షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌గా విద్యార్థులను గుర్తించారు. వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధించారు. సబ్జెక్టుల వారీగా సందేహాలను తీర్చే పద్ధతిని అవలంబించారు.

## సాధనే విజయం

"సాధనమున పనులు సమకూరు ధరలోన -అన్న వేమన మాట స్ఫూర్తిగా విద్యార్థులతో క్రమపద్ధతిలో చేయించిన సాధన వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. వీరి నిరంతర సాధనకు అవసరమైన మోడల్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులు విద్యాశాఖ ప్రచురించి ఉచితంగా అందించింది. వీటి ద్వారా విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేశారు. విభిన్న సామర్థ్యాలు కలిగిన విద్యార్థుల సాధనకు నాన్-లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం ద్విభాషా క్వశ్చన్ బ్యాంకులు, మిర్రర్-ఇమేజ్ రూపంలో (ఒక వైపు తెలుగు, మరోవైపు ఇంగ్లీష్) ప్రచురించి అందించారు. వీటిని ప్రాక్టీస్ చేసిన విద్యార్థులు మెరికల్లా తయారయ్యారు.

## ఏ ఒక్క అవకాశం జారకుండా..

ఏ విద్యార్థి ఎందులో బలంగా ఉన్నారు? ఎందులో బలహీనంగా ఉన్నారో ముందుగానే డ్యాష్ బోర్డు విశ్లేషణ పూర్తయ్యింది. దీనికి అనుగుణంగా పాఠశాలకు ఒక సెట్ చొప్పున 15 కార్యాచరణ ప్రణాళిక పుస్తకాలు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేశారు. స్లిప్ టెస్టులలో వెనుకబడిన విద్యార్థుల కోసం 30 రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్ ప్రత్యేకంగా నిర్వహించి, వారి పనితీరు మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి, ఫలితాలను మెరుగుపరచడానికి ప్రీ ఫైనల్, గ్రాండ్ టెస్టులు నిర్వహించారు.

## అమలు చేసిన పథకాలు ఇవీ..

ఇవి కాకుండా స్కూలులోనే విద్యార్థులకు మధ్యాహ్నం పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో యూనిఫాం, బెల్టు, బ్యాగు, షూ, డిక్షనరీ, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ అన్నీ ఉచితంగా అందజేశారు. ఎంత మంది పిల్లలు చదివితే వారితల్లికి ఒక్కొక్కరికీ 15వేలు చొప్పున తల్లికి వందనం పథకం కింద అందిస్తూ వచ్చారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అందించిన సంక్షేమ పథకాలు ఒకవైపు.. మరోవైపు కార్యాచరణ ప్రణాళిక, అమలు,పర్యవేక్షణ సమన్వయంగా సాగడంతో టెన్త్‌లో మంచి ఫలితాలు వచ్చాయి.

## కృషికి తగ్గ ఫలితాలు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రణాళిక- దాని అమలును నిరంతర పర్యవేక్షణచేయడం, అధికారయంత్రాంగం అలుపెరుగని కృషి ఫలితంగా, మార్చి 2026 పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగింది. గత ఏడాది 81.1శాతం ఉత్తీర్ణత నమోదుకాగా,ఈ ఏడాది 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతమై 85.25 శాతానికి ఉత్తీర్ణత పెరిగింది. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గతేడాది 72.8 శాతం ఉన్న ఉత్తీర్ణత ఈ సంవత్సరం 78.39 శాతానికి పెరిగింది.

## భళా బాలిక

ఈ ఏడాది పరీక్షా ఫలితాల్లో బాలురకంటే బాలికలు ఉత్తీర్ణతా శాతం ఎక్కువ సాధించారు. బాలుర ఉత్తీర్ణత 82.68శాతం కాగా, బాలికల ఉత్తీర్ణత 87.90 శాతంగా ఫలితాల్లో తేలింది. బాలురకంటే బాలికలు 5.22 శాతం మెరుగైన ఫలితాలను సాధించి భళా బాలిక అనిపించుకున్నారు.

## ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలే మిన్న

రాష్ట్రంలో మొత్తం 12089 స్కూళ్లు ఉండగా, ఇందులో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 6785,ఎయిడెడ్ స్కూళ్లు 260,ప్రైవేటు స్కూళ్లు 5044 ఉన్నాయి. వీటిలో సున్నా శాతం ఫలితాలు వచ్చిన పాఠశాలలు 16. వీటిలోనూ ప్రైవేట్ స్కూళ్లు 11 కాగా, 2 ఎయిడెడ్, 2 ఆశ్రమ పాఠశాలలు, 1 జిల్లా పరిషత్ హైస్కూల్ ఉంది. మొత్తంగా చూస్తే ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సున్నా ఫలితాలు వచ్చినవి కేవలం 5గా ఉండి ప్రభుత్వ విద్య నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



## విద్యాశాఖ కృషి భళా!

రాష్ట్రంలో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం పదవ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. గతేడాది 81.1 శాతంగా ఉన్న ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది 85.25 శాతానికి పెరిగిందన్నారు. బాలురకంటే బాలికల ఉత్తీర్ణతా శాతం 5.22 శాతం అధికంగా ఉండటం సంతోషకరమని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది 72.8 శాతంగా ఉన్న ఉత్తీర్ణత.. ఈ ఏడాది 78.39 శాతానికి పెరగడం స్ఫూర్తిదాయకమని వివరించారు. విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలను సాధించడం ప్రశంసనీయమని సీఎం చంద్రబాబు చెప్పారు. అందుకు మంత్రి లోకేశ్ సహా శాఖ అధికారులు, టీచర్లు, సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. పిల్లల్లో నైతిక విలువల పెంపుతోపాటు సమగ్ర విద్యా వికాసానికి విద్యా శాఖ చేస్తున్న కృషిని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నానని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.



## ఇది అందరి విజయం: లోకేష్

ఐకమత్యంగా, అంకితభావంతో, ప్రణాళికాబద్ధంగా అంతా కలిసి పనిచేయడం వల్లనే టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించామని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం లక్ష్యం మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉందన్నారు. మన ప్రణాళికలు విజయవంతమై మంచి మార్కులు వచ్చాయని, ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, పిల్లల్లో నైతిక విలువలు పెంపు, సమగ్ర విద్యా వికాసానికి మరింత కృషి చేయాలన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి సమాజ సహకారం అవసరం అని పేర్కొన్నారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన పిల్లలు అందరికీ అభినందనలు తెలిపారు. ఫెయిలైనవారూ తక్కువ ప్రతిభ ఉన్నవారు కాదని, ఆత్మన్యూనతకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రయత్నమే తొలి విజయమని, ఓటమి విజయానికి తొలి మెట్టు వంటిదని, పట్టుదలతో ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు.

# బాబు, లోకేష్‌లపై నిందలు వేస్తాం. సాక్షిలో రాయిస్తాం.

## అయినా జగన్ నేరాలపై నిజాలు కూడా టీడీపీ మాట్లాడరాదట!

బాబు, లోకేష్‌లకు జగన్ ఫోబియో. ఆయన పేరెత్తకుండా టీడీపీకి రోజు గడవం లేదు. హత్యా రాజకీయాలకు, వెన్నుపోట్లుకు బాబే ఆద్యుడని సైకో ముఠా మరియు సాక్షి మీడియా తమ నేత జగన్ అవలక్షణాల్ని బాబు, లోకేష్‌కు అంటగట్టడానికి చెప్పిన అబద్ధమే వందసార్లు చెబుతున్నారు.

బాబు,లోకేష్‌లపై నిందలు రాయకుండా, ప్రసారాలు చేయకుండా సాక్షి మీడియాకు ఒక్క రోజైనా గడుస్తుందా? సాక్షి మీడియాలో సైకో ముఠా ప్రకటనల్లో 90శాతం పైగా బాబు, లోకేష్ జపమేననేది ప్రజలందరూ చూస్తున్న నిజం కాదా? విద్వేష ప్రచారాలు, నేరాలు, బెదిరింపులు, లూటీలపై కదా గొడ్డలి పార్టీ బతుకుతుంది.? తాము ఏనింద వేసినా టిడిపి భరించాలేగాని.. తిరిగి నిజాలు టీడీపీ మాట్లాడరాదని సైకోలు కోరుకుంటున్నట్టు లేదా?



బీసీ హత్యతోనే జగన్ కుటుంబ వైభవం ప్రారంభం:


చేనేతవర్గానికి చెందిన జింకా వెంకట నరసయ్య తన మంగంపేట బెరైటీస్‌ని వై.ఎస్.రాజారెడ్డి దురాక్రమణ చేశారు. ఇలా బీసీల రక్తంతో జగన్ కుటుంబ వైభవం ప్రారంభం అయ్యింది. రాజకీయ అడ్డం తొలగించు కోవడానికి చిన్నాన్న వివేకానంద రెడ్డిని నరికి నరికి చంపిన నరహంతకుల్ని కాపాడుతుంది జగన్ కాదా? పరిటాల రవి, డా.సుధాకర్, ఓం ప్రతాప్‌లాంటి ఎందరినో చంపించిన నేర చరిత్ర ఎవరిదో రాష్ట్రానికంతా తెలుసు. -తన హత్యారాజకీయాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి నారాసుర రక్తచరిత్ర అని, గుండెపోటు అని సాక్షిలో పచ్చి అబద్ధాలు రాయించింది మీరు కాదా? మీ అబద్ధాలు ఇంకా నమ్మడానికి ప్రజలు వెర్రివాళ్లు కాదు. మీకన్నా తెలివిగల వాళ్లు కనుకనే 11 సీట్లకే కుదించారు. ఇకనైనా కళ్లు తెరిచి నిర్మాణాత్మక విపక్షంగా మారకపోతే వైసీపీ ఉనికి కోల్పోక మానదు.

పిన్నమ్మ తాళి తెంచడం వెన్నుపోటు కాదా? తన వేల కోట్లు అక్రమ సంపాదనకు ఉపయోగపడ్డ తన తండ్రి పార్టీకి వెన్నుపోటు పొడించింది జగన్ కాదా? తెలంగాణా వ్యక్తి శివకుమార్ స్థాపించిన వై.సీ.పీని కొట్టేసి అతనికి వెన్నుపోటు పొడించింది జగన్ కాదా? జైల్లో ఉన్నప్పుడు పాదయాత్ర చేసిన చెల్లి షర్మిల, తల్లి విజయమ్మ పార్టీని కాపాడితే, అధికారానికి వచ్చిన తరువాత తల్లిని అవమానకరంగా గౌరవాధ్యక్ష స్థానంనుంచి తొలగించి తల్లికే వెన్నుపోటు పొడించింది జగన్ కాదా? తండ్రి మాటను కాలదన్ని తండ్రి ఆస్తిలో సమభాగం ఎగ్గొట్టి చెల్లికి వెన్నుపోటు పొడిచింది జగన్ కాదా? చిన్నాన్నని దారుణంగా నరికి చంపిన హంతకుల్ని కాపాడుతూ పిన్నమ్మ, సోదరి సునీతకు వెన్నుపోటు పొడిచింది జగన్ కాదా?

తన వెన్నుపోట్లను కప్పిపెట్టుకోవడానికి చంద్రబాబుకు వెన్నుపోటు అంటగడితే దాన్ని నమ్మే అమాయకులు కాదు ఆంధ్రులు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన లక్ష్మిపార్వతిని పక్కన పెట్టుకున్న జగన్ వెన్నుపోట్లకు నిలువెత్తురూపం. చంద్రబాబుకు మద్దతు ఇచ్చిన ఎన్టీఆర్ కన్న బిడ్డలందరూ వెన్నుపోటుదారులు ఎలా అవుతారు? చంద్రబాబుకు మద్దతు ఇచ్చిన మెజారిటీ ఎం.ఎల్.ఏలు, ఎంపీలు, పార్టీ కమిటీలు వెన్నుపోటుదారులు ఎలా అవుతారు? సైకిల్ గుర్తును చంద్రబాబుకు కేటాయించిన న్యాయస్థానాలు, ఎన్నికల కమిషన్ వెన్నుపోటుదారులు ఎలా అవుతారు? 1999లో చంద్రబాబు నాయకత్వంలో పోటీ చేసిన అభ్యర్థుల్ని గెలిపించిన ఉమ్మడి రాష్ట్ర ప్రజలు వెన్నుపోటుదారులు ఎలా అవుతారు? నిజమైన, నికరమైన వెన్నుపోటుదారు జగన్ తప్ప మరెవ్వరూ లేరు. నిజమైన హత్యా రాజకీయాలు చేస్తున్నది జగన్ తప్ప మరెవ్వరూ లేరు?

జగన్, సైకోముఠాకే చంద్రబాబు ఫోబియో పట్టుకుంది. బాబు, లోకేష్ పేరు ఎత్తకుండా జగన్ ముఠాకు, అవినీతి సాక్షి మీడియాకు క్షణం కూడా గడవదనేది వాస్తవం. బాబు, లోకేష్‌లపై మోపుతున్న నిందల్ని టీడీపీ నిజాలతో దీటుగా తిప్పికొడుతుంది. జగన్ ముఠా దౌర్జన్యాలను దీటుగా తిప్పికొడుతుంది. ప్రజల ధన, మాన, ప్రాణాలకు, ఆస్తులకు జగన్ ముఠా చేసిన ద్రోహాన్నీ, విధ్వంసాన్నీ టీడీపీ ఎండగడుతుంది. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధిస్తుంది. తెలుగువారిని అగ్రస్థానంలో నిలుపుతుంది.

- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ కమిటీ



# వచ్చేశాయి లోకేష్ రథచక్రాల్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం అభినందనీయం. ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై ఒక నూతన అధ్యాయం మొదలైంది. పసుపు జెండా వారసత్వాన్ని భుజానికెత్తుకుని వెలుగుల బాటలో అడుగులు వేస్తున్న యువ నాయకుడు సరికొత్త బాధ్యతలతో సిద్ధమయ్యాడు. లోకేష్ సాధారణ రాజకీయ నాయకుడు కాదు. తాత ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ, తండ్రి చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపించిన పార్టీలో బలమైన నేపథ్యం లోకేష్‌కి ఉంది. అయన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం కేవలం పదవి మార్పు కాదు పార్టీకి ఒక కొత్త దిశ, దశ. వారసత్వాన్ని కేవలం హోదాగా కాకుండా బాధ్యతగా తీసుకోవడంలో లోకేష్ ప్రత్యేకత కనిపిస్తుంది. అలుపెరగని యువగళం పాదయాత్రతో జన హృదయాలను గెలుచుకున్నారు. లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పగ్గాలు చేపట్టడంతో పార్టీలో నూతనోత్సాహం ఉరకలెత్తుతోంది. లోకేష్ రథ చక్రాలు పార్టీ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రగతి పథంలోకి దూసుకుపోవడానికి సిద్ధమయ్యాయి. యువగళం పాదయాత్ర ద్వారా పార్టీ పునర్జీవానికి బలమైన పునాదులు వెయ్యడంతో పాటు ఒక మెచ్యూర్డ్ నాయకుడిగా పార్టీ శ్రేణుల నుంచి, ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆత్మబలంతో లోకేష్ ప్రబల శక్తిగా ఎదిగారు. ఒక పరిపక్వత కలిగిన, కష్టాన్ని ఓర్చుకోగలిగిన శక్తి, సమర్థత కలిగిన నాయకుడిగా తనను తాను కార్యసాధకుడిగా నిరూపించుకొన్నారు. ఆధునిక ప్రపంచంలో సాంకేతికతను ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు తండ్రి పంథాలోనే తండ్రికి తగ్గ తనయుడిగా లోకేష్ ముందుకు సాగుతున్నారు.

### పాదయాత్ర ద్వారా ప్రజాక్షేత్రంలో అజేయుడు!

లోకేష్ ఉన్నత విద్యావంతుడు. అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పట్టా పొందిన ఆయన, తన చదువును రాష్ట్ర ప్రగతికి ఎలా ఉపయోగించాలో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లోకి రాకముందు హెరిటేజ్ ఫుడ్స్ కార్యకలాపాలను పర్యవేక్షించి తన మేనేజ్‌మెంట్ నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. ఆయన రాజకీయ జీవితంలో యువగళం పాదయాత్ర అతిపెద్ద మలుపు. దాదాపు 3000 కిలోమీటర్లకు పైగా నడిచి, ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు.పాద యాత్ర ద్వారా ఆయన తన వాగ్ధాటిని మెరుగుపరుచుకోవడమే కాకుండా ప్రజాక్షేత్రంలో అజేయుడు గా నిలిచారు.. వేల కిలోమీటర్లు నడచి సామాన్యుడితో మమేకమై క్షేత్ర స్థాయి సమస్యలను అర్థం చేసుకొన్న తీరు ఆయనలోని పరిణితికి నిదర్శనం. అంతేకాదు ఆయనలోని పోరాట పటిమను ప్రపంచానికి పరిచయం చేసింది పాద యాత్ర.. యువతకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీలో కొత్త రక్తాన్ని ఎక్కిస్తూ యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు. నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తూ తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం కోసం ఆయన చేస్తున్న కృషి అమోఘం. రాబోయే ఎన్నికలు, పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తండ్రి చంద్రబాబుకి వెన్నుదన్నుగా ఉంటూ యువతను, అనుభవజ్ఞులను సమన్వయం చేసే బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది. రాష్ట్ర అభివృద్ధిలో తనకంటూ ఒక ప్రత్యేక విజన్‌తో ముందుకు వెళ్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్ కోసం బలమైన పునాదులు వేస్తున్నారు. జన హృదయ నేతగా, అభివృద్ధి ప్రదాతగా లోకేష్ సాగిస్తున్న ఈ ప్రస్తానం అప్రతిహత రాజకీయ యాత్రగా మారనున్నది.

### యంగ్ గ్లోబల్ లీడర్‌గా గుర్తింపు!

గతంలో మంత్రిగా పనిచేసినప్పుడు గ్రామీణ, ఐటీ రంగ అభివృద్ధి వంటి అంశాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు గుర్తింపు పొందాయి. రాష్ట్రానికి అనేక ఐటీ కంపెనీలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. గన్నవరం, విజయవాడ వంటి నగరాలకు హెచ్‌సీఎల్ వంటి ఐటీ కంపెనీలను తీసుకురావడం వెనుక ఆయన కృషితో కూడిన పట్టుదల ఉంది. తిరుపతిని ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా మార్చడంలో (డిక్సన్, సెల్‌కాన్ వంటి కంపెనీల స్థాపన) ఆయన విజన్ స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, సిమెంట్ రోడ్ల నిర్మాణంలో రికార్డు సృష్టించి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సుమారు 25లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేసి పంచాయతీలకు కరెంటు బిల్లుల భారం తగ్గించారు. కేవలం రెండున్నర ఏళ్లలో గ్రామాల్లో సుమారు 25వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేయించి రికార్డు సృష్టించారు. పాలనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసినందుకు 'అబ్దుల్ కలాం' సెంటర్ ఫర్ లివబుల్ ప్లానెట్ ఎర్త్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సంస్థ నుంచి అవార్డు అందుకున్నారు. పారదర్శకతను పెంచడం, పంచాయతీరాజ్ శాఖలో వినూత్న మార్పులు తెచ్చినందుకు ఈ పురస్కారం లభించింది. పరిపాలనలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డును ఆయన గెలుచుకున్నారు. తాగునీటి సరఫరాను రియల్ టైమ్‌లో పర్యవేక్షించడం, జీపీఎస్ టెక్నాలజీ ద్వారా గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం వంటి అంశాలు ఆయన్ను ఈ అవార్డుకు ఎంపిక చేశాయి. 'బిజినెస్ వరల్డ్' మేగజైన్ నిర్వహించిన డిజిటల్ ఇండియా సమ్మిట్‌లో లోకేష్ ఈ అవార్డును అందుకున్నారు. ఐటీ రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చినందుకు అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో 'స్ట్రాటజిక్ రీసెర్చ్ ఇన్నోవేషన్ ఇన్స్టిట్యూట్' [SRII] నుంచి ఆయన ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు.యంగ్ గ్లోబల్ లీడర్ గా ప్రపంచ స్థాయి యువ నాయకులలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడానికి దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుల్లో పాల్గొని, దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించారు.

### 'కార్యకర్తల బాంధవుడు లోకేష్!

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో కేవలం 55 రోజుల్లో 55 లక్షల మంది కార్యకర్తలను సభ్యులను చేర్పించి, దేశంలోనే ఒక ప్రాంతీయ పార్టీకి అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన రికార్డు సృష్టించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచి వారిలో ధైర్యాన్ని నింపారు. దాదాపు 40ఏళ్లుగా తెలుగుదేశం గెలవని మంగళగిరి నియోజకవర్గంలో 91,413 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించి తన రాజకీయ సత్తా నిరూపించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారు. ఆసియాలోనే అతిపెద్ద బ్లాక్ చైన్ కాన్ఫరెన్స్‌ను విశాఖపట్నంలో నిర్వహించి ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా ప్రపంచానికి పరిచయం చేశారు. క్వాంటం వ్యాలీ-గూగుల్ డేటా సెంటర్ వంటి ఆధునిక ప్రాజెక్టులు, ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత పట్ల ఆయనకు వున్న స్పష్టమైన విజన్‌తో 'లోకేష్ రధచక్రాల్ పరుగులు తీస్తూ నవ్యాంధ్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఆయన చదువుకున్నది స్టాన్‌ఫోర్డ్ అయినా ఆయన ఆలోచనలన్నీ మారుమూల గ్రామాల అభివృద్ధి చుట్టూనే తిరుగుతాయి. కార్యకర్తల పెన్షన్, ఇన్సూరెన్స్, పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించి వారికి వెన్నుముకగా నిలిచి వారి కుటుంబాలకు భరోసా కల్పించిన 'కార్యకర్తల బాంధవుడు లోకేష్. టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధిని పర్యవేక్షించడంలోను, పార్టీ సభ్యత్వ నమోదులో డిజిటల్ టెక్నాలజీని ప్రవేశపెట్టడంలోను ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. కార్యకర్తలకు కష్టం వస్తే ముందుండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. లోకేష్ రథచక్రాల్ సామాన్యుల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా సాగనున్నాయి. నవతరం నాయకత్వంలో రాష్ట్ర భవిష్యత్తు సరికొత్త మలుపు తిరుగుతుంది. లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడు కావడం పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. యువతలో భరోసాను, రైతుల్లో ధైర్యాన్ని నింపుతూ రేపటి అభివృద్ధికి పునాది కావాలని, అడ్డంకులను అధిగమిస్తూ లోకేష్ రథ చక్రాల్ లక్ష్యాన్ని చేరుకుని ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిద్దాం.

- నీరుకొండ ప్రసాద్

చైతన్యరథం

## పశుసంవర్ధక రంగానికి మార్గదర్శిని

# ఈ-మేగజైన్‌తో రైతులకు శాస్త్రీయ దిశానిర్దేశం

- రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- ప్రతి ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్యం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి/విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాల యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పాడి పశు వులు, సన్న జీవాలు, నాటు కోళ్ల పెంపకంతో అనుబంధం కలిగి ఉన్నా రని తెలిపారు. 2025-26 సంవత్సరానికి పశుసంవర్ధక శాఖ ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి నమోదవడం ఈ రంగ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోందన్నారు. పాడి పశువులు, జీవాలు, నాటు కోళ్లు, పందుల పెంపకం వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని రాష్ట్ర పశుగణ యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1500 మంది శిక్షణ పొందగా అందులో సుమారు 200 మంది రైతులు వాణిజ్యపరంగా లాభసాటిగా పశుసంవర్ధక కార్యకలాపాలను విజయవంతంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "పశు సంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను ఏప్రిల్ నుంచి www.apahsmile.in (http://www. apahsmile.in) "స్మైల్" వెబ్‌సైట్‌తో పాటు రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందుబాటులో ఉంచుతున్న ట్లు తెలిపారు.



ఈ మేగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, పోషణ, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం, విజయగాథలు, నిపుణుల సూచ నలు, రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడతాయని చెప్పారు. అలాగే, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కూడా ఈ-మేగజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశుసంవర్ధక రంగాన్ని సేంద్రియ, వాణిజ్య పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే ఒక్క ఎకరం నుంచి సంవత్సరానికి రూ.5-6 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటిలో ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఏర్పడి వ్యక్తిగత అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ వై.సింహాచలం, జాయింట్ డైరెక్టర్ బైరాగి పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ.2720 కోట్లు

### ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి ఇవ్వనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 62,47,538 మంది లబ్ధిదారులకు రూ.2720.67 కోట్లు విడుదల చేసింది. గ్రామాలు, వార్డులు, పట్టణ ప్రాంతాల్లో లబ్ధి దారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేసే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగా మంజూరైన స్పౌస్ పెన్షన్ల కింద 8,141 మంది లబ్ధిదారులకు రూ.4.15 కోట్లు విడుదల చేసింది. మే 1నే వారికి కూడా పంపిణీ చేయనున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని సమర్థవం తంగా అమలు చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొ న్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ నెల విడుదలతో కలిపి మొత్తం రూ.63,157.90 కోట్లు పెన్షన్ల పంపిణీకి ప్రభు త్వం ఖర్చు చేసిందని తెలిపారు. పేదలు, వృద్ధులు, వికలాంగు లు, వితంతువులు, ఇతర అర్హుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు.

## చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై రాకపోకలు

- ప్రయోగాత్మకంగా వాహనాలకు అనుమతి
- ఏపీలో 75 కి.మీ అందుబాటులోకి



అమరావతి(చైతన్యరథం): చిత్తూరు నుంచి చెన్నైలోని కామరాజార్ (ఎన్నోర్) పోర్టు, కట్టుపల్లి పోర్టులను అనుసంధానం చేసే చిత్తూరు- తచ్చూరు ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్ వే (ఎన్హెచ్-716బీ)లో రాకపోకలు మొదలయ్యాయి. మొత్తం ఈ ప్రాజెక్ట్ 116.5 కి.మీ కాగా 92 కి.మీ. పూర్తయింది. ప్రయోగాత్మకంగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇటీవ ల అనుమతించారు. దీంతో రాష్ట్రంలో మరో యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్ వే అందుబాటులోకి వచ్చింది. ఈ హైవే కారిడార్‌పై అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్ అమలు చేస్తున్నారు. ఇందు లో 115 పాన్, టిల్ట్, జూమ్ (పీటీజెడ్) కెమెరాలు, 120 సర్వైలెన్స్ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాహనాల వేగాన్ని గుర్తించే 18 పరికరాలు, వీడియో ఇన్సిడెంట్ డిటెక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్‌లు 58 అమర్చారు. ఎక్కడైనా ట్రాఫికు అంతరాయం, ఇతర ఇబ్బందులు కలిగినా వెంటనే వీటి ద్వారా గుర్తిస్తారు.

### ఏపీలో శరవేగంగా పూర్తి

మొత్తం 116.5 కిలోమీటర్లలో ఏపీలో చిత్తూరు జిల్లా పరిధిలో 75 కి.మీ, తమిళనాడులో తిరువళ్లూరు జిల్లాలో 41.5 కి.మీ. ఉంది. ఏపీలోని 75 కి.మీలతో పాటు, తమిళనాడులో 17 కి.మీ. కూడా హైవేని పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు. చిత్తూరు శివారులోని గంగాసాగరం నుంచి తమిళనాడులో ఉతుక్కొట్టై వరకు పనులు పూర్తికావడంతో అక్కడి వరకు వాహనాలను అనుమతిస్తు న్నారు. తర్వాత తమిళనాడులో పనులు చేపట్టనున్నారు. ఇది చెన్నై పెరిపరల్ రింగ్‌లో చేరి రెండు పోర్టులకు వెళుతుంది. మొత్తం ఈ ప్రాజెక్టుకు రూ.5,488.32 కోట్లు వెచ్చిస్తున్నారు. చిత్తూరు శివారులోని అనుపల్లె, ఆర్తల, నరసింహరాజపురం, పల్లిపట్టు, నగరి, ఉతుక్కొట్టై, కుమారరాజపేట, ఎస్ఆర్పురం, వీర కావేరిరాజపురం, పాండవక్కంలలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. ఈ హైవే లో ఎంత దూరం వాహనాలు ప్రయాణిస్తాయో అంతమేరకు టోల్ వసూలు చేస్తారు. ఇటీవలే దీనిపై వాహనాలను అనుమతించారు.

# టెన్త్‌లో అంబేద్కర్ గురుకులం ప్రభంజనం

### 89.49 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత - మంత్రి డోలా అభినందనలు



అమరావతి(చైతన్యరథం): టెన్త్ ఫలితాల్లో అంబేద్కర్ గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,538 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,115 మంది విద్యార్థులు పాసయ్యారు, 89.49 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విద్యార్థులను అభినందించారు. ప్రైవే టు పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. విద్యార్థులు, సిబ్బందికి అభి నందనలు. మంత్రి లోకేష్ విద్యాశాఖలో విప్ల వాత్మక మార్పులు తీసుకొచ్చారు. నూతన విద్యా విధానాలతోనే 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. అంబేద్కర్ గురుకులాలు, సంక్షే మ వసతిగృహాల్లో పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

### ప్రత్యేక పాఠశాలల విద్యార్థుల ప్రభంజనం

విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు 2025-26 విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణతతో అద్భుత ప్రతిభను కనబరి చాయి. ఈ ఏడాది మొత్తం 54 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు. పాఠశాలల వారీగా వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి. విశాఖపట్నం ప్రభుత్వ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో 13 మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. శ్రీ సత్యసాయి హిందూపురం ప్రభుత్వ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలోని 6 మంది మొదటి శ్రేణిలోనే విజయం సాధించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రభుత్వ వినికిడి లోపం ఉన్న వారి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 16 మందిలో 12 మంది మొదటిశ్రేణి, నలుగురు రెండో శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల ప్రభుత్వ విని కిడి లోపం ఉన్న వారి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై అందరూ ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థు లు, సిబ్బందిని మంత్రి అభినందించారు. వైకల్యాన్ని జయించి పట్టుదలతో 100% ఉత్తీర్ణత సాధించారని, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# కుప్పం విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- స్పెషల్ లీవ్ పిటిషన్ కొట్టివేత




అమరావతి/ఢిల్లీ(చైతన్యరథం): చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మ కంగా భావిస్తున్న కుప్పం విమానాశ్రయ ప్రాజెక్టుకు పెద్ద ఊరట లభించింది. భూసేకరణపై కొనసాగుతున్న న్యాయపరమైన వివా దాలకు ముగింపు పలుకుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువ రించింది. కుప్పం విమానాశ్రయం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ముందుగా ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

### భూసేకరణ చట్టబద్ధమే..తొలగిన అడ్డంకులు

ఈ ప్రాజెక్టు కోసం సుమారు 150 ఎకరాల భూమిని సేకరిం చేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చింది. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవంటూ చక్రపాణి రెడ్డి, ఇతరులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ పిటిషన్లు కూడా ముగిసినట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఉన్న న్యాయపరమైన అన్ని అడ్డం కులు పూర్తిగా తొలగిపోయాయి. ఈ తీర్పుతో కుప్పం విమానాశ్రయ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయి.

ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల పెరుగుదల వంటి అంశాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. కుప్పం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ, సమీప ప్రాంతాల ఆర్థిక వృద్ధి, టూరిజం అభివృద్ధి వంటి ప్రయోజ నాలు కలగనున్నాయి.

# మందుల సరఫరాలో సమగ్ర మార్పులు

- ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం
- వినియోగ జాబితాలపై పునఃపరిశీలన
- వైద్యులు, ఫార్మసిస్టుల మధ్య సమన్వయం పెరగాలి
- ఆసుపత్రుల్లో రెగ్యులర్ మందులకు కొరత లేదు
- త్వరలో మరో 380 రకాలు సరఫరా చేస్తాం
- వైద్య, ఆరోగ్య సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వాసుపత్రులకు జరిగే మందు ల సరఫరా వ్యవస్థలో సమూల మార్పులను తెస్తామని వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మందుల కొనుగోళ్లు, ఆసుపత్రులకు పంపిణీ, రోగులకు అందించే వరకు. వివిధ సాయిల్లో జరుగుతున్న ప్రస్తుత ప్రక్రియను ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పునఃసమీక్ష చేయిస్తామని స్పష్టంచేశారు. అలాగే ప్రస్తు తం ఆసుపత్రులకు ఎసెన్షియల్ మెడిసిన్ లిస్ట్ (ఈఎంఎల్), ఆడిషనల్ మెడిసిన్ లిస్ట్ (ఏఎంఎల్) జాబితాలో ఉన్న మందులు, వాటి సరఫరా, మార్కెట్లో కొత్తగా అందుబాటులోనికి వచ్చిన కాంబి నేషన్ మందుల వాడకం గురించి కూడా అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్లు అవసరం లేని వాటిని తొలగించి, అవసరమైన వాటిని జాబి తాలోకి చేరుస్తామన్నారు. ఫార్మసీ రంగ నిపుణులు, వైద్యులు, సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టుల అభిప్రాయాలను కూడా పరిగణ నలోకి తీసుకుంటామన్నారు. సచివాలయంలో గురువారం సాయంత్రం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాం డియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) అధికారులు, పలు బోధనాసు పత్రుల సూపరింటెండెంట్లు సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్లతో ప్రభుత్వాసుపత్రుల్లో మందుల లభ్యత, ఇతర అంశాలపై రెండున్న ర గంటలపాటు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ వైద్యులు, ఫార్మసిస్టుల మధ్య మందు ల లభ్యత, వినియోగంపై ప్రస్తుతం ఉన్న సమన్వయాన్ని మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**లోకల్ పర్చేజింగ్ ఈ ఔషధి పోర్టల్‌లో నమోదు చేయాలి**

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద వినియోగించే మందుల సరఫరాలో జాప్యం జరగకుండా ఉండేందుకు ప్రస్తుత విధానం ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల ద్వారా కాకుండా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి నేరుగా ఆసుపత్రులకు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోకల్ పర్చేజింగ్ విధానంలో ఆసుపత్రులు సూపరింటెండెంట్ల ద్వారా జరిగే మందు ల కొనుగోళ్ల వివరాలను ఈ-ఔషధి పోర్టల్’లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఈ విధానం అమల్లో లేనందున మందుల కొనుగోళ్ల గురించి, అవి అందుబాటులో ఉన్నాయా? లేవా? లేదా అన్న వివరాలు తెలియటం లేదని తెలిపారు. వైద్యులు రోగులకు రాసే ‘ప్రిస్కిప్షన్ లోని మందుల గురించి కూడా ఆడిటింగ్ జరిగేలా చర్యలు తీసు కుంటామని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ వర్చువల్ గా వెల్లడించారు. ఆసుపత్రుల వారీగా ఉన్న మందుల వివరాలను ఇతర ఆసుపత్రుల వారు ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశాన్ని కల్పి స్తామని, తద్వారా అవసరాలకు తగ్గట్లు మందులను స్థానికంగానే సర్దుబాటు చేసుకునేందుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్లలో కొరతగా ఉండే మందుల వివరాలు: (నాన్ ఆవైలబులిటీ సర్టిఫికెట్) ఆన్‌లైన్‌లో సూపరింటెండెంట్లు తెలుసు కునే అవకాశాన్ని కల్పిస్తామని కూడా తెలిపారు.

**వికేంద్రీకరణ విధానంలో కొనుగోలు**

ఏపీ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ అధికారులు మాట్లాడుతూ ఎసిన్షియల్ మెడిసిన్ లిస్టు, అడిషనల్ మెడికల్ లిస్టుల్లో 712కు గాను 176 రకాల మందులను ఆసుపత్రులకు సరఫరా చేయలేకపోతున్నట్లు తెలిపారు. తక్కువ మొత్తంలో అవస రమైన మందులు కావాలంటే మాత్రం సదరు సంస్థలు ముందుకు రావడం లేదని తెలిపారు. బెటాక్సాలాల్ (కంటి మందు), ట్యాక్రోలి మస్ (స్కిన్ క్రీమ్) మందుల కొనుగోలుకు టెండర్లు దాఖలైనా తక్కువ మొత్తంలో అనే సరికి ముందుకు రాలేదన్నారు. మిథైయిల్ ప్రడ్నిసిలోన్ (స్టెరాయిడ్) ఇంజెక్షన్ సరఫరాకు అసలు టెండరు కూడా రాలేదన్నారు. ఈ పరిస్థితుల్లో వికేంద్రీకరణ విధానంలో స్థానికంగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మందుల నిల్వలకు తగ్గట్లు చర్యలు 177 రకాల మందుల నిల్వలు మూడునెలలకు సరిపడా ఉన్నాయని, 84 రకాలు 2-3 నెలల వరకు, 80 రకాల మందులు ఒకటి నుంచి రెండునెలల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. మరో 178 రకాల మందుల నిల్వలు నెల వరకు సరిపోయేలా ఉన్నాయన్నారు. 17 రకాల మందులు అందుబాటు లో లేవన్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ఉన్న నిల్వలకు తగ్గట్లు 380 రకాల మందులను రూ.71.12 కోట్లతో కొనుగోలు చేశామని, ఆర్డర్ల ప్రకారం త్వరలోనే సదరు ఆసుపత్రులకు సరఫరా అవుతా యన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, విశాఖ, గుంటూరు బోధనాసుపత్రుల సూపరింటెం డెంట్లు వాణి, రమణ యశస్వి, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# పక్కాగా జాబ్ పోర్టల్ వివరాలు

- ప్రతిఒక్కరి సమాచారం నమోదు చేయాలి
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- అధికారులతో సమీక్షలో మంత్రుల బృందం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రుల బృందం పిలుపునిచ్చింది. సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఇన్వె స్టమెంట్ అండ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్‌పై గురువారం మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. మంత్రులు. కందుల దుర్గేష్, టి.జి.భరత్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షలకు పైగా ఉద్యోగ కల్పనపై చేస్తున్న కృషి ని ప్రశంసించారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన ప్రతిఒక్కరి వివరాలను ఒక పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పోర్టల్‌లో నమోదు చేసే ఉద్యోగుల వివరాలు పారదర్శకంగా ఉండాల ని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిం చాలని సూచించారు. భారీ, మధ్యస్థ, చిన్న పరిశ్రమలు, ఎంఎస్ ఎంఈల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన వివరాలు పక్కాగా ఉండాల న్నారు. మంత్రుల బృందం పలు అంశాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించింది.

# విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు

- టెన్త్ ఫలితాలే ఇందుకు నిదర్శనం
- మంత్రి లోకేష్ ప్రణాళికతో సత్ఫలితాలు
- హోంమంత్రి వంగలపూడి అనిత





అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొ న్నా రు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంత్రి లోకేష్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక మంచి ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం 81.14% నుంచి 85.25%కి పెరగడం, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో 78.39% ఉత్తీర్ణత నమోదవడం ఆయన దూరదృష్టి, పక్కా ప్రణాళికకు నిదర్శనమని అన్నారు. ఈ ఫలితాల్లో బాలికలు 87.90% ఉత్తీర్ణతతో ముందంజలో నిలవడం శు భపరిణామమని పేర్కొన్నారు. జిల్లాల వారీగా చూస్తే పార్వతీ పురం మన్యం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం, విజయ నగరం జిల్లా మూడో స్థానం, అనకాపల్లి జిల్లా ఆరో స్థానం సాధించడం ఆనందకరమని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వచ్చిన ఈ గుణాత్మక మార్పుకు మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ కారణమని ఆమె అభిప్రాయపడ్డారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు మంత్రి అభినందనలు తెలిపారు. అలాగే పరీక్షల్లో విఫలమైన విద్యార్థులు నిరుత్సాహపడకుండా మరింత కృషి చేసి మళ్లీ ప్రయత్నించి విజయాన్ని సాధించాలని సూచించారు.

# పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు ప్రారంభం

- శేషాచలాన్ని తలపించిన శుక్రవారపుతోట
- నేడు స్వర్ణ రథోత్సవ కార్యక్రమం



తిరుపతి (చైతన్యరథం): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యా యి. వసంతోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సుప్రభాతం తో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవర్లను ఆలయం నుంచి శుక్రవారపు తోటకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. 2.30 గంటల నుండి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించనున్నారు. శుక్రవారం ఉదయం 9.30గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగ నుంది. వసంత ఋతువులో మేషరాశిలో సూర్యుడు ఎక్కువ ప్రకాశవం తంగా ఉంటాడు. సూర్యకిరణాల వేడి వల్ల జీవులకు వ్యాధి బాధలు కలుగుతాయి. శ్రీ పద్మావతి అమ్మవారిని వసంతోత్సవాల ద్వారా ఆరాధిం చడం వల్ల భక్తులకు శారీరక, మానసిక శాంతి లభిస్తుందని విశ్వాసం. టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారపు తోటలో శేషాచలం అడవిని తలపించేలా తీర్చిదిద్దారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్ర మాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవ రాజులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు ముని చెంగల్రా యులు, రమేష్, సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, భక్తులు పాల్గొన్నారు.

# ఏపీలో పెట్టుబడులకు టైటాన్ సంస్థ ఆసక్తి

## మంత్రి జనార్దన్‌రెడ్డితో సమావేశం





అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందు కు పూర్తిస్థాయిలో ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని ఏపీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయ కత్వంలో రాష్ట్రం దేశానికే పెట్టుబడుల హబ్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో టైటా న్ డిఫెన్స్ గ్రూప్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సచివాల యం ఆర్అండ్‌బీ, ఐఅండ్‌ఐ శాఖ కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ గ్రూప్ చైర్మన్, సీఈఓ కె.గిరికుమార్, సంస్థ ప్రతినిధులు కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న టైటాన్ కంపెనీ నిర్వాహకులు ఆసక్తి చూపించారు.

ప్రస్తుతం ఏపీలో పెట్టుబడు లకు అనుకూల వాతావరణం ఉందని టైటాన్ సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. కర్నూలు ఎయిర్ పోర్టులో ఎంఆర్‌వో, సిమ్యులేషన్ సెంటర్ల ఏర్పాటుకు ఈ సంస్థ ఆసక్తి చూపుతోంది. అలాగే నంద్యాల జిల్లాలో డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపనకు సంస్థ ప్రతినిధులు ఉత్సాహం చూపించారు.

తమ సంస్థకు ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మైనింగ్, ట్రేడింగ్ వంటి బహుళ రంగాల్లో ఉన్న అనుభవాన్ని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఉత్పత్తి శ్రేణితో పాటు శిక్షణ, పరీక్ష, ధ్రువీకరణ, ఉన్నతీకరణ, ఆధునీకరణ, నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో తమకు అనుభవం ఉందని టైటాన్ గ్రూప్ నిర్వాహకులు తెలిపారు.

### గంగమ్మ జాతరకు ఆహ్వానం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు రావాలని సచివాలయంలో మంత్రిని కలిసి ఆలయ చైర్మన్ మహేష్‌యాద వ్ ఆహ్వానించారు. తిరుపతిలో మే 5 నుంచి 13 వరకు గంగ మ్మ జాతర ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. అనంతరం మంత్రికి గంగమ్మ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేసి ఆలయ పండితులు ఆశీర్వదించారు.

# మూడు దశలో అమరావతి బిట్స్ పిలానీ క్యాంపస్

## ఆధునికత ఉట్టిపడేలా డిజైన్ల రూపకల్పన - 10 వేల మంది చదువుకునేలా ఏర్పాటు



అమరావతి (చైతన్యరథం): ప్రతిష్టాత్మక విద్యా సంస్థ బిట్స్ పిలా నీ కాలనీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్యాంపస్‌ను ఐకానిక్‌గా నిర్మించబోతోంది. క్యాంపస్ మాస్టర్ ప్లాన్, భవనాల డిజైన్లను ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ ఎడిఫైస్ నవ్యత ఉట్టిపడేలా రూపొం దించింది. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్, బిట్స్ పిలానీ ఛాన్సలర్. కుమారమంగళం బిర్లా స్వయంగా పలు జాతీయ, అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థలతో ఆరు నెలల పాటు సమీక్షించి ఈ డిజైన్లను ఎంపిక చేశారు. తొలి దశలో ఈ క్యాంపస్‌లో భవనాల నిర్మాణాని కి రూ.1250 కోట్లు, పరికరాల కోసం రూ.150 కోట్లు బిట్స్ పిలానీ వెచ్చించనుంది. మొత్తంగా అమరావతి క్యాంపస్‌పై రాను న్న 15 ఏళ్లలో మూడు దశల్లో రూ.4500 కోట్లు వెచ్చించాలన్నది సంస్థ లక్ష్యం. రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డును అనుకుని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో బిట్స్ క్యాంపస్‌కు ప్రభుత్వం 70 ఎకరాలు కేటాయించింది. సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి అటు కరకట్ట వరకు ఈ స్థలం ఉంది. ఈ ఏడాది జనవరిలో స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది.

### మూడు దశల్లో నిర్మాణం

ఈ క్యాంపస్‌లో మూడు దశల్లో 36.46 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతం గల భవనాలను నిర్మించనున్నారు. వాటిలో అకడమిక్, రీసెర్చ్ బ్లాక్, విద్యార్థుల హాస్టళ్లు, డైనింగ్ హాల్, ఫ్యాకల్టీ సిబ్బంది నివాసగృహాలు, విద్యార్థులకు యాక్టివిటీ సెంటర్, షాపింగ్ సెంటర్, మెడికల్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్ అతిథిగృహం వంటివి ఉంటాయి.

### బిట్స్ పిలానీ ఆరో క్యాంపస్

అమరావతి క్యాంపస్‌లో మూడు దశల్లో మొత్తం 10 వేల మంది విద్యార్థులు చదువుకునేలా తీర్చిదిద్దనున్నారు. తొలి దశలో 2690 మందిని. రెండో దశలో 3060 మందిని, మూడో దశలో 4250 మందిని చేర్చుకునేలా ఏర్పాటు చేస్తున్నారు. సేఠ్ శివనారా యణదాస్‌జీ బిర్లా 1901లో ప్రారంభించిన చిన్న పాఠశాల.. తర్వాత కాలంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థగా ఎదిగింది. 1950లో బిర్లా ఇంజనీరింగ్ కాలేజ్, సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజ్, ఫార్మసీ కాలేజీలు ఏర్పాటయ్యాయి. 1964లో మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో కలిసి పిలానీలో బిట్స్ పిలానీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీగా ఏర్పాటైంది. 2000లో దుబాయ్, 2004లో గోవా, 2008లో హైదరాబాద్, 2021లో ముంబయిలో క్యాంపస్ లు ఏర్పాటయ్యాయి. అమరావతిలో ఏర్పాటు చేస్తున్నది ఆరో క్యాంపస్.

# నేటి నుంచి రండి ఉర్దూ నేర్చుకుందాం

- ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ
- పుస్తకాన్ని విడుదల చేసిన మంత్రి ఫరూక్



అమరావతి (చైతన్యరథం): ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాష అభివృద్ధి లక్ష్యంగా చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ సారథ్యం లో "ఉచిత కోచింగ్ క్యాంప్- ఆవో ఉర్దూ సీఖే" కార్యక్రమం మే 1 నుంచి మే 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనుంది. గురువారం చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ అధ్యక్షతన లిటరరీ కమిటీ సమా వేశం నిర్వహించారు. లిటరరీ కమిటీ సహకారంతో రూపు దిద్దిన "ఆవో ఉర్దూ సీఖే - రండి ఉర్దూ నేర్చుకుందాం" అనే పుస్తకాన్ని న్యాయశాఖ మంత్రి ఫరూక్ చేతులమీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీల సంక్షేమ శాఖ సలహాదారు అహ్మద్ షరీఫ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ గౌస్ పీర్, లిటరరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వం లో, మైనారిటీ మంత్రి ఫరూక్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.

## విద్యావంతుడి నాయకత్వంలో

# వెలుగొందుతున్న విద్యా వ్యవస్థ

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం
- గతేడాది 81.1 శాతం నుంచి 85.25 శాతం నమోదు
- విద్యా శాఖలో విజయాలు లోకేష్ కృషికి నిదర్శనం
- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



అమరావతి (చైతన్యరథం): ఒక విద్యావంతుడైన నాయకుడు విద్యా శాఖ బాధ్యతలు చేపడితే ఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయో తాజాగా విడుదలైన పదో తరగతి ఫలితాలు నిరూపించాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున శు భాకాంక్షలు తెలియజేస్తూ... ఈ విజయం వెనుక విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అంకితభావం, వినూత్న సంస్కరణలు ఉన్నాయని స్పష్టం చేశారు. విద్యార్థుల కష్టమే కాకుండా, విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ గత రెండేళ్లుగా విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన వినూత్న మార్పులకు, సమూల సంస్కరణలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

### గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణత శాతం

గత ప్రభుత్వ పాలనలో 2022 నాటికి 67.26 శాతానికి పడిపోయిన ఉత్తీర్ణతను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే 85.25 శాతానికి చేర్చడం ఒక చారిత్రాత్మక విజయమని శ్రీనివాసులు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఉత్తీర్ణత గత ఏడాది 72.8 శాతం ఉండగా ఈసారి అది 78.39 శాతానికి పెరగడం పేదరిక నిర్మూలనకు తొలి ప్రయత్నం మాత్రమే కాకుండా ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతోందన్నారు.

### బాలికల విద్యకు ప్రాధాన్యం-సంక్షేమ పథకాల ప్రభావం

మంత్రి లోకేష్ నాయకత్వంలో బాలికల విద్యకు పెద్దపీట వేయడం వల్ల వారు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించి బాలుర కంటే 5.22 శాతం ముందున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ 96.04 శాతం ఫలితాలతో రికార్డు సృష్టించాయన్నారు. "సూపర్ సిక్స్" హామీలో భాగంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం ద్వారా అందుతున్న రూ.15,000 ఆర్థిక సాయం, బడి మానేసే వారి సంఖ్యను తగ్గించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచిందని తెలిపారు.

### విప్లవాత్మక మార్పులు

రాష్ట్రవ్యాప్తంగా 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, ఒక తరగతికి ఒక టీచర్ విధానం, దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన "మెగా పీటీఎం" విద్యా ప్రమాణాలను గాడినపెట్టాయన్నారు. రాజకీయాలకు తావు లేకుండా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా కిట్లు, NCERT కరిక్యులమ్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ వంటి మహనీయుల పేర్లను తొలగించారని గుర్తు చేశారు. చివరకు చిన్న పిల్లలకు ఇచ్చే చిక్కీలపై కూడా సొంత ఫొటోలు వేసుకున్న సంస్కృతి జగన్మోహన్ రెడ్డిదే అని మండిపడ్డారు. విద్యావంతుడైన లోకేష్ గారు విద్యాశాఖను ఒక సవాలుగా తీసుకుని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో మార్పునకు విద్యే అసలైన మార్గమని భావిస్తూ విద్యార్థులందరూ శ్రీశ్రీ ఆశయాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి విజయాలు సాధించాలని శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

# టెన్త్‌లోనూ బీసీ బిడ్డల హవా

- ఎంజేపీలో 96.02 శాతంతో ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతం అధికం
- విద్యార్థుల సంఖ్యాపరంగా ఎంజేపీదే ఉత్తీర్ణతా శాతం టాప్
- 100 బీసీ గురుకులాల్లో 32 గురుకులాల్లో నూరు శాతం ఫలితాలు
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ఇంటర్‌లోనూ సత్తాచాటిన బీసీ విద్యార్థులు
- బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు... 85.99 శాతం ఉత్తీర్ణత
- బీసీ బిడ్డల అత్యుత్తమ ఫలితాల సాధనపై మంత్రి సవిత హర్షం
- సత్ఫలితాలిచ్చిన మంత్రి లోకేశ్ వంద రోజుల ప్రణాళికలు
- కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితమే ఈ అత్యుత్తమ ఫలితాలు : మంత్రి సవిత
- అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు

అమరావతి (చైతన్యరథం): పదో తరగతి ఫలితాల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలు (ఎంజేపీ) విద్యార్థులు సత్తాచాటారు. 96.02 శాతం సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థుల సంఖ్యాపరంగా ప్రభుత్వ పరిధిలో నడిచే విద్యా సంస్థలు, గురుకులాల్లో ఎంజేపీ గురుకులాలు ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు వంద బీసీ గురుకుల విద్యా సంస్థలు హాజరుకాగా 32 గురుకులాల్లో వంద శాతం మేర ఫలితాలు రావడం విశేషం. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే ఎంజేపీ గురుకులాలు 10 శాతం కంటే అధికంగా ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమై, ఏప్రిల్ రెండో తేదీన ముగిశాయి. ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. 6,18,131 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 85.25 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు టెన్త్‌లోనూ సత్తాచాటారు. ఇటీవల వెల్లడైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫస్ట్ ఇంటర్‌లో 97 శాతం, సెకండ్ ఇంటర్‌లో 94 శాతంతో బీసీ బిడ్డలు ఉత్తీర్ణత శాతం సాధించి భేష్ అనిపించుకున్నారు. టెన్త్ లోనూ అదే స్థాయిలో ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వంద ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,433 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతం మేర ఉత్తీర్ణతా శాతంతో ఉత్తీర్ణులయ్యారు.

**విద్యార్థుల సంఖ్యాపరంగా టాప్ ప్లేస్ ఎంజేపీదే...**

గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం ప్రకారం 96.02 శాతంతో ద్వితీయ స్థానంలో ఎంజేపీ గురుకుల విద్యార్థులు నిలిచారు. స్కూళ్లు, విద్యార్థుల సంఖ్య ప్రకారం చూస్తే ఎంజేపీ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. వంద బీసీ గురుకులాలకు చెందిన



5,501 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతంతో 5,274 మంది మేర ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు 96.04 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే 0.02 శాతంతో ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు ముందంజలో నిలిచారు. టెన్త్ పరీక్షలకు 50 ఏపీ రెసిడెన్షియల్‌కు చెందిన విద్యార్థులు 3,135 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. ఆ లెక్కన చూస్తే... ఏపీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ విద్యార్థులే టాప్ లో నిలిచినట్లు.

**గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత**

గతేడాది కంటే ఎంజేపీ స్కూళ్లలో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది పదో తరగతి పరీక్షల్లో 95 శాతం మేర ఎంజేపీ విద్యార్థులు ఫలితాలు సాధించారు. ఈ ఏడాది 96.02 శాతంతో ఎంజేపీ విద్యార్థులు సత్తాచాటారు. గతేడాది కంటే 1.02 శాతం మేర ఫలితాలు అధికంగా రావడం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరంలో 5,355 మంది పరీక్షలు రాయగా ఈ ఏడాది 5,501 మంది పదో తరగతిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షలకు వంద ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు పరీక్షలు రాయగా 32 గురుకులాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో పాసయ్యారు. ఎంజేపీ గురుకులాల్లో నంద్యాల జిల్లా నరవాడకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలవడం విశేషం. ఆ పాఠశాలకు చెందిన శ్రీసాయి 596 మార్కులతో ఎంజేపీ గురుకులాలకు చెందిన విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచారు. రీటా సాహితి 593 మార్కులు, యశస్విని 589 మార్కులు సాధించి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

**మొన్న ఇంటర్‌లో... నేడు టెన్త్‌లో...**

ఈ నెల 15న విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ విద్యార్థులు సత్తా చాటిన విషయం విదితమే. జూనియర్ ఇంటర్ లో 97 శాతంతో, సీనియర్ ఇంటర్‌లో 94 శాతంతో బీసీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురువారం విడుదలైన టెన్త్ పరీక్షల్లోనూ 96.02 శాతం బీసీ బిడ్డలు ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. టెన్త్‌లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 85.25 శాతం కాగా ఎంజేపీ ఉత్తీర్ణతా శాతం 96.02 శాతంగా నమోదైంది. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతానికి పైగా సాధించడం విశేషం. జూనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ఫలితాలు 77 శాతం రాగా, ఎంజేపీలో 97 శాతంతో, సీనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ఫలితాలు 81 శాతం రాగా, ఎంజేపీ విద్యార్థులు 94 శాతంతో సత్తా చాటారు. ప్రభుత్వ పరిధిలో నడిచే అన్ని విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాలు జూనియర్ ఇంటర్‌లో ప్రథమ స్థానంలో, సీనియర్ ఇంటర్‌లో రెండో స్థానం నిలవడం గుర్తించుకోదగ్గ విషయం.

**బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు...**

ఎంజేపీ గురుకులాలతో పాటు బీసీ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులూ పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల నుంచి 8,466 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 7,280 మంది ఉత్తీర్ణత సాధించారు. 85.99 శాతం మేర బీసీ హాస్టళ్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. వారిలో 5,187 మంది ఫస్ట్ క్లాస్‌లో, 1,437 మంది సెకండ్ క్లాస్, 652 మంది థర్డ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. 1,001 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. బీసీ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు గతేడాది 77.22 శాతంతో ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 8.78 శాతం అధికంగా 85.99 శాతంతో పాసవ్వడం విశేషం. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీ హై స్కూల్లో విద్యనభ్యసిస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థిని కె.మానస మ్యాథ్స్ లో వందకు వంద మార్కులు సాధించడం విశేషం.

**అమరావతిలో సంబరాలు**

టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 96.02 శాతంతో ఉత్తీర్ణత సాధించడంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితను ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత మర్యాదపూర్వకంగా కలిశారు. గతేడాది కంటే అత్యధిక ఫలితాలు సాధించినందుకు కార్యదర్శి సత్యనారాయణకు, మాధవీలతకు స్వీట్లు అందజేసి మంత్రి అభినందించారు.

**సత్ఫలితాలిచ్చిన వంద రోజుల ప్రణాళిక: మంత్రి సవిత**

టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ గురుకులు, బీసీ హాస్టళ్ల విద్యార్థులు సత్తా చాటడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఎంజేపీలో 96.02 శాతంతో, బీసీ హాస్టళ్లలో 85.99 శాతంతో ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. మంత్రి లోకేష్ రూపొందించిన వంద రోజుల ప్రణాళిక సత్ఫలితాలిచ్చిందన్నారు. బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సంకల్పమన్నారు. విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని నమ్మి, ఎంజేపీ, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి రెండేళ్లలో పెద్దఎత్తున నిధులు కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బీసీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు బీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరపున మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

**మంత్రి కొలుసు పార్థసారథి**



కృష్ణాజిల్లా (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1న పమిడిముక్కలలో పర్యటించనున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం ఉదయం మీడియాతో మాట్లాడిన మంత్రి.. సీఎం పర్యటన వివరాలను వెల్లడించారు. పెన్షన్ల పంపిణీ, ప్రజావేదిక, కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొననున్నట్లు చెప్పారు. ప్రతినెల ఒకటో తేదీన ఎంతో చిత్తశుద్ధితో సీఎం లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందిస్తున్నారని తెలి పారు. ఒకటో తేదీన సెలవు అయితే.. 30, 31 తేదీల్లో పెన్షన్లను పంపిణీ చేయడం ఆయన అంకితభావానికి నిదర్శనమని తెలిపా రు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయం తెలుసు కునేం దుకు బిజీ షెడ్యూల్లో కూడా సీఎం చంద్రబాబు ప్రతివారం రెండు మూడుగంటలు ప్రజాక్షేత్రానికి కేటాయిస్తున్నారని మంత్రి తెలిపా రు. ఆర్టీజీఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలు సంతృప్తి చెందు తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందడంలో అవినీతి జరుగుతుందా అన్న అంశాలను కూడా సీఎం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు పమిడిముక్కల పర్యటనను దిగ్విజయం చేయాలని.. పెద్దఎత్తున ప్రజలు పాల్గొనా లని విజ్ఞప్తి చేశారు.

# ఒకవైపు నిప్పులకొలిమి... మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు

అమరావతి (చైతన్యరథం):రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు. గురువారం నెల్లూరు జిల్లా గూడూరులో ఈ సీజన్లోనే అత్యధిక ఉష్ణోగ్రత 45.8 డిగ్రీలు రికార్డయిందన్నారు. పల్నాడు జిల్లాలో 28, వైఎస్సార్ కడపలో 26, తిరుపతిలో 25, నెల్లూరులో 25, ప్రకాశంలో 22, మార్కాపురంలో 15, నంద్యాలలో 14, చిత్తూరు 13, గుంటూరులో 11 మండలాలు... మొత్తంగా 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 216 మండలాల్లో ఎండ తీవ్ర ప్రభావం చూపి 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు.

శుక్రవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలతో పాటు పార్వతీపురంమన్యం జిల్లా బలిజపేట, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, సీతంపేట, సీతానగరం మండలాలు, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం మండలాల్లో (9) తీవ్ర వడగాల్పులు, మరో 49 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు.

విజయనగరం జిల్లాలో 10, మన్యం 6, పోలవరం 5, కాకినాడ 3, తూర్పు గోదావరి 3, ఏలూరు 3, ఎన్టీఆర్ 4, గుంటూరు 3, పల్నాడు 11, మార్కాపురం 1 మండలాల్లో (49) వడగాల్పులు ప్రభావం చూపుతాయన్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వడగాల్పులు వీచే మండలాలు, ఉష్ణోగ్రతల పూర్తి వివరాలు కింది లింక్‌లో:https://apsdma.ap.gov.in/files/11decc66d7e4c7f894a d0e4009a1b959.pdf

గురువారం నెల్లూరు జిల్లా గూడూరులో 45.8, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 45.2, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45, తిరుపతి




జిల్లా రాయలచెరువులో 44.3, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా వలేటివారిపాలెంలో 43.6, బాపట్ల జిల్లా కారంచేడు, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 43.5, నంద్యాల జిల్లా సంజామలలో 43.2, వైఎస్సార్ కడప జిల్లా కోడూరులో 43 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మరోవైపు అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి సగటున 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో శు క్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రానున్న మూడు రోజులు అకాల వర్షాలకు ఆస్కారం ఉన్నందున రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.

# వైసీపీ సానుభూతిపరుడి 'భూ' దందా

- నేతల అండదండలతో వారసత్వ భూమి కబ్జా...
- ఆధార్ కార్డు బ్లాక్ చేసి భూమి ఆక్రమణ...
- తహసీల్దారు, వీఆర్వోలపై చర్యలకు విజ్ఞప్తి
- ప్రజావేదికలో బాధితుల ఫిర్యాదు

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఏపీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం ఒంటెలవారిపల్లె గ్రామానికి చెందిన రామనాథరెడ్డి అర్జీ... మా పొలాన్ని అవసరాల నిమిత్తం సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తికి విక్రయించాం. సదరు వ్యక్తి డబ్బులు చెల్లించకుండా నన్ను కోర్టుకు లాగారు. ఈ వివాదంపై సుదీర్ఘ కాలం విచారణ జరిపిన కోర్టు మాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. కోర్టు తీర్పు తర్వాత కొనుగోలుదారుడు తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేసి భూమిని మాకు అప్పగించేలా ఒప్పందం కుదిరింది. కానీ అతడు ఆ ఒప్పందాన్ని అమలు చేయట్లేదు. వైసీపీ సానుభూతిపరుడైన ఆ వ్యక్తికే అధికారులు కొమ్ముకాస్తున్నారు. ఈ సమస్యపై చిత్తూరు జేసీ, ఆర్డీవో, తహసీల్దారులను కలిసి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా "చేస్తాం.. చూస్తాం" అని చెప్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలూ తీసుకోవట్లేదు. వారిపై చర్యలు తీసుకుని నా సమస్యను పరిష్కరించండి.

కర్నూలు జిల్లా మంత్రాలయానికి చెందిన రంగస్వామిరావు విజ్ఞప్తి... మా గ్రామంలోని సర్వే నెం.217/లో నాకు 14.03 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇది మా ముత్తాత రామస్వామిరావు నుంచి తాత రామచంద్రరావుకు, ఆ తర్వాత తండ్రి విశ్వనాథరావుకు వారసత్వంగా సంక్రమించింది. తండ్రి అనారోగ్యం కారణంగా ఈ భూమిని కౌలుకు ఇచ్చారు. పట్టాదారు పాసుపుస్తకాలు తెచ్చుకుంటామని నమ్మించిన కౌలుదారులు తండ్రి దగ్గర నుంచి పుస్తకాలు తీసుకువెళ్లి వారసత్వంగా వచ్చిన అసలు పట్టాదారు రామచంద్రరావు పేరును కొట్టివేసి.. రామస్వామి, లక్ష్మణరావు, పాండురంగరావు అనే వ్యక్తుల పేర్లను అక్రమంగా ఎక్కించుకున్నారు. రికార్డుల్లో పేర్లు ఎక్కించుకున్న వారు కేవలం కులస్తులు మాత్రమే. వారితో మాకు ఎటువంటి రక్త సంబంధం లేదు. రాజకీయ అండతోనే ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ కౌలుదారులకు వైసీపీకి చెందిన ముఖ్య నేతల అండదండలు ఉండటంతో రెవెన్యూ అధికారులు మా ఫిర్యాదులపై చర్యలు తీసుకోవట్లేదు.

తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం బొల్లెద్దుపాలేనికి చెందిన విజయ అర్జీ ఇచ్చి... మా గ్రామంలో సర్వే నెం.306/5 లో 0.25 సెంట్ల భూమి కలదు. మా పేరు మీద 1-బి రికార్డు, అడంగల్‌లో స్పష్టమైన ఆధారాలు, పట్టాదారు పాసుపుస్తకం ఉన్నాయి. అయితే అప్పటి కోరుకొండ తహసీల్దారు పండ్యాల హరి గోపాలరామ పాపారావు, వీఆర్వో దయానంద స్వామి, మండల సర్వేయరు వెంకటేశ్వర్లు కలిసి మోసపూరిత చర్యలకు పాల్పడ్డారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, మా అనుమతి లేకుండా 0.25 సెంట్ల భూమిలో 0.12 సెంట్లను కాకర లక్ష్మయ్య అనే వ్యక్తి పేరు మీదకు మార్చారు. ఈ ప్రక్రియలో నాకు తెలియకుండా ఉండేందుకు నా ఆధార్ కార్డును బ్లాక్ చేసి ఓటీపీ రాకుండా చేసి మోసపూరితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ అన్యాయంపై ఆర్డీవోకి ఫిర్యాదు చేసినా మూడేళ్లుగా "చూస్తాం, చేస్తాం" అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి న్యాయం జరగలేదు.



పల్నాడు జిల్లా రొంపిచెర్ల మండలం పరగటిచర్లకి చెందిన శ్రీనివాస్ అర్జీ... మా గ్రామంలో మా పూర్వీకుల నుంచి వచ్చిన 1.50 ఎకరాల పొలం ఉంది. 2022 వరకు అన్ని రికార్డులు సక్రమంగానే ఉన్నా ఆ తర్వాత జరిగిన ప్రభుత్వ సర్వే గురించి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ప్రస్తుతం రికార్డుల్లో మార్పులు జరగడంతో నా భూమికి కొత్త పాస్‌బుక్ ఇవ్వాలని గత రెండు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. పొలం సర్వే చేయాలని కోరగా.. దాని చుట్టుపక్కల హద్దు దారులందరినీ పిలుచుకురావాలని సర్వేయర్ నిబంధన పెడుతున్నారు. గత 25 ఏళ్లుగా విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నాను. గ్రామంలోని పొలం చుట్టుపక్కల వారు ఎవరో నాకు పూర్తిగా తెలియదు. అందరినీ తీసుకురావడం నా వల్ల కాదు. డీఎల్ నంబరు ఇస్తేనే ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్ ఇవ్వగలమని సర్వేయర్ చెప్తుండగా క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి కాకపోవడంతో సమస్య మొదటికే వస్తోంది.

కాకినాడ జిల్లా స్వామినగర్‌కు చెందిన కొండ ముత్యాలమ్మ అర్జీ... అనకాపల్లి జిల్లా పరవాడ మండలం చీపురుపల్లి (తూర్పు) లో నా భర్త కొండ సింహాచలం (లేటు) పేరిట 0.19 1/2 సెంట్ల భూమి ఉంది. ఆయన 22-04-2009న మరణించిన తర్వాత నా పేరు మీద పాస్ బుక్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నాను. నాయుడుపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో అన్ని ఆధారాలు సమర్పించినా అధికారులు కేవలం 0.12 సెంట్లకు మాత్రమే పాస్ బుక్ ఇచ్చి మిగిలిన 0.07 సెంట్లను రికార్డుల్లో ఎక్కించకుండా వదిలేశారు. ఈ సమస్యపై అనకాపల్లిలో ఫిర్యాదు చేయగా అధికారులు సర్వే నిర్వహించి మిగిలిన 0.07 సెంట్ల భూమి ఉందని నిర్ధారించారు. ఆ సర్వే రిపోర్టును నాకు వాట్సప్ ద్వారా కూడా పంపారు. సర్వే రిపోర్ట్ ఆధారంగా నాయుడుపాలెం సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నా నేటికీ రికార్డులను సరిచేయలేదు.

కర్నూలు జిల్లా కల్లూరు మండలం ఉయ్యాలవాడకి చెందిన వెంకటరాముడు విన్నపం... మా గ్రామ పరిధిలోని సర్వే నెం.833 (0.96 సెంట్లు), 709 (3.91 ఎకరాలు) కలిపి మొత్తం 4.87 ఎకరాల భూమి నా తండ్రి (లేటు టి. జంబులయ్య) కాలం నుంచీ నా స్వాధీనంలో ఉంది. గత 55 ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నాం. ఈ భూమిని చుక్కల భూముల జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఓర్వకల్లు తహసీల్దారు "సెక్షన్ 22(ఎ) కింద తొలగించడం వీలుపడదు" అని ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. సదరు భూమిలో నాలుగేళ్లుగా ప్రభుత్వ అగ్రికల్చర్ విభాగం సహకారంతో మామిడి తోట పెంచారు. సొంతంగా బోరు, కరెంటు సౌకర్యం కల్పించుకున్నారు. భూమిపై పూర్తి ఆధారాలున్నా అధికారులు పట్టించుకోవట్లేదు.

కాకినాడ జిల్లా ఇంద్రపాలేనికి చెందిన అమ్మాజీ వినతి... నాకు రామేశంపేట గ్రామానికి చెందిన రేణ శ్రీనుతో వివాహం జరిగింది. ఒక కుమారుడు జన్మించాక కాపురం చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాను. నా అత్తగారు రేణ అమ్మమ్మ (లేటు), నాకు నా కుమారుడికి ఆసరాగా ఉండేందుకు సూరం పాలెం గ్రామంలోని సర్వే నెం.202(ఎ)లో గల 1.25 సెంట్ల కొండ పోరంబోకు భూమి కేటాయించింది. అత్తగారి సూచన మేరకు నా భర్త శ్రీను స్వయంగా అంగీకరించి మండల సర్వేయర్, వీఆర్వో సమక్షంలో భూమిని కొలిపించి నాకు, నా కుమారుడికి కలిపి 0.50 సెంట్ల భూమి పంచి ఇచ్చారు. సదరు భూమికి అధికారులు ఇప్పటికే సర్వే నిర్వహించినందున తక్షణం దానిని రికార్డుల్లో నమోదు చేసి నాకు పట్టాదారు పాస్ బుక్ మంజూరు చేయాలి.

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన కృష్ణప్రసాద్ అర్జీ... మాకు సర్వే నెం.495లో భూమి వుంది. దాంట్లో నివాస స్థలాల కోసం లే-అవుట్ ఏర్పాటు చేశాము. ఉత్తరం చిగురుపాటి పూర్ణచంద్ర రావు భూమి వైపు 85 అడుగుల 6 అంగుళాలు, అనిత, లాయర్ భూమి వైపు 85 అడుగుల 6 అంగుళాలు దక్షిణంగా, రోడ్డు వైపు తూర్పుగా 32 అడుగుల 9 అంగుళాలు, బంగారం కొట్టు ఆంజనేయ వెంకటరావు భూమి వైపు 32 అడుగుల 7 అంగుళాలు పడమరగా నాకు ఉండాల్సిన భూమి కొలతలు ఇవి.. పైన తెలిపిన ప్లాన్ ప్రకారం మేము కొలతలు చూసుకోగా... ఉత్తరం, దక్షిణ భాగాల్లో నాకు రావలసిన 85' 6" అడుగులకు బదులుగా కేవలం 83 అడుగులు మాత్రమే వస్తున్నాయి. అంటే సుమారు రెండున్నర అడుగుల మేర భూమి తక్కువగా వస్తోంది.

## విశాఖ ఎక్స్‌ప్రెస్ ఘటనలో నిందితుడి అరెస్ట్



విజయవాడ(చైతన్యరథం): విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో వివాహి తపై అత్యాచారం చేసిన యువకుడిని విజయవాడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని ఒడిశా రాష్ట్రానికి చెందిన శౌరవ్ బగ్గిగా గుర్తించారు. పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన భార్యాభర్తలు ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. గత ఆదివారం సాయంత్రం సొంతూరుకు వెళ్లేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎక్కారు. జనరల్ బోగీలో బాగా రద్దీగా ఉండటంతో దంపతులిద్దరూ బాత్‌రూము దగ్గర కూర్చున్నారు. ఏసీ బోగీలో బాయ్‌గా పని చేస్తున్న శౌరవ్ బగ్గి.. దంపతులిద్దరినీ ఏసీ బోగీలో కూర్చోవచ్చని పిలిచాడు. ఇద్దరూ ఏసీ కోచ్‌లోకి వెళ్లిన తర్వాత భర్త బాత్‌రూమ్ దగ్గర సెల్‌ఫోన్ చూసుకుంటూ నిలబడిపోయాడు. భార్య శౌరవ్‌తో పాటు లోపలకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన యువకుడు ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయం బయటకు తెలిస్తే రైలులో గొడవలు జరుగుతాయనే భయంతో బాధితురాలు భర్తకు చెప్పలేదు. ఇంటికి వచ్చిన తర్వాత భార్య ముభావంగా ఉండటం తో భర్త గట్టిగా నిలదీశాడు. దీంతో ఆమె జరిగిన దారుణాన్ని బయటపెట్టింది. ఇద్దరూ కలిసి రెంటచింతల స్టేషన్‌కు వెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు. రైల్వే పోలీసులు బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# హైదరాబాద్, బెంగళూరు నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- హజ్ యాత్రికులకు ఏర్పాట్లపై సచివాలయంలో సమీక్ష
- ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశం

అమరావతి (చైతన్యరథం): హజ్-2026 యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులకు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, వసతులు కల్పించాలని రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మే 4వ తేదీ నుంచి హజ్ యాత్రకు హైదరాబాద్, బెంగళూరు నుంచి బయల్దేరే యాత్రికులకు ఏర్పాట్ల కల్పనపై అధికారులతో సచివాలయంలోని మూడవ బ్లాక్‌లో మంత్రి గురువారం సమీక్షించారు. రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, మైనారిటీ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, సభ్యులు, సీఈవో గౌస్ పీర్‌తో పాటు సంబంధిత పర్యవేక్షణ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏపీ నుంచి ప్రస్తుత ఏడాది దాదాపు రెండువేల మంది యాత్రికులు హజ్ యాత్రకు వెళ్ళనున్ననున్నట్టు మంత్రి ఫరూక్ వెల్లడించారు.

మే 4 నుంచి 21 తేదీల మధ్యలో దశలవారీగా హజ్‌కు..



హైదరాబాద్ నుంచి 1202 మంది యాత్రికులు, బెంగళూరు నుంచి 447 మంది యాత్రికులు మే 4 నుంచి 21 తేదీ మధ్యలో దశలవారీగా హజ్ యాత్రకు బయల్దేరతారని, వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో అవసరమైన అన్ని చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఇతర రాష్ట్రాలలోని విమానాశ్రయాల ద్వారా హజ్‌కి వెళ్లే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు, వసతి, వైద్య సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని మైనారిటీ శాఖ కార్యదర్శి శ్రీధర్‌కు మంత్రి ఫరూక్ సూచించారు. హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కేషన్ కేంద్రాలను ఉపయోగించే ఆంధ్రప్రదేశ్ యాత్రికుల కోసం అవసరమైన ఏర్పాట్లలో భాగంగా నోడల్ అధికారులను నియమించడం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులైన యాత్రికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక సహాయ సేవల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సమీక్షలో నిర్ణయించారు. ఎంబార్కేషన్ కేంద్రాల వద్ద యాత్రికులకు భద్రమైన, పరిశుభ్రమైన వసతి ఏర్పాట్లను ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం, హజ్ కమిటీల సమన్వయంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. మంచి వసతి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజన వసతి, శుద్ధజల తాగునీటి సదుపాయాలు, సేవలందించే సంస్థలను ఎంపిక చేయడం, వాటిపై పర్యవేక్షణ విధానం అమలు చేయడం, విమానాశ్రయ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై ఆయా రాష్ట్రాల పర్యవేక్షణ బృందాలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. చెక్-ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను సులభతరం చేయడం, సహాయ కేంద్రాలు, క్షేత్రస్థాయిలో సహాయక సిబ్బంది నియామకం, విమానాల రాకపోకల వివరాలు, లగేజీ నిబంధనలపై ఎప్పటికప్పుడు హజ్ యాత్రికులకు సమాచారం అందించడం, డాక్యుమెంట్ల ధ్రువీకరణ, తక్షణ సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రాల ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం, గుర్తింపు ధృవీకరణ, రద్దీ నివారణ చర్యలు, రోజువారీ సమీక్షలు, ఫిర్యాదు కౌంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై మంత్రి అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని యాత్రికులందరూ తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చైతన్యరథం

# పుకార్లతో.. దిగజారుడు రాజకీయం!

**ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం ప్రతిపక్ష బాధ్యత కూడా. కానీ ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, సంక్షోభ పరిస్థితులను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడం మాత్రం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి ప్రమాదకరం. కొద్దిరోజులుగా పెట్రోల్, డీజిల్ కొరతపై జరిగిన ప్రచారం ఆ ప్రమాదకర ధోరణికి ప్రత్యక్ష ఉదాహరణ కాకపోదు.**

మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరతపై వార్తలు వచ్చాయి. అలాంటి సమయంలో సాధారణ ప్రజల్లో కొంత ఆందోళన ఉండటం సహజం. కానీ ఆ ఆందోళనను చల్లార్చాల్సిన బాధ్యత ఉన్న కొందరు రాజకీయవర్గాలు, అనుబంధ మీడియా సంస్థలు దానిని మరింత రెచ్చగొట్టే ప్రయత్నం చేశాయి. "పెట్రోల్ అయిపోతోంది", "డీజిల్ దొరకదు", "బంకులు ఖాళీ అవుతున్నాయి" అంటూ ప్రచారం చేయడం ద్వారా ప్రజలను భయంతో పరుగులు పెట్టించారు. ఫలితంగా సాధారణ పరిస్థితుల్లో ఎలాంటి సమస్య ఉండకపోయినా, ఒక్కసారిగా బంకులవద్ద భారీ క్యూలు కనిపించాయి. నిల్వలు వేగంగా ఖాళీ అయ్యాయి. అసలు కొరతకంటే ఎక్కువగా 'కొరత భావన'ను సృష్టించడం జరిగింది. ఇది సహజంగా వచ్చిన పరిస్థితి కాదు. పుకార్లతో సృష్టించిన కృత్రిమ సంక్షోభం.

### హుద్‌హుద్ గుర్తుచేసే ఘటన:

ఇలాంటి పరిస్థితులు కొత్తవి కావు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో విశాఖపట్నం ఎదుర్కొన్న విపత్తు ఇప్పటికీ ప్రజల మదిలో ఉంది. నగరం చీకట్లో మునిగిపోయింది. రోడ్లు ధ్వంసమయ్యాయి. వేలాది కుటుంబాలు ఆహారం, నీటి కోసం ఇబ్బంది పడ్డాయి. అలాంటి క్లిష్ట సమయంలో కూడా కొందరు వ్యాపారులు ఆపదను అవకాశంగా మార్చుకోవాలని చూశారు. పెట్రోల్ ధరలను పెంచి విక్రయించాలనే ప్రయత్నాలు జరిగాయి. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనాస్థలానికి వెళ్లి కఠిన హెచ్చరిక చేశారు. "ప్రజల కష్టాన్ని వ్యాపారంగా మార్చుకుంటే సీజ్ చేస్తాం" అని స్పష్టం చేశారు. ఆ ఒక్క హెచ్చరికతో పరిస్థితి మారింది. ఎందుకంటే పరిపాలన అంటే కేవలం ప్రకటనలు కాదు --- సంక్షోభాన్ని అదుపులో పెట్టే సామర్థ్యం కూడా కావాలి. అదే పరిపాలనా ధోరణి ఇప్పుడు కూడా కనిపించింది. పరిస్థితి అదుపు తప్పే సూచనలు కనిపించగానే ప్రభుత్వం రంగంలోకి దిగింది. సరఫరాలపై స్పష్టమైన సమాచారం ఇచ్చింది. ప్రజల్లో నమ్మకం కల్పించింది. గంటల వ్యవధిలోనే ఉద్రిక్తత తగ్గిపోయింది.

### పుకార్ల వెనక రాజకీయ వ్యూహం:

ఈ ఘటనలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే –కొన్ని రాజకీయ శక్తులు ఈ పరిస్థితిని ఉద్దేశపూర్వకంగా మరింత తీవ్రతరం చేయడానికి ప్రయత్నించాయనే అనుమానం. సోషల్ మీడియా పోస్టులు, యూట్యూబ్ చర్చలు, టీవీ స్క్రోలింగులు –అన్నీ ఒకే దిశగా పనిచేసినట్టు కనిపించాయి. "ఇంధనం దొరకదు" అనే భయాన్ని ప్రజల్లో నాటడానికి సమన్వయంతో ప్రయత్నం జరిగిన భావన కలిగింది. ఇక్కడ ప్రశ్న ఒకటే –ప్రజల్లో భయాన్ని పెంచి రాజకీయ లాభం పొందాలనుకోవడం ఎంతవరకు సమంజసం? ప్రత్యర్థి పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు. విధానాలను ప్రశ్నించవచ్చు. కానీ రాష్ట్రంలో కృత్రిమ గందరగోళం సృష్టించడం ద్వారా సామాన్యుడి జీవితాన్ని అస్థిరం చేయడం బాధ్యతాయుత రాజకీయాలా? పెట్రోల్ బంకుల వద్ద క్యూలో నిలబడ్డది రాజకీయ నాయకులు కాదు. సాధారణ ప్రజలే. ఆటో డ్రైవర్లు, ఉద్యోగులు, రైతులు, చిన్న వ్యాపారులు –రోజు వారీ జీవనంపై ఆధారపడే వర్గాలే ఎక్కువగా ఇబ్బందిపడ్డారు. రాజకీయ ప్రచారం ముగిసిపోయాక కూడా ఆ ఇబ్బంది మాత్రం ప్రజలకే మిగిలింది.

### అమరావతిపై అక్కసు.. అభివృద్ధిపై అసహనం:

పెట్రోల్ పుకార్ల ప్రచారం మధ్యలో మరో అంశాన్ని కావాలనే లాగారు. అది–"అమరావతి కోసం ఇంధనం నిల్వ చేస్తున్నారా?" అనే స్క్రోలింగులు నడిపించడం ద్వారా అసలు ఉద్దేశం బయటపడింది. గూగుల్ శంకుస్థాపనవంటి భారీ పెట్టుబడి కార్యక్రమం జరుగుతున్న సమయంలో దృష్టి మళ్లించే ప్రయత్నం స్పష్టంగా కనిపించింది. వాస్తవానికి గూగుల్ వంటి ప్రపంచస్థాయి సంస్థ ఆంధ్రప్రదేశ్‌వైపు చూడటం చిన్న విషయం కాదు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన సంకేతం. పెట్టుబడిదారులు ఎక్కడికి వస్తారు? స్థిరత్వం ఉన్నచోటుకు. మౌలిక వసతులు ఉన్న చోటుకు. భవిష్యత్తుపై స్పష్టమైన విజన్ కనిపించే చోటుకు. అమరావతి గురించి ఎన్ని పుకార్లు పుట్టించినా – పెట్టుబడిదారులు భావోద్వేగాలతో కాదు, డేటాతో నిర్ణయాలు తీసుకుంటారు. అంతర్జాతీయ సంస్థలు సోషల్ మీడియా ట్రోలింగ్ చూసి పెట్టుబడులు పెట్టవు. పాలన, విధానాలు, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, దీర్ఘకాల దిశ –ఇవన్నీ పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాయి. అందుకే అమరావతి ప్రయాణం పుకార్లతో ఆగదు.

### "బావిలో కప్ప" రాజకీయాల పరిమితి:

ఒకప్పుడు గ్రామాల్లో పెద్దలు ఒక సామెత చెప్పేవారు –"బావిలో కప్పకు ఆ బావే ప్రపంచం." ఇప్పుడు కొన్ని రాజకీయ వర్గాల పరిస్థితి కూడా అదేలా కనిపిస్తోంది. తమకు కనిపించేదే ప్రపంచమని భావించడం, తమ ప్రచారమే ప్రజల అభిప్రాయమని అనుకోవడం ప్రమాదకర భ్రమ. సోషల్ మీడియాలో కొద్ది గంటలు ట్రెండ్ అయ్యిందని ప్రజాభిప్రాయం మారిపోదు. ఒక టీవీ స్క్రోలింగ్‌తో రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించబడదు. అభివృద్ధి అంటే నిరంతర ప్రక్రియ. అది శబ్దాలతో కాదు, నిర్మాణాలతో కొలవబడుతుంది. అమరావతి నిర్మాణం, విశాఖలో పెట్టుబడులు, పరిశ్రమల రాక, డిజిటల్ మౌలిక సదుపాయాలు –ఇవన్నీ దీర్ఘకాలిక మార్పుల సంకేతాలు. వాటిని అడ్డుకోవడానికి పుకార్లను ఆయుధంగా వాడుకోవడం కొంతకాలం చర్చనీయాంశం కావచ్చు. కానీ చరిత్రలో నిలిచేది అభివృద్ధే.

### బాధ్యతాయుత రాజకీయాలకు ఇదే సమయం:

ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ పార్టీలందరికీ ఒక పెద్ద బాధ్యత ఉంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, మార్కెట్ ఒత్తిడులు పెరుగుతున్నవేళ ప్రజల్లో నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉంది. అలాంటి సమయంలో భయాలను రెచ్చగొట్టడం కాదు –సమాజాన్ని స్థిరంగా ఉంచడం ముఖ్యం. ప్రజలకు ఇప్పుడు అవసరమైనది పుకార్లు కాదు, విశ్వాసం. రాజకీయ డ్రామాలు కాదు, పరిపాలనా స్థిరత్వం. కృత్రిమ భయాలు కాదు, స్పష్టమైన సమాచారం. రాష్ట్ర భవిష్యత్తు సోషల్ మీడియా ప్రచారాలతో నిర్ణయించబడదు. పనిచేసే ప్రభుత్వాలు, పెట్టుబడులను ఆకర్షించే విధానాలు, ప్రజల్లో నమ్మకం కలిగించే నాయకత్వం –ఇవే భవిష్యత్తును నిర్మిస్తాయి.

### పుకార్లు తాత్కాలికం... ప్రగతి శాశ్వతం

పుకార్లుకొంతసేపు గందరగోళం సృష్టించగలవు. కానీ అభివృద్ధి ప్రయాణాన్ని ఆపలేవు. రాజకీయ అక్కసు కొంతకాలం శబ్దం చేయగలదు. కానీ నిర్మాణాత్మక దిశలో నడిచే రాష్ట్రాన్ని వెనక్కి లాగలేదు. అలాగే, అభివృద్ధి కూడా. పుకార్లకు భయపడదు. అడ్డంకులకు ఆగదు. ప్రజల ఆకాంక్షలతో ముందుకు సాగుతూనే ఉంటుంది.

- జమ్ము సాయి కల్యాణ్,
అనలిస్టు, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్.

# గ్రీన్ విద్యుత్ వెలుగులు

### పర్యావరణహిత విద్యుదుత్పత్తిపై కూటమి స్పెషల్ ఫోకస్

విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసి ఆ ఫలాలను నేటితరానికి అందించిన గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు. లోటు విద్యుత్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. 2024 తరువాత కూటమి ప్రభుత్వ సారథిగా బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు.. ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలని ఉద్దేశ్యంతో మరోసారి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా పర్యావరణ కాలుష్య నివారణతోపాటు విద్యుత్ డిమాండ్ తగ్గించాలనే గొప్ప ఆలోచనతో పునరుత్పాదక ఇందనరంగాలపై దృష్టి పెట్టారు. సోలార్, విండ్, టైడల్, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజీవంటి విద్యుదుత్పత్తి రంగాలపై దృష్టిపెట్టి లక్షల కోట్ల పెట్టుబడితోపాటు యువతకు ఉపాధి అవకాశాలు తీసుకొచ్చారు.

### సామాన్యుల ఇళ్లపై సౌర వెలుగులు:

విద్యుత్ వినియోగదారులను, ఉత్పత్తిదారులుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో పీఎం సూర్య ఘర్ పథకాన్ని చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుంది. సామాన్యుల ఇళ్లపై సౌరపలకలు అమర్చి.. ప్రతీ ఇంటిని చిన్నపాటి విద్యుదుత్పత్తి కేంద్రంగా తయారు చేస్తుంది. ఈ ప్రాజెక్టు కోసం దేశంలోనే 14 లక్షల దరఖాస్తులతో మన రాష్ట్రం మొదటిస్థానంలో ఉందంటే ఈ పథకంపట్ల ప్రభుత్వ ప్రత్యేక చొరవ, రాయితీలే కారణం. మరో రెండేళ్లలో సుమారు 40 లక్షల కనెక్షన్లు కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పనిచేస్తుంది. ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్రాజెక్టును ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1200 కోట్లతో 6 లక్షల కుటుంబాలకు అందించారు. అలానే 3కేవీ సోలార్ రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే బీసీ కుటుంబాలకు రూ.98 వేలు, ఓసీకుటుంబాలకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 2లక్షల కుటుంబాలు లబ్ది పొందాయి. ఈ సోలార్ ద్వారా ఉత్పత్తి అయినా విద్యుత్ ను ఇంటి అవసరాలకు వాడుకోగా.. మిగిలింది యూనిట్‌కు రూ.2.09 చొప్పునడిస్కంలకు అమ్ముకునే సౌలభ్యం ప్రభుత్వం తీసుకొచ్చింది.

### రైతులకు పీఎం కుసుమ్:

రైతు కష్టాలపై స్పష్టమైన అవగాహన ఉన్న చంద్రబాబు నాయుడు అన్నదాతలకు ఎప్పుడూ అండగా ఉంటున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఏ మాత్రం రాజీపడటం లేదు. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు, మద్దతు ధరలు, ఇన్ పుట్ సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్, డ్రోన్స్ సదుపాయం తీసుకొస్తూ రైతుల పక్షన పెద్దన్నగా నిలుస్తున్నారు. పగటి పూట 9 గంటలు ఉచిత విద్యుత్ అందించి సాగులో సాయపడుతున్నారు.కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎంకుసుమ్నుసమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ పథకం ఉపయోగాలు గురించి కూటమి ప్రభుత్వంరైతులకు అవగాహన కల్పిస్తుంది.సుమారు 4 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేస్తుంది. రెండు దశల్లో ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్దంగా ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే సుమారు 3185 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వానికి రూ.8,656 కోట్లు వరకు ఆదా అవుతుంది.

### క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు:

విద్యుత్ రంగంలో సంస్కరణలు మొదలుపెట్టి ఆంధ్రప్రదేశ్ ను మిగిలిన విద్యుత్ రాష్ట్రంగా మార్చిన ఘనత చంద్రబాబు నాయుడుకు మాత్రమే దక్కుతుంది. 1995 నాటికి స్వాతంత్ర్యం వచ్చి 48 ఏళ్లు కాగా అప్పటి వరకు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేవలం 5000 మెగావాట్లు మాత్రమే. ఆ తర్వాత సీఎంగా ఎన్నికైన చంద్రబాబు నాయుడు ఒకేసారి 5000 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించారు. ఇప్పుడు మరో మారు సంస్కరణలకు నాంది పలికారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలనే దృఢ సంకల్పంతో పర్యావరణ హిత విద్యుత్ తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.ఏపీ సమీకృత స్వచ్ఛ ఇంధనపాలసీ విధానం కింద 2029 నాటికి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులతో పాటు 7.5 ఉద్యోగాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు ఈ రంగంలో రూ.6 లక్షల కోట్లు పెట్టుబడులతో పాటు సుమారు 2.5 లక్షల ఉద్యోగాలకు సంబంధించిన ఒప్పందాలను కూటమి ప్రభుత్వం చేసుకుంది. ఇటీవల జరిగిన ఎస్ఐపీబీ 16వ సమావేశంలో రూ.40వేల కోట్లకు సంబంధించిన పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రీన్యూఎనర్జీ,ఎన్టీపీసీగ్రీన్ హైడ్రోజన్,టాటా పవర్, చింత గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ వంటి కంపెనీలు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతూ పర్యావరణ హిత విద్యుత్ ను ఉత్పత్తిని చేస్తున్నాయి.

### విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన జగన్:

ఒక్క అవకాశం అంటు అధికారం చేపట్టిన జగన్ రెడ్డి.. అన్ని రంగాలతో పాటు విద్యుత్ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. అప్పటి వరకు ఉన్న పీపీఏ ఒప్పందాలను రద్దు చేసి ఐదేళ్లలో విద్యుత్ రంగానికి సుమారు రూ. 1,29,503 కోట్లు నష్టం చేకూర్చాడు.విద్యుత్ సంస్థలపై రూ. 49,596 కోట్లు అప్పులునెట్టారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో విద్యుత్ రంగ అప్పులు 79 శాతంపెరిగాయి. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి వినియోగదారులపై రూ.32,166 కోట్లు భారం వేసి వాళ్ల నడ్డి విరిచాడు. గృహ వినియోగదారులపై 45 శాతంచార్జీలు పెంచాడు. నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వినియోగదారులకు అండగా ఉండేందుకు సుమారు రూ.20,288 కోట్లు విద్యుత్ భారం ప్రభుత్వమే భరించింది.చరిత్రలో తొలిసారిగా యూనిట్ విద్యుత్ పై 13 పైసలు తగ్గించి ట్రూ డౌన్ సాధించి వినియోగదారులకు గతంలో ఏ ప్రభుత్వం చేయని మేలు చేసింది.

- ఎన్ నీలం నాయుడు,
అనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

జోన్ - 1
(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)
చైతన్యరథం

# ఉత్తరాంధ్రను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



విజయనగరం (చైతన్యరథం): యువ క్రీడాకారులకు ఆధునిక శిక్షణతోపాటు సదుపాయాలను కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. విజయనగరంలోని విజ్జి స్టేడియం వద్ద స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుపై గురువారం వారు జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావుతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం- ప్రైవేటు భాగస్వామ్యంతో ఉత్తరాంధ్రను స్పోర్ట్స్ హబ్ తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించడంతోపాటు స్థానిక ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై జీఎంఆర్ గ్రూపు చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు.

# నరసన్నపేటలో టీడీపీ మహిళా నేత బగ్గు అర్చనకి ఘన స్వాగతం



నరసన్నపేట (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా ఘనస్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తనయరాలైన అర్చనకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయపూర్వకంగా శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పైడితల్లిమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా పార్టీ కార్యాలయం వరకు ఆమెను తోడ్కొని వెళ్లారు. ర్యాలీలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొని “అర్చనకి శుభాకాంక్షలు” తెలియజేసి “పార్టీకి కొత్త శక్తి” వంటి నినాదాలతో నరసన్నపేటలో ర్యాలీగా వెళ్లారు. మహిళా కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మార్గమధ్యంలో పలువురు స్థానిక ప్రజలు, వ్యాపారులు, అభిమానులు ఆమెకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. పార్టీ కార్యాలయం వద్ద ముగిసిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, బగ్గు అర్చన నియామకం నరసన్నపేట రాజకీయాల్లో కొత్త దిశను చూపుతుందని పేర్కొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం : బూరుగుపల్లి

నిడదవోలు (చైతన్యరథం): సీఎం సహాయనిధి పేద ప్రజలకు ఓ వరం అని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను రైతు భవనంలో గురువారం లబ్దిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. 64 మందికి రూ.22.72 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. అనంతరం శేషారావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నిడదవోలు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం 1021మంది లబ్ధిదారులకు రూ.6.17 కోట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండ ఆర్టీసీ డిపోలో ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం కార్యక్రమంలో పాల్గొన్న జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ ఆర్టీసీ డిపోలో మస్తాన్‌వలి దంపతులు మరియు గోవిందరావు దంపతులు (డ్రైవర్) వారి ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆర్టీసీ అధికారులు, యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విరమణ పొందిన ఉద్యోగుల సేవలను కొనియాడుతూ, వారి భవిష్యత్తు జీవితం సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు.

# ఏపీలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత...

## అవసరం లేకుండాబయటకు రావద్దు : విపత్తు నిర్వహణ




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకున్నాయని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఒక వైపు ఎండలు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. పలు జిల్లాల్లో పిడుగులతో పాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాబోయే 3 రోజులు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేశారు. గురువారం మార్కాపురం జిల్లా పొదిలిలో 37మిమీ, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కలలో 22మిమీ, నంద్యాల జిల్లా మెట్టుపల్లిలో 10.5 మిమీ వర్షపాతం నమోదయిందని వివరించారు.

మరో వైపు పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరులో 45.8°C ఉష్ణోగ్రత నమోదయిందని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉష్ణోగ్రత అని చెప్పారు. పల్లాడు జిల్లా పిడుగురాళ్లలో 45.2°C, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45°C ఉష్ణోగ్రతలు నమోదయిందని వివరించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 216 మండలాల్లో 41°C పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు తెలిపారు. పల్నాడు 28, వైఎస్సార్ కడప 26, తిరుపతి 25 మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉందన్నారు.

శుక్రవారం(మే 1వ తేదీ) 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైలు తెలిపారు. మరో 49 మండలాల్లో వడగాలుల ప్రభావం ఉంటుందని వివరించారు. పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లో తీవ్ర వడగాలుల ముప్పు పొంచి ఉందన్నారు. విజయనగరం, పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఉంటుందని చెప్పారు. ఎండ తీవ్రత, ఉక్కపోత నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎండీ ప్రఖర్ జైన్ స్పష్టం చేశారు. అవసరం లేకుండా మధ్యాహ్నం వేళ.. ఇంటి నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. కర్ణాటక నుంచి మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి ప్రభావం కారణంగా ఈ పరిస్థితులు ఉత్పన్నమైనట్లు విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ వివరించారు.

# కాఫీ తోటల్లో బయటపడ్డ గంజాయి డెన్

**●ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా ఏపీ పోలీసుల తనిఖీలు**



అల్లూరి జిల్లా (చైతన్యరథం): అల్లూరి జిల్లా పోలీసుల చేపట్టిన ఆపరేషన్‌లో.. గంజాయి డెన్ బయటపడింది. అది కూడా ఎక్కడో గ్రామంలో కాదు.. ఇంట్లో కూడా కాదు.. ఏకంగా శివారు ప్రాంతంలో ఉన్న ఒక కాఫీ తోటల్లో. ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా అల్లూరి జిల్లా పోలీసులు పాడేరు ఏజెన్సీలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సెర్చ్ ఆపరేషన్ చేపడుతున్నారు. గంజాయి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గిరిజనులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈగల్ బృందానికి, పోలీసులకు ఒక కీలక సమాచారం అందింది. ఏఓబి లోని ముంచంగిపుట్టు మండలం పాసపుట్టు పంచాయతీ సంగం వలస గ్రామ శివారులో గంజాయి డెన్ ఉన్నట్టు తెలుసుకుని వెళ్లారు. చూస్తే అక్కడ కాఫీ తోటలే కనిపించాయి. తమ వచ్చిన సమాచారం సరైన ఒక సమయంలో అనుమానం కూడా పడ్డారు పోలీసులు. ఒక్కసారిగా అందరూ కలిసి సెర్చ్ ఆపరేషన్ చేశారు. కాఫీ తోటల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. దీంతో ఓ చోట అనుమానాస్పదంగా మూటలు కనిపించాయి. వెళ్లి చెక్ చేయగా.. ఒక్కో మూట తెరిస్తే అందులో గంజాయి గుప్పు మంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా.. 39 మూటలు గుర్తించారు. వాటిలో 749 కిలోల గంజాయి బయటపడింది. కాఫీ తోటల మాటన బయటపడిన ఈ గంజాయితో పోలీసులే షాక్ అయ్యారు. గంజాయి ఘాటు వాసన నుంచి ఎన్ఫోర్స్మెంట్ దృష్టి మరల్చేందుకే కాఫీ తోటల్లో గంజాయి మూటలు పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు పోలీసులు.

‘పట్టుబడిన గంజాయి విలువ 37.45 లక్షలు ఉంటుందని అంచనా. గంజాయిని అక్కడ ఎవరు నిల్వ చేశారని దానిపై దర్యాప్తు చేస్తున్నాం. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం. గంజాయి రహిత జిల్లాగా అల్లూరి జిల్లాను చేయాలనే లక్ష్యంతో ఆపరేషన్ వజ్రప్రహార్ విస్తృతంగా కొనసాగిస్తున్నాం. ప్రజల గంజాయికి దూరంగా ఉండి.. సహకరించాలి. గంజాయి కార్యకలాపాల్లో ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవు” అని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు.

**●రూ.13 కోట్లతో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 1500 కేఎల్ వాటర్ ట్యాంక్ ప్రారంభం**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 1500 కేఎల్ వాటర్ ట్యాంక్‌ను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. గురువారం రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించి స్థానిక ప్రజానీకానికి తాగునీటి కష్టాలకు స్వస్తి చెప్పారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ నందమూరి నగర్ వైవి రావు ఎస్టేట్స్ నందు 1500 కేఎల్ సామర్థ్యంతో ఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే బొండావమ్మా కలిసి ప్రారంభించారు పూజా కార్యక్రమాలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి కుళాయి ద్వారా బిందెలతో నీటిని నింపి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ప్రాంతం ఏదైనా ప్రాధాన్యత అందరికీ సమానమేనని ఎంపీ చిన్ని తెలియజేశారు. త్రాగునీటి సమస్య ఉన్న ప్రతి ప్రాంతంలో ప్రభుత్వ సహాయ సహకారాలతో త్రాగునీటి సమస్యను రూపుమాపే లక్ష్యంగానే పనిచేస్తున్నామని తెలియజేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల త్రాగునీటి సమస్య ఏర్పడిందని కోటమీ ప్రభుత్వం దాన్ని రూపుమాపేందుకు అన్ని విధాల కృషి చేస్తుందని తెలియజేశారు శివారు ప్రాంతాల్లో సైతం అన్ని ప్రాంతాలకు ఇచ్చే సమాన ప్రాధాన్యతే ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి సూచనలు చేశారని తెలియజేశారు వాటర్ ట్యాంక్ వల్ల మహిళలు ఎంతగానో ఇబ్బంది పడుతున్న త్రాగునీటి సమస్య తీరిందని గుర్తు చేశారు. సుమారు 13 కోట్ల వ్యయంతో 15 ఆర్థిక సంఘం ఏఎంఆర్యుటి పథకం జనరల్ ఫండ్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో జరిగిన సమావేశంలో విజయవాడ నగరంలోని ప్రధాన సమస్యలు చర్చించామని ఎంపీ గుర్తుచేశారు అమరావతి తరహాలోనే విజయవాడ ను సైతం అందంగా అభివృద్ధి పథంగా తీర్చిదిద్దేందుకు కావలసిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమా మాజీ కార్పొరేటర్లు డివిజన్ ఇన్చార్జులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## నియోజకవర్గ పరిశీలకులతో ఎమ్మెల్యే సొంగా రోషన్ సమీక్షా సమావేశం



చింతలపూడి (చైతన్యరథం): శాసనసభ్యుల వారి క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్‌ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుల బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వారితో కలిసి నియోజకవర్గంలోని గ్రామ స్థాయి పరిస్థితుల నుండి లీడర్ టు క్యాడర్ వరకు ఉన్న అంశాలపై సమగ్రంగా చర్చించారు. పార్టీ బలోపేతం, కార్యాచరణ తీరు, భవిష్యత్ కార్యక్రమాలపై కూడా పలు సూచనలు, అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు లంకా రత్నరావు, ఎం.డి ఫారుక్, అయూబ్ ఖాన్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో విశ్రాంతి షెల్టర్ ప్రారంభోత్సవం

### మోటారు మర్చెంటు వారి దాతృత్వానికి గద్దె ప్రశంశలు



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) వారు ప్రతి నిత్యం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయార్థం వచ్చేవారి కొరకు రూ.7.5 లక్షల ఖర్చుతో విశ్రాంతి షెల్టర్ నిర్మించి ఇవ్వడం ఎంతో అభినందించదగ్గ విషయమని తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్ ప్రశంశించారు. గురువారం ఉదయం విజయవాడలోని ప్రభుత్వ ఆసపత్రిలో ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) వారు నిర్మించి ఇచ్చిన విశ్రాంతి షెల్టర్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమములో తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్దె రామమోహన్ మాట్లడుతూ... మర్చెంట్స్ అసోసియేషన్ వారి దాతృత్వాన్ని కొనియాడారు. రోగులు, వారితో వచ్చేవారి సౌకర్యార్థం ఇలా నిర్మించి ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ షెల్టర్ ఎంతోమందికి ఉపకరిస్తుందన్నారు. అసోసియేషన్ నిరంతరం ఏదోఒక సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటుందని తెలియజేస్తూ ప్రజలకు సాయపడాలనే వారి సహృదయతను కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గంగాధర్ మాట్లాడుతూ షెల్టర్ నిర్మాణం కొరకు మోటారు మర్చెంటు అసోషియేషన్ వారిని సంప్రదించగానే వారు వెంటనే నిర్మించి ఇచ్చినందుకు అమ్మ సంస్థవారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ షెల్టర్ నిర్మాణం వల్ల రోగులు మరియు వారి సహాయకులకు ఎండ, వానల నుండి రక్షణగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ అధ్యక్షులు గారపాటి సంతోష్ బాబు, జనరల్ సెక్రటరీ సుంకర చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు గారపాటి విజయకుమార్, బొబ్బా నారాయణరవు, యార్లగడ్డ సుబ్బారావు మరియు వర్ణమూడి వెంకటేశ్వరరావు, సినియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, మరియు హస్పిటల్ ఆర్.ఎం.ఒ. మరియు సిబ్బంది పాల్గోన్నారు.

## డ్వాక్రా సంఘాలు ఆర్థిక ప్రగతి దేశానికే గర్వకారణం : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘ మహిళల ఆర్థికాభివృద్ధికి విశేషంగా సహకరిస్తున్నాయని, వారి ఆర్థికాభివృద్ధికి చేయూత నందిస్తున్నాయని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల సహకారంతో డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. యడ్లపాడు మండలం చెంగిజ్‌ఖాన్‌పేటలో సెర్ఫ్ ఆధ్వర్యంలో ఎస్.బీ.ఐ ఆర్థిక సహకారంతో ఏర్పాటు కానున్న మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

**చంద్రబాబు మానసపుత్రికలు దేశానికే గర్వకారణంగా నిలిచాయి**

చంద్రబాబు మానసపుత్రికలైన డ్వాక్రా సంఘాలు నేడు దేశానికే గర్వకారణంగా నిలిచాయని, అంచెలంచెలుగా తమ ఆర్థిక ఉన్నతికి వారు చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం బ్యాంకులు రుణాలు అందించడంలో ఉదారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నేడు యడ్లపాడు మండలంలో తొలి మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. దీంతో పాటు కట్టుబడివారిపాలెం, బుక్కాపురం, చిలకలూరిపేట పట్టణంలో కూడా ఈ తరహా యూనిట్స్ ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. మునగాకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో మునగ రైతులకు ఆర్థికంగా లాభం కలుగుతుందన్నారు. ఎకరాకు రూ.లక్షకు పైబడి ఆదాయం వస్తుందన్నారు.

**డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో మండలానికో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం : ఎంపీ లావు**

మునగ ఆకుతో ఎనలేని ప్రయోజనాలు లభిస్తాయని, రూ.1కోటి 40 లక్షలతో జిల్లాలో మొదటి మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ కు శంకుస్థాపన చేశామని, తొలిదశలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసి, అవి విజయవంతమైతే వాటి సంఖ్య మరింత పెంచుతామని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో పాటు.. డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో ఈ తరహా ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయడంతో పాటు, ఉత్పత్తుల తయారీ, విక్రయ నైపుణ్య శిక్షణను కూడా అందిస్తున్నామని ఎంపీ చెప్పారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులతో పాటు, ప్రాంతాలను బట్టి తయారయ్యే ఇతర ఉత్పత్తులు, వస్తువులకు కూడా తగిన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చిలకలూరిపేట పట్టణంలో ఫర్నీచర్ తయారీ, మార్కెటింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరినట్టు ఎంపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెటర్నరీ ఆసుపత్రికి కొత్త దిశ

**●రూ.27.50 లక్షలతో ఆధునిక ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ సేవలు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పశుసంవర్ధక రంగంలో రాజమహేంద్రవరం నగరం మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిలో అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సదుపాయాలు అందుబాటులోకి రావడంతో జంతు వైద్య సేవలు కొత్త దశలోకి ప్రవేశించాయి. సుమారు రూ.27.50 లక్షల వ్యయంతో పేపర్ మిల్లు CSR నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఈ యంత్రాలను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రుల్లో అరుదుగా లభించే సదుపాయాలు ఇప్పుడు రాజమహేంద్రవరం ప్రజలకు అందుబాటులోకి రావడం గర్వకారణమన్నారు. ఇప్పటి వరకు పశు వులకు, పెంపుడు జంతువులకు ఎక్స్‌రే లేదా స్కానింగ్ అవసరమైనప్పుడు రైతులు, జంతు ప్రేమికులు కాకినాడ, గన్నవరం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై ఆ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయని తెలిపారు. మూడు నెలలలోపు ఉన్న దూడలు, పశువులు, కుక్కలు, పిల్లులు సహా అన్ని జంతువులకు అవసరమైన ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఇప్పుడు స్థానికంగానే అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సదుపాయాలతో జంతువుల ఆరోగ్య సమస్యలను త్వరగా గుర్తించి సమయానికి చికిత్స అందించవచ్చని వెల్లడించారు. డిజిటల్ ఎక్స్‌రే ద్వారా పరీక్ష ఫలితాలు వెంటనే మొబైల్ ఫోన్‌కు చేరే విధంగా సాంకేతిక సదుపాయాలు కల్పించామని వివరించారు. అల్ట్రాసౌండ్ ద్వారా కిడ్నీలు, అంతర్గత అవయవాల పరిస్థితిని సులభంగా నిర్ధారించవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజారోగ్యంతో పాటు జంతు సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## ప్రజల క్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

**●రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం- రావత్ పథకంతో రక్ష : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



దెందులూరు (చైతన్యరథం): రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు సకాలంలో వైద్యం అందించి, ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “ పీఎం- రావత్ “Road Accident Victims Assistance Through Health Support) పథకం ఒక గొప్ప వరమని, ప్రజల క్షేమం పట్ల కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధికి ఇది మరో నిదర్శనమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పలువురు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... “రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో సరైన వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా, ప్రమాదం జరిగిన వెంటనే నగదు రహిత చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిందని వివరించారు.” ప్రమాదానికి గురైన వ్యక్తికి ఆసుపత్రిలో చేరిన మొదటి 48 గంటల్లో లేదా రూ.1.5 లక్షల వరకు అయ్యే అత్యవసర చికిత్సను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. బాధితుడు ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు. ఈ పథకం గురించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు, ముఖ్యంగా వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు.

## కళలు, కవులను ప్రోత్సహించడం కూడా ఒక కళే : వై.వి.బి

ఉయ్యూరు (చైతన్యరథం): మన సమాజానికి కళలు, కవులు స్ఫూర్తిదాయకమని, కళ అనేది మానవ భావాలను దృశ్యాలుగా, శబ్దాలుగా, శిల్పాలుగా మలిచే సృజనాత్మక ప్రక్రియ అని, కవిత్వం అనేది భాషను ఉపయోగించి భావాలకు అక్షర రూపం ఇచ్చే సాహిత్య కళ అని, ఈ రెండూ అంతఃసౌందర్యాన్ని, మానవ అనుభవాలను వ్యక్తీకరించే మార్గాలే అని, ఈ రెండింటిని ప్రోత్సహించడం కూడా ఒక కళే అని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం శ్రీనివాస గ్రావిటీ విద్యాసంస్థల యాజమాన్యం వారు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, పరుచూరి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పరుచూరి రఘుబాబు స్మారక 36వ అఖిలభారత నాటక పోటీల కార్యక్రమంలో వై.వి.బి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ ఉయ్యూరు నుంచి వెళ్లి గత 3 దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో రైటర్‌గా, కథారచయితలుగా, సంభాషణల రచయితలుగా, నటులుగా, దర్శకులుగా, కవులుగా, నవలా రచయితలుగా మరియు తెలుగు సినిమాల్లో ప్రధానమైన వక్తలుగా రాణించిన జంట రచయిత సోదరులు అయిన పరుచూరి బ్రదర్స్ మన ఊరి వారు అవడం మనమందరం సంతోషించవలసిన విషయమని, వారి తనయుడు రఘుబాబు స్మారకార్థం గత 36 సంవత్సరాలుగా ఈ రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహిస్తూ కళా సేవ చేస్తున్న పరుచూరి బ్రదర్స్‌కి అభినందనలు తెలియజేస్తున్నానని రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

# దేశ అర్థిక, సామాజిక అభివృద్ధికి జనగణనే బలమైన పునాది

**●మే 1 నుండి మే 31 వరకు జనగణన ప్రక్రియ కొనసాగుతుంది**

**●ప్రజలందరూ జనగణనను విజయవంతం చేయాలి : యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): దేశాభివృద్ధిలో కీలకమైన జనగణన ప్రక్రియకు ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కోరారు. జనగణన 2027లో భాగంగా ప్రభుత్వం కల్పించిన స్వీయ నమోదు అవకాశాన్ని ఆయన స్వయంగా వినియోగించుకున్నారు. విజయవాడ ఎమ్మెల్యే కార్యాలయంలో తహసీల్దార్ శివయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తన కుటుంబ వివరాలను జనగణన పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వీయ నమోదు ప్రక్రియలోని ప్రాముఖ్యతను, వివరాలను నమోదు చేసే విధానాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం సత్కరించి, సెన్సెస్ మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జనగణన అనేది కేవలం జనాభా లెక్కల సేకరణ మాత్రమే కాదని, రాబోయే కాలానికి దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడానికి ఇది ఒక బలమైన పునాది అని అన్నారు. మే1 నుండి ప్రారంభమై మే 31వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వ అధికారులు, ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికీ వచ్చి వివరాలను సేకరిస్తారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించే అధికారులకు ప్రజలు ఎటువంటి భయం, సంకోచం లేకుండా సరైన సమాచారాన్ని అందించి, ఈ జాతీయ కార్యసాధనలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గన్నవరం నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ చొరవ చూపాలని ఆయన పిలుపునిచ్చారు.

# హజ్ యాత్రికుల భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యత

**●హజ్ యాత్ర ఏర్పాట్లపై పెమ్మసాని సమీక్ష**



గుంటూరు (చైతన్యరథం): విజయవాడ విమానాశ్రయంలో హజ్‌కు వెళ్లే ప్రయాణికుల ఏర్పాట్లపై కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వివరాలు వెల్లడించారు. గుంటూరు – పొన్నూరు రోడ్డులో ఉన్న M Conventionలో జరిగిన ఈ సమావేశంలో గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి ఎంపీ పెమ్మసాని గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హజ్ యాత్ర ప్రతి ముస్లిం భక్తుడి జీవితంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్ర అన్నారు. హజ్ యాత్రికుల భద్రత, సౌకర్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. హజ్ – 2026 కోసం విజయవాడను ఎంబార్కేషన్ పాయింట్‌గా ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్ళే యాత్రికులకు పెద్ద ఎత్తున ప్రయాణ సౌలభ్యం కల్పించామని తెలిపారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించే ప్రతి యాత్రికుడికి రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వం కట్టుబాటును ప్రతిబింబిస్తుందని చెప్పారు. విజయవాడ నుంచి మదీనాకు నేరుగా చార్టర్ విమాన సర్వీసులు విజయవంతంగా నిర్వహించబడుతూనట్లు తెలిపారు. గన్నవరం హజ్ శిబిరంలో రిజిస్ట్రేషన్, వసతి, భోజనం, త్రాగునీరు, ప్రార్థన స్థలాలు, పారిశుధ్య సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. యాత్రికుల రవాణా కోసం ప్రత్యేక బస్సుల సదుపాయాలు కల్పించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

# చిన్నారుల్లో భక్తితో పాటు ధైర్యసాహసాలు పెంపొందాలి

గుంటూరు (చైతన్యరథం): చిన్నారుల్లో భక్తితో పాటు ధైర్యసాహసాలు పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం గుంటూరులోని సెయింట్ మాథ్యూస్ నార్త్ పారిస్ చర్చిలో నిర్వహించిన వెకేషన్ బైబిల్ స్కూల్ కార్యక్రమానికి మాధవి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు బహుమతులు అందజేశారు. తొలుత "సిగ్నెట్‌రింగ్" థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పాటలు, బైబిల్ బోధనలు, వేదిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. పారిష్ పాస్టర్ ఎస్.జోహన్ బాబురావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జొన్నలగడ్డ ఉదయ భాను ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను అభినందించారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని, చదువుతో పాటు మంచి విలువలు, భక్తి, ధైర్యసాహసాలు కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# పేదల ఇళ్లల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**● నకరికల్లు గ్రామంలో ఉచిత పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ**



సత్తెనపల్లి (చైతన్యరథం): పేదల ఇళ్లల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. గురువారం నకరికల్లు మండలం నకరికల్లు గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత పీఎం సూర్య ఘర్ పథకం మరియు ఎల్‌డబ్ల్యూఈ నూతన ట్రాన్స్ఫార్మర్స్ త్రీఫేస్ లైన్లు ప్రారంభించారు. నకరికల్లు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "పీఎం సూర్య ఘర్" పథకాన్ని కన్నా లక్ష్మీనారాయణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి రూ. 1200 కోట్లు ఖర్చు చేస్తున్నాయని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా వారి ఇంటి పైనే ఏర్పాటు చేసి అక్కడే విద్యుత్ ఉత్పత్తి అయ్యేవిధంగా చర్య తీసుకుంటున్నామన్నారు. దీని ద్వారా వారికి విద్యుత్తు లభించడంతోపాటు భవిష్యత్తులో దాన్ని అమ్ముకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. అదేవిధంగా బీసీలు, ఓసీలకు సైతం సబ్సిడీపై ఈ పథకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ పథకం కింద కోటి మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయన్నారు. లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులుగా చేర్చి వారికి విడతల వారీగా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం ప్రతి పేద కుటుంబానికి ఉచిత విద్యుత్ అందించడం. ఈ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా లభిస్తుంది. " విద్యుత్ కోతలు, భారీ బిల్లుల నుంచి ఎస్సీ, ఎస్టీ సోదరులకు శాశ్వత విముక్తి కల్పించడమే లక్ష్యం" అని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న విద్యుత్ శాఖ అధికారులు లబ్ధిదారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు రాష్ట్రంపై ఉండాలి : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గంలో వత్సవాయి మండలం, మక్కపేట, చిల్లకల్లు గ్రామాల మధ్య మూడు ఎనెల వద్ద వెలసిన స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దైవ ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేసి, స్వామివారి ఆశీస్సులు అందించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జగ్గయ్యపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. అనంతరం అన్న ప్రసాద విత్తరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక భరోసా

**●ఆరుగురికి రూ.5.07 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**



మైలవరం (చైతన్యరథం): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రీ ఎంబర్స్‌మెంట్ చెక్కులను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... విజయవాడ రూరల్ మండలంలోని 6 గురు లబ్ధిదారులకు రూ. 5,07,449లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని 12 మందికి తాజాగా రూ. 5,88,658ల రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైనట్లు తెలిపారు. అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులలో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ సాయం ఆర్థిక చేయుతనిస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా, ఎంతో పారదర్శకంగా సీఎంఆర్‌ఎఫ్ సాయాన్ని మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**●గ్రామస్థులతో మమేకమై వైద్య సేవలపై ఆరా... శంకర్ ఐ హాస్పిటల్ సేవలకు ప్రశంసలు**



నందిగామ (చైతన్యరథం): నందిగామ మండలం కమ్మవారిపాలెం గ్రామంలో గురువారం నాడు ఆర్.సి.యం చర్చి ఆవరణలో శంకర్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య శిబిరంలో చికిత్స పొందుతున్న గ్రామస్థులను పలకరిస్తూ, వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి నిపుణులైన వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, అవసరమైన వారికి మెరుగైన చికిత్స అందేలా అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరులో తొలిసారిగా టీడీపీ మహానాడు

## విజయవంతానికి కోటంరెడ్డి సోదరుల పకడ్బందీ ప్రణాళిక



నెల్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు వేదికను చివరి నిమిషంలో మార్పు చేశారు. నెల్లూరుకు వేదికను మారుస్తున్నట్లు పార్టీ అధిష్టానం నుంచి సమాచారం అందిన వెంటనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పగడ్బందీ ప్రణాళిక రచించారు. మహానాడు ఏర్పాట్లను వారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో మొట్టమొదటిసారిగా మహానాడు ను నిర్వహిస్తుండడంతో మహానాడుకు వచ్చే అతిధులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా జిల్లా కేంద్రంలోని 90 శాతం హోటల్స్, గెస్ట్ హౌస్ లు, మండపాలను వారు క్షణాలలో బుక్ చేశారు. ప్రతి ఒక్క హోటల్ యజమానికి ఫోన్ చేసి ఈనెల 20 నుంచి 30 వరకు జిల్లా కేంద్రంలో 90 శాతం హోటల్స్ రూములు కోటంరెడ్డి సోదరులు ముందుగానే రిజర్వ్ చేయించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు, నేషనల్ మీడియా రాష్ట్ర మీడియా నెల్లూరుకి రానున్న నేపథ్యంలో వారికి అతిథి మర్యాదల్లో ఎటువంటి లోటుపాట్లు ఏర్పడకుండా ఉండేందుకు ముందుగానే ఏర్పాట్లలో జాగ్రత్త పడ్డారు

### జిల్లా కేంద్రంలో హోర్డింగ్స్ బుకింగ్

నెల్లూరు జిల్లా కేంద్రంలో మొత్తం హోల్డింగ్స్ కోటంరెడ్డి సోదరులు బుక్ చేసారు. మహానాడుకు సంబంధించిన భారీ ఫ్లెక్సీలు , హోర్డింగ్స్ ను వారు ఏర్పాటు చేయనున్నారు. పబ్లిసిటీ ఏమాత్రం తగ్గకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. గతంలో నెల్లూరు రూరల్ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ పర్యటనను వేలాది మందితో దిగ్విజయంగా కోటంరెడ్డి సోదరులు నిర్వహించారు. దానిని మించి మహానాడు ను విజయవంతం చేయాలన్న లక్ష్యంతో వారు పనిచేస్తున్నారు.

### అన్ని సాధారణ కార్యక్రమాలు రద్దు

ప్రతిష్టాత్మకంగా నెల్లూరు జిల్లాలో మహానాడు జరగనున్న నేపథ్యంలో కోటంరెడ్డి సోదరులు కీలక బాధ్యతగా క్రియాశీలకంగా వ్యవహరిస్తూ రోజువారీ అన్ని సాధారణ కార్యక్రమాలను రద్దు చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రూరల్ నియోజకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించి అందుకు అనుగుణంగా సూచనలు జారీ చేశారు. పూర్తిస్థాయిలో మహానాడు ఏర్పాట్లు పైనే వారు దృష్టి సారించారు. మహానాడు వేదిక నెల్లూరు రూరల్ లేదా కోవూరులో ఖరారు కానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



# సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య రక్ష

## చెక్కులు అందజేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి

కోవూరు (చైతన్యరథం): సీఎంఆర్ఎఫ్ నిధులతో రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని వీపీఆర్ క్యాంపు కార్యాలయంలో 68 మంది లబ్ధిదారులకు 69 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఇందులో ఎంపీ పరిధిలో 7 మందికి 5 లక్షలు, ఎమ్మెల్యే పరిధిలో 61 మందికి 64 లక్షలు అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే పరిధిలో ఇప్పటివరకు దాదాపు 10 కోట్ల విలువైన చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయల సీఎంఆర్ఎఫ్ నిధులు ఇస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చంద్రబాబు నాయుడు లాంటి మానవతావాది ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టంగా అభివర్ణించారు. పేద కుటుంబాలలో ఎవరికైనా పెద్ద జబ్బు చేసి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతే నేనున్నానంటూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారని చెప్పారు. 23 నెలల కాలంలోనే కోవూరు నియోజకవర్గంలో 804 మంది బాధితులకు 8.47 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందచేశామన్నారు. పేదల గుండెల్లో ధైర్యాన్ని నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియచేసారు.





# ఘనంగా తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలు

తిరుమల (చైతన్యరథం): శ్రీ వేంకటేశ్వరస్వామికి అపర భక్తురాలైన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 296వ జయంతి ఉత్సవం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో ఉన్న పద్మావతి పరిణయ మండపంలో గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా శ్రీవారు ఉభయదేవేరులతో కలిసి తిరుమల మాడవీధుల గుండా ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనాల్లోని పద్మావతి పరిణయ మండపానికి చేరుకున్నారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల కళాకారులు గోష్టిగానం నిర్వహించారు. ఇందులో వెంగమాంబ రచించిన వివిధ సంకీర్తనలను కళాకారులు ఆలపించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్(చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్, ఏసీ కూరగాయల మార్కెట్‌లో 2 కోట్ల 92 లక్షల రూపాయలతో నిర్మించిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పండ్ల మార్కెట్‌ను ఏఎంసీ ఛైర్మెన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. గత అనేక సంవత్సరాలుగా పరిష్కారానికీ నోచుకోని పండ్ల మార్కెట్ ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పండ్లమార్కెట్‌ను నిర్మించామని ఆయన చెప్పారు. పండ్ల మార్కెట్ సమస్య పరిష్కారం అయిన తరువాత పార్టీలకు అతీతంగా వారు తనపై చూపిన ప్రేమను ఎన్నడూ మర్చిపోలేనన్నారు. పార్టీలకు అతీతంగా పండ్ల మార్కెట్ వ్యాపారస్థులు వచ్చి నా పేరు పెడతామని పదేపదే నా పై ఒత్తిడి చేసిన తరువాత వారి ప్రేమాభిమానాలు చూసి అంగీకరించానన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలపక్షాన నిలబడి పోరాటం చేశామన్నారు. పై కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మెన్ రాపూరు చంద్రశేఖర్, డైరెక్టర్లు భీమతాటి సుధాకర్, శివ కుమార్, ముక్కం సాయి లక్ష్మణ్, తుళ్లూరు బాబు, గునుకుల విజయలక్ష్మి, కుప్పా ప్రసన్న, కుల్లూరు శైలజ, నెల్లూరు టౌన్ ఫ్రూట్స్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, నెల్లూరు వెల్ఫేర్ ఫ్రూట్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# రాయలవారి కోటకు పూర్వవైభవం!



## చంద్రగిరి కోటను చక్కదిద్దాలి

చంద్రగిరి (చైతన్యరథం): అస్తవ్యస్తంగా తయారవుతున్న రాయలవారి కోటలో పర్యాటకరంగారికి పూర్వవైభవం సంతరించుకోవాల్సి ఉంది. శ్రీవారి భక్తులతోపాటు దేశవిదేశాల నుంచి పర్యాటకప్రియులు ఇక్కడికి తరలివస్తున్నా తీరని నిరాశతో వెళు న్నారు. ఇక్కడి రాజమహల్, రాణీమహల్, కోట, మ్యూజియం, దుర్గంకొండ, పుష్కరిణి, కోట ప్రాం గణంలోని ఉద్యానవనం, పురాతన దేవాలయాలను మరింత తీర్చిదిద్ది పర్యాటక ప్రియులను ఆకట్టుకోవాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటకు పూర్వవైభవం తీసుకువస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాల్సి ఉంది.



## నేడు శ్రీ గోవిందరాజస్వామి పొన్నకాల్వ ఉత్సవం

తిరుపతి (చైతన్యరథం): చిత్రా పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారంగోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం జరుగనుంది. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం నుంచి ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు, ఆండాళ్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి, చక్రత్తాళ్వార్ తదితర దేవేరులు ఊరేగింపుగా బయలుదేరి తనపల్లి రోడ్డులోని పొన్నకాల్వ మండపానికి చేరుకుంటారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం వాహన మండపంలో సేవాకాలం, శాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 5 గంటలకు స్వామివారు తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. శ్రీ గోవిందరాజస్వామి వారు వచ్చే సమయంలో అమ్మవారి ఆలయంలో ఒక తలుపు మూసి ఉంచుతారు. బావగారైన శ్రీ గోవిందరాజస్వామి వారు వచ్చారని శ్రీ పద్మావతీ అమ్మవారు లోపల నుంచి ఆసక్తిగా తొంగి చూస్తారని, అందుకే ఆలయం ఒక తలుపు మూసి ఉంచుతారని పురాణాల ద్వారా తెలుస్తోంది. అక్కడి నుంచి స్వామివారు తిరిగి ఊరేగింపుగా బయలుదేరి రాత్రి 9.30 గంటలకు శ్రీ గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకుంటారు. దీంతో ఉత్సవం ముగుస్తుంది.

## రాయదుర్గం అభివృద్ధికి సహకరిస్తాం : టీడీపీ ప్రజాప్రతినిధుల హామీ

రాయదుర్గం (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలో పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధుల మంజూరుకు మంత్రుల నుండి స్పష్టమైన హామీ లభించింది. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా ఇటీవల నియోజకవర్గానికి పలువురు మంత్రులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే కాలవ వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినతి మేరకు ఆయా పనులకు సంబంధించిన మంత్రులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నియోజవర్గంలో పలు గ్రామీణ రహదారుల అభివృద్ధి, విస్తరణకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అంగీకరించారు. రాయదుర్గం ఏరియా ఆసుపత్రికి అవసరమైన వైద్య నిపుణులు, ఇతర సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనతో పాటు ఆగిపోయిన భవన నిర్మాణాలు పూర్తి చేయడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సూర్య కుమార్ యాదవ్ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను గొట్టిపాటి రవికుమార్ కు వివరించడంతో ఆయన వెంటనే స్పందించారు. అవసరమైన వ్యవసాయ విద్యుత్ సర్వీసులతో పాటు ట్రాన్స్ ఫార్మర్లు, మూడు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల మంజూరుకు హామీ ఇచ్చారు. అట్లాగే రాయదుర్గం నియోజకవర్గాన్ని టెక్స్ టైల్ హబ్బుగా మార్చడంతో పాటు టెంపుల్ టూరిజం సర్క్యూట్ గా ఏర్పాటు చేయడానికి మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నీటిపారుదల రంగానికి ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తికి శాప్ ఛైర్మన్ రవికుమార్ కాలవ ఫౌండేషన్ ఛైర్మన్ కాలవకు హామీ ఇచ్చారు.

## అంతర్జాతీయ క్రీడాకారిణి శైలజకు సత్కారం

### పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



కదిరి (చైతన్యరథం): శ్రీలంక దేశంలోని కొలంబోలో ఈనెల 24 నుండి 28వ తేదీ వరకు జరిగిన దక్షిణ ఆసియా గోల్ షాఫ్ట్ బాల్ పోటీల్లో భారత్ జట్టు ఘన విజయం సాధించిన భారత జట్టు తరుపున కదిరి క్రీడాకారిణి శైలజ పాల్గొని మంచి ప్రతిభ కనబరిచింది. విజయం సాధించి తిరిగి స్వగ్రామానికి విచ్చేసిన శైలజకు గురువారం కదిరి ఎమ్మెల్యే కార్యాలయంలో కందికుంట వెంకటప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి ప్రాంతానికి చెందిన శైలజ గోల్ షాట్ బాల్ భారత జట్టుకు ఎంపికై, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని విజయం సాధించడం గర్వకారణమన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడగా శైలజ నాలుగు గోల్స్ చేసి విజయాన్ని సునాయాసం చేసిందని పేర్కొన్నారు. భవిష్యత్తు లో శైలజ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. శైలజ అభినందనలు తెలియజేసి మెడల్‌తో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సత్కరించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసి సత్కరించారు.



పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసి సత్కరించిన కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్



## టీడీపీలో 25 కుటుంబాలు చేరిక

కదిరి (చైతన్యరథం): శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తనకల్లు మండలంలోని బూత్ నెంబర్లు 237, 242లకు చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ కదిరి మండల కన్వీనర్ పొట్లిరెడ్డి శేఖర్‌రెడ్డి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.










# తెలుగు సంస్కృతికి నీరాజనం

## 'క్యాట్స్' ఆధ్వర్యంలో అంబరాన్నంటిన ఉగాది వేడుకలు

**మేరీల్యాండ్:** క్యాపిటల్ ఏరియా తెలుగు సొసైటీ (క్యాట్స్) ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది మహోత్సవాన్ని మేరీల్యాండ్‌లోని గైథర్స్‌బర్గ్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల సోయగాన్ని తెలియజేసేలా వేడుక సాగింది. క్యాపిటల్ ఏరియా తెలుగు సొసైటీ సంస్థ అధ్యక్షుడు పార్థ బైరెడ్డి నాయకత్వంలో నిర్వహించిన ఈ మహోత్సవం అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్యాపిటల్ ఏరియా తెలుగు సొసైటీ మరింత విస్తరించడంలో భాగంగా సాంస్కృతిక, సేవా కార్యక్రమాలతో పాటు యువతకు, వ్యాపార రంగానికి ఉపయోగపడే కొత్త కార్యక్రమాలను, ముఖ్యంగా బిజినెస్‌కు సంబంధించిన కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

'క్యాట్స్' వైస్ ప్రెసిడెంట్ రమణ సమన్వయంతో కార్యక్రమం సజావుగా కొనసాగింది. జనరల్ సెక్రటరీ రంగస్వామిరెడ్డి సూరా, కల్చరల్ సెక్రటరీ శిరీషా కొల్ల, ట్రెజరర్ లక్ష్మీకాంత్ గొట్టం, చారిటీస్ & కమ్యూనిటీ అఫైర్స్ ఇన్‌చార్జ్ మహేష్ అనంతోజ్ తదితర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వారి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి కార్యక్రమ విజయానికి దోహదపడ్డారు. 'క్యాట్స్ ట్రస్టీలు బొమ్మా రెడ్డి, రామ ఎరుబండి, సుదర్శన్ దేవిరెడ్డి తమ అనుభవంతో మార్గదర్శకత్వం అందించగా వ్యవస్థాపకుడు రామ్ మోహన్ కొండ సంస్థ అభివృద్ధిని కొనియాడారు. సలహాదారుల మార్గనిర్దేశం కూడా కార్యక్రమానికి బలంగా నిలిచింది.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన లెఫ్టినెంట్ గవర్నర్ అరుణ మిల్లర్ అనివార్య కారణాల వల్ల రాలేకపోయినా... ఆమె పంపిన శుభాకాంక్షల సందేశం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే సంస్థకు గౌరవంగా ఆమె అందించిన అధికారిక సైటేషన్‌ను నిర్వాహకులు కృతజ్ఞతాభివందనాలతో స్వీకరించారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ సంగీత ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. గాయని అఖిల మామందూర్, గాయకుడు శ్రీకాంత్ లంక తమ గాత్రంతో సభను ఉత్సాహభరితంగా మార్చారు. చిన్నారుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అగ్ని డాన్స్ స్కూల్ వారి డ్రమాటిక్ డాన్స్ ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

మానవతా సేవలో విశిష్ట సేవలందిస్తున్న మోహన్ నన్నపనేని, సామ్ వానుములను ప్రత్యేకంగా సత్కరించడంతో పాటు సంస్థ గత అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వంటి సంప్రదాయ అంశాలు వేడుకలకు ప్రత్యేక శోభ చేకూర్చగా రుచికరమైన విందు హాజరైన వారిని ఆకట్టుకుంది.






## మే 3న ఎడిసన్‌లో 'మటా' ఆధ్వర్యంలో

# ఉచిత వైద్య శిబిరం

**ఎడిసన్:** మన అమెరికా తెలుగు సంఘం (MATA) సేవా కార్యక్రమాల్లో భాగంగా న్యూజెర్సీలోని ఎడిసన్ నగరంలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహిస్తోంది. ఇది మే 3వ తేదీ ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థానిక 'సాయి దత్త పీఠం' (1665 Oak Tree Rd, Edison, NJ)లో జరుగుతుంది. కేవలం మే నెలలోనే కాకుండా జూన్ 7, జూలై 12, ఆగస్టు 2, సెప్టెంబరు 6, అక్టోబరు 4, నవంబరు 1, డిసెంబరు 6 తేదీల్లో కూడా ఈ ఉచిత శిబిరాలు నిర్వహించనున్నారు.




అందుబాటులో ఉన్న వైద్య సేవలు...

ఈ శిబిరంలో పాల్గొనే వారికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా అందించనున్నారు..

ఆరోగ్య సంప్రదింపులు (Health Consultation), ఫిజికల్ థెరపీ ఎవాల్యుయేషన్.

బీపీ, బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్, BMI పరీక్షలు.

మెంటల్ హెల్త్ స్క్రీనింగ్, ఫ్లూ వ్యాక్సిన్లు

CPR శిక్షణ, విద్యార్థుల కోసం BS/MD అవేర్నెస్ ప్రోగ్రామ్.

నిర్వాహకులు, సహకారం: ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి MATA బృందం సమన్వయంతో పని చేస్తోంది. కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్‌గా కళ్యాణి బెల్లంకొండ వ్యవహరిస్తుండగా పురుషోత్తం అనిమెల, ప్రసూన కనకపల్లి, శ్రీజ నందకుమార్, లక్ష్మి పసుమర్తి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ శిబిరానికి డాక్టర్ శాంతి ఒప్పనపల్లి, డాక్టర్ రాజ్ కతరా, డాక్టర్ సంధ్య చినాల, డాక్టర్ సుమన్ కతరా, డాక్టర్ విమ్లేష్ అన్నిశెట్టి, డాక్టర్ మాధవి కొల్ల వంటి వైద్య నిపుణులు తమ మద్దతు అందిస్తున్నారు. అలాగే సంతోష్ దోనేపూడి, ధ్రువన్ రెడ్డి యూత్ కో-ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తూ CPR శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.

స్థానిక తెలుగు వారందరూ ఈ ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు లేదా రిజిస్ట్రేషన్ సంబంధిత సమాచారం కోసం కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ కళ్యాణి బెల్లంకొండను 732-647-8716 నెంబరులో సంప్రదించవచ్చు.

## 'తుడా' చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డికి

# కువైట్ ఎన్ఆర్ఐ టీడీపీ ఘన సన్మానం

### మే 22న 'మినీ మహానాడు'కు ఆహ్వానం

**తిరుపతి (చైతన్యరథం):** తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన 'తుడా' చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డిని ప్రవాసాంధ్ర తెలుగుదేశం కువైట్ అధ్యక్షుడు ములకల సుబ్బరాయుడు నాయుడు, మాజీ వైస్ ప్రెసిడెంట్ పిడికిటి శ్రీనివాస్ చౌదరి గురువారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ ఆధ్వర్యంలో మే 22న జరగబోయే "మినీ మహానాడు"కు ఆహ్వానించారు. అనంతరం కువైట్‌లో ఎన్ఆర్ఐల తరఫున ఎదురవు తున్న కొన్ని చిన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన సదుపాయాలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దీనికి స్పందించిన డాలర్ దివాకర్ రెడ్డి 'మీకు ఏ సహాయం కావాలన్నా నేను ఎప్పుడూ అండగా ఉంటాను" అని హామీ ఇచ్చారు.



## ఆరోగ్యకరమైన పనితీరుకు

# 'ఎర్గోనామిక్స్' కీలకం

### 'నాట్స్' వెబినార్‌లో ప్రముఖ ఎర్గోనామిక్స్ నిపుణుడు మను నెల్లుట్ల

**యూఎస్ఏ:** ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో... ముఖ్యంగా ఐటీ, ఇతర కార్యాలయాల్లో గంటల తరబడి కూర్చుని పనిచేసే వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య శారీరక నొప్పులు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 'ఎర్గోనామిక్స్ ఎట్ హోమ్ అండ్ వర్క్' అంశంపై ఒక ప్రత్యేక అవగాహన సదస్సును ఆన్‌లైన్ వేదికగా నిర్వహించింది. ఇల్లు, కార్యాలయాల్లో సరైన పనితీరు, కూర్చునే విధానంపై ప్రముఖ వైద్య నిపుణులు, ఎర్గోనామిస్ట్ మను నెల్లుట్ల పలు కీలక సూచనలు చేశారు.

కార్యాలయంలో లేదా ఇంట్లో ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ముందు కూర్చునేటప్పుడు వెన్నెముక, మెడ, చేతుల అమరిక ఎలా ఉండాలనే దానిపై చర్చ సాగింది. ముఖ్యంగా 90-90-90 నియమాన్ని మను సూచించారు. అంటే మోకాళ్లు, నడుము, మోచేతులు 90 డిగ్రీల కోణంలో ఉండటం పాటించడం ద్వారా దీర్ఘకాలిక నొప్పుల నుంచి బయటపడవచ్చని మను నెల్లుట్ల వివరించారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వారు సోఫాలు లేదా మంచాలపై కూర్చుని పనిచేయడం వల్ల వెన్నెముక సమస్యలు వస్తున్నాయని మను నెల్లుట్ల తెలిపారు. ఈ సమయాల్లో కచ్చితంగా ఎర్గోనామిక్ కుర్చీని లేదా సరైన ఎత్తు ఉన్న టేబుల్ వాడాలని సూచించారు. కంప్యూటర్ స్క్రీన్ కళ్ళకు సమాంతరంగా ఉండటం వల్ల మెడపై ఒత్తిడి తగ్గుతుందని వివరించారు. ప్రతి 30 నిమిషాలకు ఒకసారి సీటు నుంచి లేచి స్ట్రెచింగ్ చేయడం, కళ్లకు విశ్రాంతి ఇవ్వడం వంటి చిన్న చిన్న మార్పులు పని సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఒత్తిడిని కూడా తగ్గిస్తాయని మను సూచించారు. లైవ్ డెమో ద్వారా సరైన పోశ్చర్ గురించి వివరించి, నెటిజన్లు అడిగిన పలు సందేహాలను మను నివృత్తి చేశారు.

ఈ వెబినార్‌కు ముందు 'నాట్స్' అధ్యక్షుడు శ్రీహరి మందాడి 'నాట్స్' చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమానికి అనుసంధానకర్తగా నాట్స్ కార్యనిర్వాహక కార్యదర్శి (మీడియా) మురళీకృష్ణ మేడిచెర్ల వ్యవహరించారు. ఆన్‌లైన్ ద్వారా ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన నాట్స్ నాయకులను నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల అభినందించారు.

తెలుగు వారు ఎక్కడ ఉన్నా వారి ఆరోగ్యం, సంక్షేమం కోసం ఇలాంటి విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల నాట్స్ కార్యవర్గానికి నాట్స్ సభ్యులు, తెలుగు వారు కృతజ్ఞతలు తెలిపారు.



# ఈ ఎన్నికల్లో ఎన్డీఏదే విజయం



విశ్వనాథుని సన్నిధిలో త్రిశూలం, ఢమరుకంతో ప్రధాని మోదీ

ఎన్నికలు జరిగిన నాలుగు రాష్ట్రాల (కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్) అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని ఎన్డీయే విజయం సాధిస్తుందని. ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఎన్నికల్లో కూడా నెగ్గుతామని అన్నారు. ఉత్తర్ ప్రదేశ్లోని మేరక్, ప్రయాగ్రాజ్లను కలుపుతూ నిర్మించిన 504 కిలోమీటర్ల గంగా ఎక్స్ప్రెస్వేను బుధవారం ప్రారంభించిన అనంతరం ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్లో ఈసారి ఓటర్లు భయరహిత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అంతకుముందు మోదీ వారణాసిలో రోడ్ షో నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగిన ఈ రోడ్ షో కాశీ విశ్వనాథ ఆలయం వద్ద ముగిసింది. ఆలయంలో వేద మంత్రాల నడుమ ప్రధాని ప్రార్థనలు జరిపారు.

# మలి విడతలోనూ కందంతొక్కిన ఓటర్లు

## పశ్చిమబెంగాల్లో రికార్డు స్థాయి పోలింగ్



పశ్చిమ బెంగాల్ ఓటర్లు మలి విడతలోనూ కదం తొక్కారు. నువ్వా, నేనా అన్నట్లు సాగుతున్న శాసనసభ ఎన్నికల సమరంలో మలిదశలో 142 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగ్గా బుధవారం 92.48 శాతం మంది ఓట్లు వేశారు. తొలిదశలో 109.19 మంది ఓటుహక్కు వినియోగించుకోగా రెండింటి సగటు 92.84 శాతం అవుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక బెంగాల్లో ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి. సర్వీసు ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్లను దీనిలో కలపలేదు. రాత్రి కూడా కొన్ని వేలమంది క్యూల్లో నిల్చొని ఉన్నారు. అందువల్ల తుది గణాంకాల్లో పోలింగ్ శాతం ఇంకాస్త పెరిగే అవకాశం ఉంది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 94.72 శాతం పోలింగే ఇంతవరకు రికార్డుగా ఉండేదని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో మహిళా ఓటర్లలో 92.28శాతం మంది, పురుషుల్లో 91.07 శాతం మంది పాల్గొన్నారు. గతసారి నంది గ్రామ్లో లో ముఖాముఖి తలపడిన ముఖ్యమంత్రి మమత, విపక్ష నేత సువేందు అధికారి ఈసారి భవానీపుర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అక్కడ గతసారి 61శాతం పోలింగ్ జరగగా ఈసారి 87 శాతానికి పెరిగింది. అస్సాం తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలతో కలిపి బెంగాల్లోనూ ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టనున్నారు. ఉదయం నుంచే బెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరి కనిపించారు. హింసాత్మక ఘటనలు లేకపోయినా, పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసులు లాఠీలకు పనిచెప్పాల్సి వచ్చింది. ఈవీఎంలపై టేపులు అంటించడం, ఇంకుమరకలు వేయడం వంటి ఆరోపణలు వచ్చినచోట అధికారుల నివేదికలు ఆధారంగా అవసరమైతే రీపోలింగ్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ అగర్వాల్ ప్రకటించారు.



# అత్యాచార బాధితుల కోసం చట్టాలను సవరించాలి

## ఎయిమ్స్ సలహా మేరకు సుప్రీం కోర్టు సూచన

పదిహేనేళ్ల ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో గురువారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో 30 వారాల గర్భవిచ్ఛిత్తికి బాలికకు ఇటీవల అత్యున్నత న్యాయస్థానం అనుమతిచ్చింది. అయితే దీనిపై ఎయిమ్స్ క్యూరేటివ్ పిటిషన్ వేసింది. ఈ దశలో గర్భాన్ని తొలగిస్తే.. ఆ బాలిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం సూచనలు చేసింది. అత్యాచార బాధితుల కోసం చట్టాలను సవరించాలని సూచించింది. బాలికను బలవంతం చేయలేమని ఇటీవల ఈ కేసులో సుప్రీంకోర్టు ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ఒక మహిళ మరీ ముఖ్యంగా ఒక ఒక బాలికను బలవంతం చేయలేమని సుప్రీం కోర్టు పేర్కొంది. అలాగే గర్భాన్ని తొలగించేందుకు అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఎయిమ్స్ సుప్రీంలో పిటిషన్ వేసింది. “ఎంతో ఆవేదనతో ఈ క్యూరేటివ్ పిటిషన్ ను తీసుకువస్తున్నాం.. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదు ఆ మైనర్ తల్లి ఆరోగ్యంపై సుదీర్ఘకాలంలో తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇక్కడొక అవకాశం ఉంది. డెలివరికి ఇంకా నాలుగు వారాలే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించొచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే” అని ఎయిమ్స్ తరపున ఆడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటయా కోర్టుకు వెల్లడించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ... “బాలికపై అత్యాచారం జరిగిన కేసు ఇది. ఆ ఘటన తాలూకు క్షోభ ఆమెను జీవితాంతం వెంటాడుతుంది. ఆమె ఎంత బాధపడి ఉంటుందో ఊహించుకోండి. ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భవిచ్ఛిత్తిని నిర్వహించాలి. ఈ ఆరోగ్య సమస్యల విషయంలో బాధితురాలి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వారు తగిన నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలి. అందుకే ఈ విషయంలో నిర్ణయాన్ని బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నాం” అని పేర్కొంది. అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని ఈసందర్భంగా కేంద్రానికి సూచనలు చేసింది. 20 వారాలు దాటిన తర్వాత కూడా ఈ ఆఅవాంఛిత గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యాచార బాధితులకు అనుమతించేలా చట్టాన్ని సవరించాలని సూచించింది.

# అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రం పాకిస్థాన్

## కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాధ్ సింగ్ వెల్లడి



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా, చేపట్టిన ఆపరేషన్ సిందూర్ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజానాధ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎస్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 20లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్నాథ్ పేర్కొన్నారు. ‘ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ, ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకువెళ్లాయి. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్ను ప్రారంభించి, సరైన సమయంలోనే దాన్ని ముగించాం. ఇది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం’ అని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని పేర్కొన్నారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని, మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్పై రాజ్నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని... దానికి బహుముఖ కోణాలున్నాయన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతిస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

# జమ్మూ వరకూ వందేభారత్ పొడిగింపు

జమ్మూ, శ్రీనగర్ మార్గంలో పరుగులు పెట్టనున్న వందేభారత్ ఎక్స్ ప్రెస్ రైలును రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ప్రారంభించనున్నారు. ఈ నెల రెండవ తేదీ నుంచి నుంచి ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రధాని మోదీ గత ఏడాది కట్రా, శ్రీనగర్ రైలు సర్వీసును ప్రారంభించగా దానిని ఇప్పుడు జమ్మూ తావి వరకు పొడిగించనున్నారు. తద్వారా 8 బోగీలకు బదులుగా 20 కోచ్ల వందేభారత్ అందుబాటులో ఉంటుంది. ఈ సర్వీసుతో రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందడంతోపాటు ఏ వాతావరణంలోనైనా రెండు ప్రధాన పట్టణాల మధ్య ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంటుంది. భౌగోళికంగా ఎంతో కఠినంగా ఉండే మార్గంలో మొత్తం 267 కిలోమీటర్లు ప్రయాణించే ఈ రైలు జమ్మూ నుంచి శ్రీనగరు, మళ్లీ శ్రీనగర్ నుంచి జమ్మూకు నడుస్తుంది. వారంలో మంగళవారం మినహా మిగతా ఆరు రోజులూ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.

# దృఢ సంకల్పానికి మోకరిల్లిన వైకల్యం

## వీల్ చైర్తో ఎవరెస్టు పర్వతారోహణ

దృఢమైన సంకల్పం ఉంటే మరే ఇబ్బందులూ అడ్డంకులు కావని డాక్టర్ రూపిందర్ కౌర్ నిరూపించారు. 65 శాతం పోలియోతో బాధపడుతున్న ఈమె వీల్ చైర్తో ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ బేస్ క్యాంపును చేరుకొని అరుదైన విజయం సాధించారు. లుధియానా ప్రాంతంలో రూపిందర్ కౌర్ ఆయుర్వేద వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. నాలుగు నెలల వయసులోనే ఈమె పోలియో బారిన పడ్డారు. కర్ర సాయంతో నిలబడే స్థితికి చేరుకున్న రూపిందర్కు చిన్ననాటి నుంచే పర్వతారోహణపై అమితమైన ఆసక్తి. ఆ కలను సాకారం చేసుకునేందుకే ఎవరెస్టు సాహసయాత్రకు ఆమె పూనుకొన్నారు. నాలుగు నెలలపాటు ప్రత్యేక శిక్షణ పొంది. చేతులతో నడిపే చక్రాల కుర్చీని తయారు చేయించుకున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, నాలుగు కిలోల బరువు కూడా తగ్గారు. మొత్తం 13 మంది సభ్యులతో కూడిన వీరి బృందంలో ఆరుగురు దివ్యాంగులే. నేపాల్ మార్గం ద్వారా ఎవరెస్ట్ బేస్ క్యాంపునకు చేరుకున్న ప్రయాణంలో అనేక సవాళ్లు ఆమె సంకల్పాన్ని పరీక్షించాయి. అయినా వెనకడుగు వేయకుండా బృంద సభ్యుల సహకారంతో ఈ నెల 21న తన యాత్రను పూర్తి చేశారు.



# ఈసారి అమెరికాకు హార్ట్‌అటాకే!

- **శత్రుబలలపైకి కొత్త ఆయుధం ప్రయోగిస్తాం**
- **ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ**

అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడనున్నట్టు తెలిపారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయపెడుతుందని హెచ్చరించారు. దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హరూజ్‌ను తెరుస్తామంటూ ఇరాన్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించారు. ఈ క్రమంలో ఇరాన్‌నుంచి తాజా హెచ్చరికలు వచ్చాయి. 'అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం. అది వారిని తీవ్రంగా భయపెట్టనుంది. అది వారి పక్కనే ఉంది. దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చు' అని షారమ్ ఇరానీ పేర్కొన్నారు. అయితే, ఆ ఆయుధం ఏంటి అనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. హర్మూజ్‌ను దిగ్బంధించి.. ఇరాన్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి, చర్చలకు తీసుకురావాలనే అమెరికా వ్యూహాన్ని



ఆయన కొట్టిపారేశారు. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై తమ దళాలు దాదాపు ఏడు క్షిపణులతో విరుచుకుపడ్డాయన్నారు. దీంతో అది కొన్ని రోజులు కార్యకలాపాలను నిర్వహించలేకపోయిందన్నారు. అమెరికా దిగ్బంధనం ఉన్నప్పటికీ.. నౌకలు కొన్ని తమ ఓడరేవుల నుంచి వెళ్తున్నాయన్నారు. మరికొన్ని వాటి గమ్యస్థానాలకు కూడా చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈసందర్భంగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బ కొడతామన్నారు.

**అణు ఒప్పందం కుదిరేవరకు..**

ఇరాన్ అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం కొనసాగుతుందని అధ్యక్షుడు ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. దిగ్బంధనాన్ని ఎత్తివేయాలనే ఇరాన్ ప్రతిపాదనపై రాజీపడే ప్రసక్తే లేదని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సైనిక చర్యతో పోలిస్తే.. ఓడరేవులు దిగ్బంధనమే ప్రభావవంతంగా పనిచేస్తోందని, దీంతో టెహ్రాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ తీవ్ర ఒత్తిడిలో ఉందని, చర్చలకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. సంఘర్షణను ముగించాలని వారు కూడా కోరుకుంటున్నట్టు తెలిపారు.

# 'కోహినూర్'ను భారత్‌కు ఇచ్చేయాలి

***మమ్దానీ ఆసక్తికర వ్యాఖ్యలు***

చారిత్రక 'కోహినూర్ వజ్రం' అంశం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. తనకు అవకాశమిస్తే.. ఆ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేయాలని బ్రిటన్ రాజు చార్లెస్ 3ని కోరతానని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ పేర్కొన్నారు. భారతీయ మూలాలున్న మేయర్ తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. బ్రిటన్ రాజు చార్లెస్ 3, రాణి కెమిల్లా ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం న్యూయార్క్‌లోని 9/11 స్మారక చిహ్నాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముందు మమ్దానీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కోహినూర్ అంశాన్ని ప్రస్తావించారు. 'ఒక కార్యక్రమంలో కాకుండా.. రాజు



చార్లెస్–3తో విడిగా మాట్లాడే అవకాశం వస్తే.. కోహినూర్‌ను భారత్‌కు తిరిగి ఇచ్చేయాలని కోరతాను' అని మమ్దానీ అన్నారు. ఆ తర్వాత రాజు చార్లెస్–3, మమ్దానీల మధ్య సంభాషణ జరిగింది. అయితే, వీరి చర్చల్లో కోహినూర్ వజ్రం ప్రస్తావన వచ్చిందా? లేదా అనేది మాత్రం స్పష్టంగా తెలియరాలేదు. కాగా.. భారత్‌కు చెందిన 108 క్యారెట్ల విలువైన కోహినూర్ వజ్రాన్ని 1849లో మహారాజ్ దులీప్ సింగ్.. విక్టోరియా మహారాణికి ఇచ్చేశారు. అప్పటినుంచి ఆ వజ్రం వారి అధీనంలోనే ఉంది. రాణి కిరీటంలో దాన్ని అమర్చారు. దానిని తిరిగి తీసుకోవాలని భారత ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ప్రయత్నించినప్పటికీ.. అది ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

## ఇరాన్ విషయంలో..

# ట్రంప్‌నకు పుతిన్ వార్నింగ్

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్ గట్టి హెచ్చరికలు చేశారు. టెహ్రాన్‌పై మళ్లీ సైనిక చర్యకు దిగితే.. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని పుతిన్ హెచ్చరించినట్టు క్రెమ్లిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఇరుదేశాల నేతలు 90 నిమిషాలకు పైగా ఫోన్లో మాట్లాడుకున్నారు. ఇరాన్ కాల్పుల విరమణ పొడిగించాలన్న ట్రంప్ నిర్ణయాన్ని పుతిన్ స్వాగతించారని ఉషాకోవ్ తెలిపారు. ఈ చర్యతో దౌత్య చర్చలకు మార్గం సుగమమవుతుందని వెల్లడించినట్టు పేర్కొన్నారు. ఒకవేళ అమెరికా–ఇజ్రాయెల్ మరోసారి ఇరాన్‌పై దాడులకు దిగితే.. పశ్చిమాసియాతో సహా మొత్తం అంతర్జాతీయ సమాజం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పుతిన్ హెచ్చరించినట్టు వెల్లడించారు. ఇరాన్‌తో ఉద్రిక్తతలు ముగించేందుకు సాధ్యమయ్యే దౌత్య ప్రయత్నాలకు రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ పునరుద్ఘాటించారన్నారు. ఉక్రెయిన్ సరిహద్దు వెంబడి పరిస్థితులను గురించి ఇరుదేశాల నేతలు చర్చించుకున్నట్లు తెలిపారు.

**ఇరాన్ యురేనియం విషయంలో పుతిన్ సాయం: ట్రంప్**

పుతిన్ సంభాషణలో ఇరాన్‌వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వల



గురించి మాట్లాడుకున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఈ నిల్వలను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ పేర్కొన్నట్టు వెల్లడించారు. అయితే, 'మీరు నాకు సహాయం చేసే ముందు, నేను మీ యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నాను' అని తాను బదులిచ్చినట్టు ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా త్వరలో ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణకు అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. రష్యా అధ్యక్షుడు కొద్ది రోజుల కాల్పుల విరమణను సూచించారని, దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడవచ్చని ట్రంప్ తెలిపారు.

# నేపాల్‌లో ఘోర ప్రమాదం


***- లోయలో జీపుపడి 17మంది దుర్మరణం***



నేపాల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోల్పా జిల్లాలోని పర్వత ప్రాంతంలో ఓ ప్రైవేటు జీపు అదుపుతప్పి 700 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారిలో 17మంది మృతి చెందారు. స్థానికులు జలజాలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. వర్షం కారణంగా బురద ఏర్పడి వాహనం జారిపడిందని పోలీసులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఘటన సమయంలో వాహనంలో ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదని అధికారులు పేర్కొన్నారు.

# అమెరికాకు పాక్ వెన్నుపోటు

**మధ్యవర్తిగా ఉంటూనే ఇరాన్‌కు సాయం?**



*అమెరికా–ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్.. అమెరికాకు వెన్నుపోటు పొడుస్తుందా..? తాజా పరిణామాలు చూస్తుంటే ఔననే అనిపిస్తోందని అమెరికా నిపుణులు అంటున్నారు. ఇరాన్ రవాణాకు అనుకూలంగా ఆరు మార్గాల్ని పాక్ ప్రతిపదించినట్టు సమాచారం. ఒకపక్క హర్మూజ్ జలసంధిని దిగ్బంధించడం ద్వారా ఇరాన్‌పై ఒత్తిడి తేవాలని అమెరికా భావిస్తుంటే.. పాకిస్తాన్ మాత్రం ఇరాన్‌కు సాయం అందిస్తోందని అమెరికాకు చెందిన రక్షణ శాఖ నిపుణుడు డెరెక్ జె గ్రాస్‌మాన్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సంచలన విషయాలు వెల్లడించారు. డెరెక్ తెలిపిన వివరాల ప్రకారం.. హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇరాన్ పోర్టుల్ని కూడా అమెరికా దిగ్బంధంలోకి తీసుకుంటోంది. దీని ద్వారా ఇరాన్ వాణిజ్యాన్ని అడ్డుకుని, ఆర్థికంగా దెబ్బతీయాలనేది అమెరికా ప్లాన్. ఇలా చేస్తే, ఇరాన్ దిగొచ్చి తమతో అణు ఒప్పందం చేసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌నుంచి ఇతర దేశాలకు వాణిజ్యం చాలా వరకు ఆగిపోయింది. కానీ, ఈ విషయంలో ఇరాన్‌కు పాకిస్తాన్ సాయం చేస్తోంది. ఇరాన్ వాణిజ్యం చేసుకునేలా తమ దేశంనుంచి ఆరు ప్రత్యేక భూమార్గాల్ని పాకిస్తాన్ ప్రతిపాదించింది.*

*హోర్ముజ్ జలసంధితో సంబంధం లేకుండా, అమెరికా దళాలకు దొరక్కుండా ఈ రూట్‌లో ఇరాన్ వాణిజ్యం చేయొచ్చు. ఈ మార్గాల ద్వారా రష్యా, చైనా సహా ఇతర దేశాలకు ఇరాన్ చమురు, ఇతర ఉత్పత్తులు ఎగుమతి, దిగుమతులు చేసేందుకు పాకిస్తాన్ సహకరిస్తోంది. ఇప్పటికే మూడు వేల వరకు ట్రక్కులు ఈ రూట్లలో సరుకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. అంటే, ఈ మార్గాల్లో ఇరాన్ వాణిజ్యం మొదలుపెడితే ఆ దేశానికి ఆర్థికంగా పెద్దగా నష్టం ఉండదు. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలనే అమెరికా లక్ష్యం నెరవేరదు.*

*ఇది అమెరికాకు ఒక రకంగా పాకిస్తాన్ వెన్నుపోటు పొడవడమే. ఇరాన్–అమెరికా చర్చల అంశంలో మధ్యవర్తిత్వం వహించే సత్తా పాకిస్తాన్‌కు లేదనేది చాలామంది ఎప్పటినుంచో అభిప్రాయపడుతున్నారు. అటు ఇరాన్, ఇటు ఇజ్రాయెల్ కూడా ఈ విషయంలో పాకిస్తాన్‌పై అనుమానంగానే ఉన్నాయి. పాకిస్తాన్.. ఇరాన్‌కు అనుకూలంగా ఉంటుందని ఇజ్రాయెల్ ఆరోపించింది. తమతో స్నేహంగా ఉంటూనే అమెరికా కోసం పని చేస్తోందని ఇరాన్ ఆరోపించింది. ఈ ఆరోపణలు నిజమని తాజాగా పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయంతో రుజువైంది.*

# అతడి వల్లే మ్యాచ్ గెలిచాం: ప్యాట్ కమిన్స్



హైదరాబాద్: ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగుతోంది. బుధవారం వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. ముంబై నిర్దేశించిన 244 పరుగుల లక్ష్యాన్ని కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 18.4 ఓవర్లలో ఛేదించింది. హైదరాబాద్‌కు ఐపీఎల్‌లో ఇది వందో విజయం కావడం గమనార్హం. మ్యాచ్ అనంతరం ఈ విజయంపై ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించాడు. ఎంతటి భారీ టార్గెట్‌నైనా ఛేదించే సత్తా తమ బ్యాటర్లకు ఉందని తెలిపాడు. 'మా ఓపెనర్ల బ్యాటింగ్ చూస్తుంటే చాలా భయంకరంగా ఉంది. నేను వారికి బౌలింగ్ చేయనందుకు సంతోషంగా ఉంది. ఐదేళ్ల క్రితం 200 పరుగులు ఛేదించడం కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు 240 పరుగులు కూడా సాధ్యమేనని ప్లేయర్లు నిరూపిస్తున్నారు. ఇప్పుడు ఓవర్‌కు 12 పరుగులు చేయాల్సి ఉన్నా, బ్యాటర్లు దానిని సులువుగా ఛేదిస్తున్నారు. కానీ ఇలాంటి మ్యాచ్‌ల్లో ఒక అద్భుతమైన 'యార్కర్' మ్యాచ్ ఫలితాన్ని మార్చేస్తుంది' అని కమిన్స్ వెల్లడించాడు. 'క్లాసెన్ మరోసారి తన సత్తా ఏంటో చూపించాడు. ప్రతీ మ్యాచ్‌లోనూ రాణిస్తున్నా ఇలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మా అదృష్టం. మరోవైపు సలీల్‌కు ఈ సీజన్‌లో ఎక్కువ అవకాశాలు రాలేదు. కానీ ఛాన్స్ దొరికిన ప్రతీ మ్యాచ్‌లోనూ సత్తాచాటుతున్నాడు. అలానే జట్టు విజయాల్లో ఇషాన్ మలింగ కీలక పాత్ర పోషిస్తున్నాడు. మా జట్టులో ఇషాన్ మలింగ వంటి అత్యుత్తమ బౌలర్లు ఉన్నారు. కోచింగ్ స్టాఫ్ యువ ఆటగాళ్లలో భయం లేని ధోరణిని పెంపొందించడం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్' అని కమిన్స్ తెలిపాడు.

# బుమ్రా వైఫల్యం..స్పందించిన పొలార్డ్

ముంబై: టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐపీఎల్ 2026లో తడబడుతున్నాడు. వికెట్లు తీసేందుకు తీవ్రంగా కష్టప డుతున్నాడు. ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచులు ఆడిన అతడు కేవలం రెండే వికెట్లు తీశాడు. ఇలా వికెట్లు తీయలేకపోవడంతో పాటు భారీగా పరుగులు సమర్పించుకోవడం గమనార్హం. సాధారణంగా బుమ్రా పిచ్‌తో సంబంధం లేకుండా పరుగులను నియంత్రించడం లేదా కీలక సమయంలో వికెట్లు తీయడం చేసేవాడు. కానీ, ఈ సీజన్‌లో అలా జరగడం లేదు. దీంతో ముంబై ఇండియన్స్ అభిమానుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బుమ్రా బౌలింగ్ వైఫల్యంపై తాజాగా ముంబై జట్టు కోచ్ కీరన్ పొలార్డ్ స్పందించాడు. తమ జట్టు అతడికి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశాడు. పొలార్డ్ మీడియాతో మాట్లాడుతూ ఎవరైనా ప్లేయర్ సరైన ప్రదర్శన చేయలేకపోతే, వెంటనే ప్రతి చిన్న విషయాన్ని పరిశీలిస్తుంటాం. అతడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. కొన్నేళ్లుగా అతడు ఎలాంటి ప్రదర్శన ఇచ్చాడో మనం చూశాం. అతడు కూడా మనిషే కదా.. బుమ్రా కూడా తప్పులు చేసే అవకాశం ఉంది.

కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపో యాడు. అయినా, ఇప్పటికీ అతడు ప్రపంచంలోనే నంబర్‌వన్ బౌలర్, అలానే మా జట్టుకు కీలక బౌలర్' అని పొలార్డ్ స్పష్టం చేశాడు. అలానే జట్టు ప్రదర్శనపై కూడా పొలార్డ్ కీలక వ్యాఖ్యలు చేశాడు.




'ఈ సీజన్‌లో మా జట్టు నిలకడగా ఆడలేకపోతుంది. ఫలితాలే అందుకు నిదర్శనం. జట్టుగా మేం ఇంకాస్త మెరుగ్గా ఆడాల్సిన అవసరం ఉంది. మ్యాచ్ గెలవాలంటే ఆరంభం నుంచి చివరివరకు ఆధిపత్యం ప్రదర్శించాలి. అలా జరగకపోతే విజయా న్ని అందుకోవడం కష్టం. విజయం కోసం పోరాడాలనే పట్టుదల తోనే మా ప్లేయర్లు ఉంటారు. ప్రస్తుతం మేం కొన్ని మ్యాచులు ఓడిపోయాం. అయినప్పటికీ మేం ఇంకా టోర్నీలోనే ఉన్నాం. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇంకా బయటకు వెళ్లలేదు. మాకూ అవకాశాలు ఉన్నాయి' అని పొలార్డ్ స్పష్టం చేశాడు.

## కొఠారిదే ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్




*కార్లో (ఐర్లాండ్): ఐబీఎస్ఎఫ్ వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్ షిప్ టైటిల్‌ను భారత్‌కు చెందిన సౌరవ్ కొఠారి నిలబెట్టుకు న్నాడు. బుధవారం జరిగిన ఏకపక్ష ఫైనల్లో 41 ఏళ్ల సౌరవ్ 1133-477తో 19 సార్లు విజేత, సహచరుడు పంకజ్ అద్వానీ కి షాకిచ్చాడు. గత ఏడాది తుదిపోరులో కూడా పంకజ్‌ను ఓడించే కొఠారి టైటిల్ నెగ్గడం విశేషం.*

# టీజీ20 లోగో ఆవిష్కరణ




హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న టీజీ20 టోర్నమెంట్ లోగోను సినీ నటుడు దగ్గుబాటి వెంకటేష్, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లో క్రికెట్ ప్రముఖుల మధ్య ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. వచ్చే జూన్-జూలైలో 21 రోజుల పాటు ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ లీగ్‌లో 8 జట్లు తలపడనున్నాయి. తెలంగాణ క్రికెట్‌లో ఈ లీగ్ విప్లవాత్మక మార్పులను తీసుకురానుందని బీసీసీఐ కార్యవర్గ సభ్యుడు చాముండేశ్వర్ నాథ్ అన్నారు. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రికెటర్లకు తమ సత్తాను నిరూపించుకునేందుకు ఈ లీగ్ ఒక మంచి వేదికని హెచ్‌సీఏ కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, డీజీపీ సీవీ ఆనంద్, మాజీ క్రికెటర్లు శివ్‌లాల్ యాదవ్, అర్షద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

## ముంబై జట్టుకు మద్దతుగా
### వాంఖడే స్టేడియానికి వినోద్ కాంబ్లీ



ముంబై: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. అయితే కాంబ్లీ నిన్న అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. నడవలేని స్థితిలోనూ ముంబై ఇండియన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌కు హాజరయ్యారు. ఇద్దరు వ్యక్తుల సాయంతో నడుస్తూ వాంఖడే స్టేడియానికి వచ్చారు కాంబ్లీ. ఆయన వచ్చారనే విషయం తెలిసి అభిమానులు, మీడియా ప్రతినిధులు భారీగా గుమిగూడారు. కాంబ్లీకి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మీరు త్వరగా కోలుకోండి సార్' అని అభిమానులు అనడం వీడియో లో వినిపించింది. కాంబ్లీ కూడా అభిమానులను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఇక కాంబ్లీ పరిస్థితి విషమంగా ఉందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలకు ఈ వీడియో చెక్ పెట్టింది. 'వినోద్ ఆరోగ్యం గురించి ఎవరు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారో నాకు తెలియదు. దేవుడి దయవల్ల ఆయన బాగానే ఉన్నారు' అని గతంలో కాంబ్లీ భార్య ఆండ్రియా హెవిట్ తెలిపారు. ఈ నేపథ్యంలో కాంబ్లీ వాంఖడే స్టేడియానికి రావడం తో అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన సహచరుడు సచిన్ టెండూల్కర్ కోసం, ముంబై జట్టుకు మద్దతుగా ఆయన స్టేడియానికి వచ్చారని క్రికెట్ అభిమానులు అంటున్నారు. కాంబ్లీ 1991 నుంచి 2000 వరకు టీమిండియాకు ప్రాతినిధ్యం వహించారు. తన కెరీర్‌లో 17 టెస్టులు, 104 వన్డేలు ఆడారు.

## ఆ రెండు తప్పిదాలే ఓటమికి కారణం: హార్దిక్ పాండ్య



ఐపీఎల్ 2026లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. 244 పరుగుల భారీ లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు కేవలం 18.4 ఓవర్లలోనే అందుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హెన్రిచ్ క్లాసెన్ నిలిచాడు. ఇక ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన హార్దిక్ పాండ్య.. బ్యాటింగ్‌లో రాణించినా.. బౌలింగ్, ఫీల్డింగ్ వైఫల్యం తమ విజయవకాశాలను దెబ్బతీశాయని తెలిపాడు. 'మ్యాచ్‌పై మంచు పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రత్యర్థి బ్యాటర్లు కొన్ని అద్భుతమైన షాట్స్ ఆడారు. దీంతో వారికి మంచి ఆరంభం లభించింది. ఆ తర్వాత మేం తిరిగి పుంజుకున్నాం. కానీ అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. మా బ్యాటింగ్ చాలా మెరుగైంది. 244 పరుగులు మంచి స్కోర్‌ను మా బౌలర్లు డిఫెండ్ చేస్తారని నమ్మాను. కానీ ఈ రోజు మా బౌలింగ్ ప్రణాళికలను సరిగ్గా అమలు చేయలేకపోయాం' అని వెల్లడించాడు. 'ఈ సీజన్‌లో మేం చాలా క్యాచ్‌లు వదిలేస్తున్నాం. మా ఫీల్డింగ్ కారణంగా గెలుపు అవకాశాలు చేజారాయి. క్యాచ్‌లను పట్టుకున్నప్పుడే పరిస్థితి మారుతుంది. క్యాచ్‌లు వదిలేస్తే జట్టుకు నష్టం జరుగుతుంది. మొత్తంగా గెలుపు కోసం మా కుర్రాళ్లంతా బాగా ప్రయత్నించారు. కానీ ఈ రోజు మాకు కలిసి రాలేదు. మా తప్పులను సరి చేసుకొని, తదుపరి మ్యాచులకు సన్నద్ధమవుతాము. ప్రేక్షకుల నుంచి మాకు అద్భుతమైన మద్దతు లభిస్తోంది. కానీ మాకు మద్దతు ఇచ్చేంత గొప్ప ప్రదర్శనను మేం వారికి అందించలేకపోయాం. వారి నమ్మకాన్ని తిరిగి పొందడానికి మేం కృషి చేయాల్సిన అవసరం ఉంది'అని హార్దిక్ పాండ్య చెప్పుకొచ్చాడు.

చైతన్య రథం
# సినిమా
శుక్రవారం 1 మే 2026 X




## ‘ఏక్‌దిన్’కు డిజాస్టర్ ఓపెనింగ్స్

సౌత్ సినిమా దగ్గర తన మొదటి సినిమాతోనే తెలుగు, మలయాళ ఇండస్ట్రీలో స్టార్‌గా మారిన యంగ్ బ్యూటీ సాయి పల్లవి మన దగ్గర వరుస విజయాలు, మినిమమ్ గ్యారెంటీ సినిమాలు చేస్తూ వచ్చింది. ఇక ఇక్కడనుంచి హిందీ మార్కెట్‌లోకి కూడా ఆమె అడుగు పెట్టింది. ఏక్ దిన్ అలాగే రామాయణలాంటి స్పెషల్ ప్రాజెక్ట్‌లతో హిందీ మార్కెట్‌లోకి వెళ్లిన సాయిపల్లవి నుంచి ఆమె నటించిన మొదటి చిత్రం ‘ఏక్ దిన్’ ఇప్పుడు హిందీ సహా తెలుగులో విడుదల కాబోతుంది. అయితే ఈ చిత్రంలో అమీర్‌ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ హీరోగా నటించగా.. నేడు సినిమా విడుదల కాబోతుంది. అయితే ఈ సినిమాకి మాత్రం షాకింగ్ వసూళ్లు వచ్చేలా ఉన్నాయని బాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో టాక్ నడుస్తుంది. ఈ చిత్రానికి కేవలం 10నుంచి 20 లక్షలలోపే నెట్ ఓపెనింగ్స్ వచ్చే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది. మరి ఇదే రీతిలో ఓపెనింగ్స్ వస్తే మాత్రం అది సాయిపల్లవికి డిజాస్టర్ ఓపెనింగ్స్ అనే చెప్పాలి. సినిమాకి ఏమంత పెద్ద బజ్ హిందీలో కనిపించడం లేదు. అమీర్‌లాంటి స్టార్ కొడుకు సినిమా అయినప్పటికీ ఆడియెన్స్‌లో అంత ఆసక్తి రాలేదు. మరి అల్టిమేట్‌గా ఈ సినిమాకి ఎలాంటి ఫలితం దక్కుతుందో చూడాలి.

## కేడీకి డబ్బింగ్ దెబ్బ!




పాన్ ఇండియా ట్యాగ్‌లో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధవుతున్న అనేక చిత్రాలు సెన్సార్ బోర్డు ముందు ఆగిపోతున్నాయి. ప్రస్తుతం కన్నడ చిత్రం ‘కేడీ: ది డెవిల్’కి కూడా అదే పరిస్థితి ఎదురైంది. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ చిత్రాన్ని ఏప్రిల్ 30న కన్నడ సహా తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లోనూ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు తగినట్లుగానే ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కానీ, తీరా గురువారం ఈ మూవీ కేవలం కన్నడలో మాత్రమే విడుదలైంది. డబ్బింగ్ వెర్షన్‌కు సంబంధించి సెన్సార్ నుంచి అనుమతులు రాకపోవడంతో అనుకున్న సమయానికి ఇతర భాషల్లో ‘కేడీ’ రాలేకపోయాడు. ఇప్పటికీ తెలుగు వెర్షన్ డబ్బింగ్ పూర్తికాలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. అన్నీ అనుకున్నట్టు కుదిరితే మే7న తెలుగు సహా ఇతర భాషల్లో వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ విషయమై చిత్ర బృందంనుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తాజా పరిస్థితిపై కేవీఎన్ ప్రొడక్షన్స్ బిజినెస్ హెడ్ మోహన్ సుప్రీత్ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. “కన్నడ వెర్షన్‌కు సంబంధించి సెన్సార్ బోర్డు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసింది. మాతృక వెర్షన్‌కు సంబంధించి సెన్సార్ పూర్తవకుండా ఇతర భాషలకు పంపడానికి వీల్లేదు. దీంతో మాకు మరో మార్గం లేకుండా పోయింది. ఈ వారంలో డబ్బింగ్ వెర్షన్‌ను కూడా సర్టిఫికేషన్ కోసం పంపుతాం. త్వరలోనే అన్ని భాషల్లోనూ సినిమా విడుదలవుతుంది.

తెలుగు, మలయాళ, తమిళ, హిందీ భాషల్లో వచ్చేవారం సినిమా విడుదల కావచ్చు” అని అన్నారు. ఈ చిత్రంలో రీష్మా కథానాయిక. సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.

## దశాబ్దం తరువాత.. విక్రమ్ సినిమా రిలీజ్‌కు రెడీ



విక్రమ్ హీరోగా నటించిన ‘ధ్రువనక్షత్రం’ సినిమా విడుదలకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ మూవీ రిలీజ్‌కు మద్రాస్ హైకోర్టు అనుమతి ఇచ్చింది. జూన్ 15 లేదా అంతకన్నా ముందు విడుదలకు వీలు కల్పించింది. ‘కొండాడువోమ్ ఎంటర్టైన్మెంట్’ పేరిట బ్యాంకు ఖాతాను తెరవాలని, ఇకపై దీని ద్వారానే సినిమాకి సంబంధించిన ట్రాన్సాక్షన్స్ జరగాలని ఆదేశించింది. ఓ న్యాయవాది దీనిని పర్యవేక్షిస్తారని తెలిపింది. ఎంత ప్రయత్నించినా జూన్ 15లోగా విడుదల చేయడం సాధ్యంకాకపోతే.. కోర్టును సంప్రదించి, సమయం కోరవచ్చని చెప్పింది. 2016లో ప్రారంభమైన ఈ చిత్రాన్ని 2017లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు దర్శకుడు గౌతమ్ మేనన్. కానీ, ఆర్థిక సమస్యల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. 2023లో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. శింబు హీరోగా గౌతమ్ మేనన్ ఓ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఒప్పందం కుదుర్చుకుని, ఆ మేరకు రూ.2.4 కోట్లు తీసుకున్నారని, కానీ ఆయన సినిమాని పూర్తి చేయలేదని.. డబ్బు తిరిగి ఇవ్వలేదని ఆల్ ఇన్ పిక్చర్స్ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. నగదు తిరిగి ఇవ్వకుండా ‘ధృవ నక్షత్రం’ సినిమా విడుదల చేసేందుకు నిషేధం విధించాలని కోరింది. అలా మళ్లీ పోస్ట్‌పోన్ అవుతూనే వచ్చింది.

## ‘కల్కి-2’లో జేడీ లేడట!



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. ఈ సినిమా భారీ విజయాన్ని అందుకోవడంతో దీని సీక్వెల్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. కొన్ని రోజులుగా ఈ పార్ట్–2కు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ‘కల్కి–2’లో నటుడు జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. తాజాగా ఈ వార్తలను ఆయన ఖండించారు. జేడీ చక్రవర్తి నటించిన కొత్త సినిమా ‘గాయపడ్డ సింహం’. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో రూమర్స్ గురించి మాట్లాడుతూ.. తాను ఈ సీక్వెల్లో నటించడం లేదని స్పష్టం చేశారు. మీడియాలో వస్తున్నట్టు ‘కల్కి–2’కు సంబంధించిన ఏ షెడ్యూల్లోనూ తాను భాగం కాలేదన్నారు. కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలు విని ఎంజాయ్ చేశానన్న జేడీ.. వాటిలో నిజం లేదని పేర్కొన్నారు. దీంతో ఈ రూమరు చెక్ పడింది. ప్రస్తుతం ‘కల్కి 2898 ఏడీ’ సీక్వెల్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. మొదటి పార్టులో ప్రభాస్ కర్ణ, భైరవగా రెండు పాత్రల్లో అలరించారు. ఇప్పుడీ రెండో భాగంలో వాటితోపాటే మరో కొత్త లుక్‌లోనూ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచనున్నారని సమాచారం. మహాభారతంతో ముడిపడిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అశ్వత్థామగా అమితాబ్, సుప్రీం యాస్కిన్‌గా కమల్ హాసన్ కనిపించనున్నారు. మొదటి భాగంతో పోలిస్తే ఈ పార్టులో వారి పాత్ర నిడివి ఎక్కువగా ఉండనుంది.



## ‘కందుల సులోచనారాణి’గా అనుపమ

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ‘భోగి’ సినిమా రానున్న విషయం తెలిసిందే. ఇందులో శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి నటిస్తున్నారు. నేడు అనుపమ పాత్ర పేరును వెల్లడిస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్ పంచుకున్నారు. ఇందులో ఆమె ‘కందుల సులోచన రాణి’గా కనిపించనున్నారు.‘ప్రకృతి బిడ్డ.. గంగమ్మ నిలయం.. కందుల వారి గర్వం.. భోగి చిత్రానికి ఆమె ప్రాణం’ అంటూ అనుపమ పోస్టర్‌ను దర్శకుడు పంచుకున్నారు. 1960 నేపథ్యంలో సాగే కథతో రూపొందుతోన్న సినిమా ఆగస్టు 28న విడుదల కానుంది. ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెరపైకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే పలు షెడ్యూళ్లు పూర్తి చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన దీని కాన్సెప్ట్ వీడియోకు ఆదరణ సొంతమైంది. భారీస్థాయిలో ఈ సినిమా రానుంది. దర్శకుడి విజన్‌కి ప్రాణం పోయడం కోసం ప్రొడక్షన్ బృందం 20 ఎకరాల్లో, ఆరు నెలలపాటు శ్రమించి సెట్‌ని తీర్చిదిద్దింది.

## ప్రేమ్ గత పాటల్ని విస్మరిద్దామా?

ఓ పాట వివాదాస్పదం కావడంతో వార్తల్లో నిలిచిన కన్నడ సినిమా “కేడీ: ది డెవిల్. ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కిచ్చా సుదీప్ కీలక పాత్రలో నటించారు. తాజాగా ఆయన ఈ పాట వివాదం గురించి ప్రస్తావిస్తూ దర్శకుడిపై ప్రశంసలు కురిపించారు. బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో సుదీప్ మాట్లాడుతూ.. విమర్శలు చేసేటప్పుడు ఆ వ్యక్తి గతంలో చేసిన మంచిని కూడా గుర్తుంచుకోవాలని కోరారు. దర్శకుడిని వ్యక్తిగతంగా కించపరచడం సరికాదని అభిప్రాయపడ్డారు. “ప్రేమ్ గతంలో ఎన్నో ఎమోషనల్ సాంగ్స్ చేశారు. ముఖ్యంగా తల్లి ప్రేమ నేపథ్యంలో మనల్ని మన తల్లిదండ్రులకు దగ్గర చేసే అద్భుతమైన పాటలెన్నో రూపొందించారు. వాటిని మనం లూప్‌లో విన్నాం. కర్ణాటక బయట ఉన్నవారికి కన్నడ సినిమాకు ఆయన చేసిన సేవ గురించి తెలియకపోవచ్చు. అందుకే వారు విమర్శలు చేస్తున్నారు. ఇక్కడి వారు ఆయన చేసిన సేవలను గుర్తుపెట్టుకోవాలి. నేను ఈ పాటలో తప్పులేదని అనడం లేదు. కొన్నిసార్లు కొన్ని విషయాలు అనుకున్నట్లుగా జరగవు. అది సహజం. సోషల్ మీడియా అనేది అభిప్రాయాలను పంచుకోవడానికి వేదిక కావచ్చు. కానీ ఒక వ్యక్తిని ఇంత చిన్నచూపు చూడటం సరైన పద్ధతి కాదు. మనవాళ్ల పైనే మనం ఇంత కఠినంగా ఉండటం అవసరమా? దయచేసి ఇలా విమర్శించకండి. ఇది నా అభ్యర్థన మాత్రమే” అని అన్నారు. ధ్రువ్ సర్జా హీరోగా నటించిన సినిమా ఇది. ఇందులోని ‘సర్కే నిన్నా సెరగా సర్కే’ అంటూ సాగే కన్నడ సాంగ్‌తోపాటు.. ఇతర భాషల్లో డబ్ చేసిన పాటనూ ఇటీవల విడుదల చేశారు. ప్రధానంగా హిందీ వెర్షన్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో అన్ని ప్లాట్ఫామ్స్ నుంచి ఆ పాటను తొలగించారు.

